# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక
ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న
జనం రిపోర్టర్
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను.
అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు
సంప్రదించండి: 9398 15 6948

సంపుటి : 01 సంచిక : 218, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజీలు : 08, వెల రూ. 5రూ/ మంగళవారం -03 - డిసెంబర్ - 2024
Published From, Srikakulam : Circulated at,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool , Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad

## కువైట్ ఎయిర్ పోర్టులో భారతీయుల ఇబ్బందులు..
## 19 గంటల పాటు పడిగాపులు



- ముంబై నుంచి మాంచెస్టర్ వెళ తున్న విమానంలో మంటలు
- కువైట్ ఎయిర్ పోర్టులో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేసిన పైలట్
- కనీసం కూర్చోవడానికి కూడా సదుపాయం కల్పించలేదంటూ ప్రయాణికుల మండిపాటు

## యుద్ధాలతో ఆ కంపెనీలకు కళ్లు చెదిరే లాభాలు

ఏడాదిలో ఏకంగా రూ.53 లక్షల కోట్ల వ్యాపారం

నియామకాలు చేపట్టి భారీగా ఉత్పత్తి పెంచాల్సిన పరిస్థితి



స్టాక్ హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ,: దేశాల మధ్య యుద్ధం వస్తే ఇరువైపులా విధ్వంసం జరుగుతుంది.. ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లుతుంది. ప్రస్తుతం ఉక్రెయిన్ – రష్యా,

## అధ్యక్ష పీఠం నుంచి దిగిపోయే ముందు..
## జో బైడెన్ సంచలన నిర్ణయం



క్రిమినల్ కేసుల్లో కుమారుడు హంటర్ బైడెన్‌కు క్షమాభిక్ష ప్రసాదించిన బైడెన్

హంటర్‌పై కేసులు రాజకీయ ప్రేరేపితమని ఆరోపణ

## గృహజ్యోతి పథకంపై
## సీఎం రేవంత్ ట్వీట్



హైదరాబాద్ లో 10 లక్షలకు పైగా కుటుంబాలకు లబ్ది

సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్ గా ఇందిరమ్మ పాలన

ప్రజాప్రభుత్వం సంకల్పం సత్ఫలితాలిస్తోందన్న సీఎం

# మరో రెండు రోజుల్లో 593 మందికి సింగరేణి ఉద్యోగ నియామకపత్రాలు అందజేత

- డిసెంబరు 4న పెద్దపల్లిలో నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాల సభలో నియామక పత్రాలు అందజేయనున్నారు
- చరిత్రలో అత్యధికంగా 33 శాతం లాభాల వాటా బోనస్‌ను కార్మికులకు ఈ ఏడాది పంపిణీ చేశాము
- తొలిసారి కాంట్రాక్టు కార్మికులకు సైతం రూ.5 వేల వరకు లాభాల వాటా పంపిణీ చేశాము
- 90 రోజుల్లో అర్హులతో కూడిన జాబితా సిద్ధం చేసి నియామక ప్రక్రియ చేపట్టాలి

నియామక పత్రాలను సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదగా అందజేత



హైదరాబాద్,: సింగరేణి సంస్థలో ఇటీవల కొత్తగా ఉద్యోగ నియామకాలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ఉద్యోగాలకు ఎంపికైన 593 మందికి నియామక పత్రాలను సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదగా అందించనున్నారు. డిసెంబరు 4న పెద్దపల్లిలో నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాల సభలో ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేయ నున్నారని సింగరేణి సీఎండీ బలరాం ఓ ప్రకటనలో తెలిపారు. మిగతా 2లో..

## రేవంత్ రెడ్డి రెండు తలల పాము కంటే డేంజర్



డబుల్ టంగ్ లీడర్లతో ప్రమాదమన్న హరీశ్ రావు

ఈ నెల 7న ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జిషీట్ వేస్తామన్న హరీశ్ రావు

రాక్షసులు అన్న నోటితోనే దేవతలు అంటారని ఎద్దేవా

హైదరాబాద్, : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రెండు తలల పాము కంటే డేంజర్ అని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. మనం రెండు తలల పామును చూసి భయపడతాం... పాపం అది ఏమీ అనదు... పెద్ద ప్రమాదకరం కాదు... కానీ రెండు నాల్కల ధోరణి కలిగిన మనుషులు చాలా ప్రమాదమన్నారు. కానీ అలాంటి వారిని మనం పెద్దగా పట్టించుకోమన్నారు. బీఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... రెండు నాల్కల వైఖరికి నిదర్శనం నిస్సందేహంగా రేవంత్ రెడ్డే అన్నారు. రెండు వైపుల పదును కలిగిన కత్తితో కూడా జాగ్రత్తగా ఉండవచ్చు... కానీ ఈ డబుల్ టంగ్ లీడర్లతో మాత్రం

## జగన్ అక్రమాస్తుల కేసు... ఈడీ, సీబీఐకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు




కేసుల విచారణ ఆలస్యమవుతోందని రఘురామకృష్ణరాజు పిటిషన్

కింది కోర్టుల్లో పిటిషన్లపై పూర్తి వివరాలు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశం

తదుపరి విచారణ ఈనెల 13కు వాయిదా

## రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటన ఖరారు..

వెల్లడించిన క్రెమ్లిన్ అధికార ప్రతినిధి..!



- ఈ పర్యటన పుతిన్‌కు ఎంతో కీలకం కానున్నది
- వాస్తవానికి రష్యా, భారత్ మధ్య ఓ ఒప్పందం
- రిపబ్లిక్ డే వేడుకలకు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది

న్యూఢిల్లీ,: రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ వచ్చే ఏడాది జనవరిలో భారత్‌లో పర్యటించనున్నారు. అయితే, ఇప్పటి వరకు తేదీ ఖరారు కాలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు.. పుతిన్ భారత పర్యటనకు వస్తున్నారు. ఈ మేరకు రష్యా రాయబార కార్యాలయం ఈ విషయాన్ని వెల్లడించింది. క్రెమ్లిన్ అధికార ప్రతినిధి యూరీఉషాకోవ్ మీడియాతో మాట్లాడుతూ

# ఫోన్ కొట్టు.. పల్స్ పట్టు..

ఇకపై ప్రతీ అంశంపై లబ్దిదారులకు ఐవీఆర్ఎస్ కాల్స్..

పౌర సేవలపైనా ఐవీఆర్ఎస్..

ప్రజలు కూడా ఓపికగా సమాధానాలు చెప్పాలని కోరుతున్న సీఎం

తీసుకునే నిర్ణయాలపై ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయం

ఇకపై అలా నడవాల్సిందే..
చంద్రబాబు సర్కార్ సంచలన ఆదేశాలు..




అమరావతి,: చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సరికొత్త నిర్ణయాన్ని తీసుకుంది. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, పౌర సేవలపై ప్రజల నుంచి నిరంతర ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నది ఆ నిర్ణయం. ఆ ఫీడ్ బ్యాక్ ఆధారంగానే సేవలలో మిగతా 2లో..

# సీఎం చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ..

భేటీలో వీరిద్దరి మధ్య పలు కీలక అంశాలు చర్చ

ముఖ్యంగా రాజ్యసభ సభ్యుల ఎంపిక, బీజేపీ ప్రతిపాదనపై చర్చ

కాకినాడలో రేషన్ బియ్యం మాఫియా పైనా సీఎం, డిప్యూటీ సీఎం చర్చించారు

డిసెంబర్ 3 నుంచి నామినేషన్ల స్వీకరణ..


వైసీపీ రాజ్యసభ సభ్యుల రాజీనామాతో ఖాళీ అయిన మూడు స్థానాల్లో.. ఎన్నికలు

## చర్చంతా వాటిపైనే..



అమరావతి,: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. సోమవారం మధ్యాహ్నం ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఈ భేటీలో వీరిద్దరి మధ్య పలు కీలక అంశాలు చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా రాజ్యసభ సభ్యుల ఎంపిక, బీజేపీ ప్రతిపాదనపై మిగతా 2లో..

## కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది



- కూటమి ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందన్న అంజాద్ బాషా
- ఆరు నెలలలో కూటమి ప్రభుత్వం ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నఅంజాద్
- వక్ఫ్ బోర్డు జీవో రద్దు చేయడం దుర్మార్గమన్న అంజాద్ బాషా

# నిజాలు వెలికితీయాలి

ఇటీవల కాకినాడ పోర్టులో పవన్ కల్యాణ్ తనిఖీలు

- అక్రమ బియ్యం పట్టుకునేందుకు బోట్లు వేసుకుని సముద్రంలో హడావిడి చేయడం కాదు...
- పీడీఎస్ బియ్యం తరలింపు వెనుక పెద్ద మాఫియా ఉందన్న షర్మిల
- ఇదో జాతీయస్థాయి కుంభకోణం అని వ్యాఖ్యలు
- నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్
- ప్రత్యేక దర్యాప్తు కమిటీ, లేక, సీబీఐతో విచారణ జరిపించాలంటూ ట్వీట్



అమరావతి,: ఏపీ డిప్యూటీ సీఎంపవన్ కల్యాణ్ కొన్ని రోజుల కిందకాకినాడ పోర్టులో తనిఖీలు చేపట్టిన నేపథ్యంలో ,రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో స్పందించారు. రాష్ట్రంలో పీడీఎస్ బియ్యం విదేశాలకు తరలించడం వెనుక పెద్ద మాఫియా ఉందని, ఇదో జాతీయస్థాయి కుంభకోణం అని పేర్కొన్నారు. అక్రమ బియ్యాన్ని పట్టుకునేందుకు బోట్లు వేసుకుని సముద్రంలో హడావిడి చేయడం కాదు... నిజాలు వెలికి తీయాలి...

జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక
మంగళవారం - 03 - డిసెంబర్ - 2024

### కువైట్ ఎయిర్ పోర్టులో భారతీయుల ఇబ్బందులు..

## 19 గంటల పాటు పడిగాపులు

మొదటి పేజి తరువాయి

న్యూఢిల్లీ,: ముంబై నుంచి మాంచెస్టర్ బయలుదేరిన ప్రయాణికులు కువైట్ ఎయిర్ పోర్టులో దాదాపు 19 గంటల పాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారు ప్రయాణిస్తున్న గల్ఫ్ ఎయిర్ విమానం అత్యవసరంగా కువైట్ లో ల్యాండ్ కావడంతో ఈ సమస్య ఎదురైంది. ఎయిర్ పోర్ట్ లో భారతీయులకు కనీసం కూర్చోవడానికి కూడా సదుపాయం కల్పించలేదని, నాలుగు గంటల దాకా తాగడానికి నీళ్లు అడిగినా ఇవ్వలేదని ప్రయాణికులు తీవ్రంగా మండిపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గల్ఫ్ ఎయిర్ కు చెందిన విమానం ఆదివారం ముంబై నుంచి మాంచెస్టర్ కు బయలుదేరింది. ఇంజన్ లో పొగ, మంటలు రావడంతో పైలట్ విమానాన్ని కువైట్ లో ఎమర్జెన్సీ ల్యాండ్ చేశాడు. ప్రయాణికులను దింపి మంటలు ఆర్పే ప్రయత్నాలు చేపట్టారు. సాధారణంగా ఇలా ఎమర్జెన్సీ ల్యాండింగ్ జరిగినపుడు కానీ, విమానం ఆలస్యం అయినపుడు కానీ ప్రయాణికులకు ఎయిర్ పోర్ట్ సమీపంలోని హోటళ్లలో వసతి ఏర్పాటు చేస్తారు. కువైట్ లో మాత్రం ట్రాన్సిట్ వీసా లేదంటూ భారతీయ ప్రయాణికులను కనీసం ఎయిర్ పోర్ట్ లాంజ్ లోకి కూడా అనుమతించలేదు. విషయం తెలిసి కువైట్ లోని భారత రాయబార కార్యాలయం స్పందించడంతో లాంజ్ లోకి అనుమతించారు. ఆ తర్వాత కూడా కనీస సదుపాయాలు కల్పించలేదని ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కువైట్ లో జీసీసీ సమిట్ జరుగుతోందని, ఎయిర్ పోర్ట్ లోని హోటల్ లో ఖాళీ లేదని చెప్పారన్నారు. కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా లేకపోవడంతో లాంజ్ లో కిందనే కూర్చున్నామని, పిల్లలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వాపోయారు. జీసీసీ సమిట్ కారణంగా స్థానిక ప్రభుత్వ కార్యాలయాలన్నీ మూసివేయడంతో భారతీయులకు సాయం అందడంలేదని రాయబార కార్యాలయం అధికారులు తెలిపారు. దాదాపు 19 గంటల తర్వాత సోమవారం తెల్లవారుజామున 4:30 గంటలకు వారి విమానం మాంచెస్టర్ కు బయలుదేరిందని వివరించారు.

## యుద్ధాలతో ఆ కంపెనీలకు కళ్లు చెదిరే లాభాలు

మొదటి పేజి తరువాయి

న్యూఢిల్లీ,: దేశాల మధ్య యుద్ధం వస్తే ఇరువైపులా విధ్వంసం జరుగుతుంది.. ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లుతుంది. ప్రస్తుతం ఉక్రెయిన్ – రష్యా, ఇజ్రాయెల్ – గాజా దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలే దీనికి నిదర్శనం. అదే సమయంలో ఈ యుద్ధాలతో కొన్ని కంపెనీలు విపరీతంగా లాభాలను ఆర్జిస్తున్నాయని స్టాక్ హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ (సిప్రి) నివేదిక వెల్లడించింది. యుద్ధాల కారణంగా ఆయుధాలకు భారీగా డిమాండ్ ఏర్పడిందని, ఆయుధ తయారీ కంపెనీలు భారీగా నియామకాలు చేపట్టి పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాల్సి వస్తోందని తెలిపింది. అయినప్పటికీ డిమాండ్ కు తగ్గట్లు ఆయుధాలను సరఫరా చేయలేకపోతున్నాయని వివరించింది. 2022 లో ఆయుధ కంపెనీల పరిస్థితి పెద్దగా ఆశాజనకంగా లేదని సిప్రి తెలిపింది. అయితే, 2023 లో మాత్రం ఆయుధ తయారీ కంపెనీలు ఏకంగా రూ.53 లక్షల కోట్ల వ్యాపారం చేశాయని పేర్కొంది. 2024లోనూ ఇదే ట్రెండ్ కొనసాగుతోందని, డిమాండ్ ను అందుకోవడానికి ఆయుధ కంపెనీలు భారీగా నియామకాలు చేపట్టి ఉత్పత్తిని గణనీయంగా పెంచాయని వివరించింది. అయినప్పటికీ డిమాండ్ ను అందుకోవడం టాప్ 100 ఆయుధ ఉత్పత్తి కంపెనీలకు సాధ్యం కావడంలేదని తెలిపింది. టాప్ 100 కంపెనీలలో 41 కంపెనీలు అమెరికాలోనే ఉన్నాయని, ఆయుధ విక్రయాలలో ఈ కంపెనీలు 2023 ఆర్థిక సంవత్సరం 2.3 శాతం వృద్ధిని సాధించాయని సిప్రి తన నివేదికలో వెల్లడించింది. ఐరోపాలోని 27 భారీ ఆయుధ తయారీ సంస్థలు సగటున కేవలం 0.2 శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేశాయని తెలిపింది. రష్యా కంపెనీలు మొత్తం సగటున 40 % వృద్ధిని, ప్రభుత్వ రంగంలోని రోస్‌టెక్ 49 శాతం వృద్ధిని నమోదు చేశాయని సిప్రి పేర్కొంది. ఇజ్రాయెల్ లోకి 3 కంపెనీలు ఏకంగా 13.6 బిలియన్ డాలర్ల ఆయుధాలను, చైనా కంపెనీలు 103 బిలియన్ డాలర్ల ఆయుధాల అమ్మకాలు జరపగా.. తుర్కియేలోని డ్రోన్ తయారీ సంస్థ బేకర్ 24 శాతం వృద్ధి నమోదు చేసిందని సిప్రి తన నివేదికలో తెలిపింది.

### అధ్యక్ష పీఠం నుంచి దిగిపోయే ముందు..

## జో బైడెన్ సంచలన నిర్ణయం

మొదటి పేజి తరువాయి

నేషనల్ డెస్క్:అమెరికా అధ్యక్ష పీఠం నుంచి వైదొలగే ముందు జోబైడెన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన కుమారుడు హంటర్ బైడెన్‌పై ఉన్న అక్రమ ఆయుధ కొనుగోలు సహా రెండు క్రిమినల్ కేసుల్లో క్షమాభిక్ష ప్రసాదించారు. ఈ సందర్భంగా బైడెన్ మాట్లాడుతూ తన కుమారుడిపై ఉన్న కేసులు రాజకీయ ప్రేరేపితమైనవని ఆరోపించారు. న్యాయశాఖ తీసుకునే నిర్ణయాల్లో తాను జోక్యం చేసుకోబోనని, ఇదే విషయాన్ని అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాడే చెప్పానని పేర్కొన్నారు. ఆ మాటకు కట్టుబడి ఉండి తన కుమారుడిని అన్యాయంగా విచారించే సమయంలోనూ మౌనంగానే ఉన్నానని గుర్తు చేసుకున్నారు. రాజకీయ కుట్రలో భాగంగా హంటర్‌పై పెట్టిన కేసుల్లో క్షమాభిక్ష ప్రసాదించాలని నిర్ణయించినట్టు తెలిపారు. తండ్రిగా, అధ్యక్షుడిగా ఈ నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందో ప్రజలు అర్థం చేసుకుంటారని భావిస్తున్నట్టు వివరించారు.

హంటర్‌పై కేసులు ఎందుకంటే?

హంటర్ బైడెన్ 2018లో తుపాకి కొంటూ ఆయుధ డీలర్‌కు ఇచ్చిన ఫారంలో తప్పుడు సమాచారం ఇచ్చారు. అయితే, తన వద్ద అక్రమ ఆయుధం లేదని, తాను అక్రమంగా డ్రగ్స్ కొనుగోలు చేయలేదని తెలిపారు. ఈ రెండు విషయాల్లోనూ ఆయన చెప్పింది అబద్ధమని తేలింది. ఆయన 11 రోజులపాటు అక్రమ ఆయుధం కలిగి ఉండడంతోపాటు కాలిఫోర్నియాలో 1.4 మిలియన్ డాలర్ల పన్ను ఎగవేతకు పాల్పడినట్టు కేసు నమోదైంది. అక్రమ ఆయుధం కేసులో ఈ ఏడాది జూన్‌లో హంటర్‌ను న్యాయస్థానం దోషిగా నిర్ధారించినా శిక్ష ఖరారు చేయలేదు. అప్పట్లో జో బైడెన్ మాట్లాడుతూ తన కుమారుడి తరపున క్షమాభిక్ష కోరబోనని స్పష్టం చేశారు. మరో నెల రోజుల్లో అధ్యక్ష పీఠం నుంచి వైదొలగే వేళ కుమారుడికి ఆ కేసుల నుంచి విముక్తి కల్పిస్తూ క్షమాభిక్ష ప్రసాదించడం చర్చనీయాంశమైంది.

## గృహజ్యోతి పథకంపై సీఎం రేవంత్ ట్వీట్

మొదటి పేజి తరువాయి

**హైదరాబాద్, :** పేదలపై కరెంట్ బిల్లు భారం తప్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం 'గృహజ్యోతి' పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం కింద నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ ను వినియోగించే కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా కరెంట్ అందిస్తోంది. దీంతో ఆయా కుటుంబాలకు కరెంట్ బిల్లు చెల్లించే అవసరం తప్పింది. ఆమేరకు కుటుంబాలపై భారం తగ్గింది. ఈ పథకంపై తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర ట్వీట్ చేశారు. పేదల ఇంట విద్యుత్ వెలుగులు పంచాలన్న ప్రజా ప్రభుత్వ సంకల్పం సత్ఫలితాలను ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం కింద కేవలం హైదరాబాద్ లోనే 10.52 లక్షల కుటుంబాలు లబ్ది పొందుతున్నాయని సీఎం చెప్పారు. ఈ పరిణామం హర్షణీయం అని పేర్కొన్నారు. సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్ గా ఇందిరమ్మ పాలన నిలుస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

### జగన్ అక్రమాస్తుల కేసు...

## ఈడీ, సీబీఐకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

మొదటి పేజి తరువాయి

అమరావతి,: వైసీపీ అధినేత జగన్ అక్రమాస్తుల కేసులో పూర్తి వివరాలను అందించాలని ఈడీ, సీబీఐలను సుప్రీంకోర్టు ఆదేశించింది. 2 వారాల్లోగా వివరాలను అందించాలని ఆదేశాలు జారీ చేసింది. కింది కోర్టుల్లో ఉన్న డిశ్చార్జి పిటిషన్లు, తెలంగాణ హైకోర్టులో ఉన్న పెండింగ్ అప్లికేషన్ల వివరాలను అందించాలని ఆదేశించింది. ఈడీ, సీబీఐ రెండూ విడివిడిగా చార్ట్ రూపంలో వివరాలను అందించాలని చెప్పింది. జగన్ అక్రమాస్తుల కేసు విచారణ ఆలస్యమవుతోందని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. కేసు విచారణను మరో రాష్ట్రానికి వాయిదా వేయాలని పిటిషన్ లో ఆయన కోరారు. ఈ పిటిషన్ ను ఈరోజు జస్టిస్ ఓకా ధర్మాసనం విచారించింది. రోజువారీ పద్ధతిలో విచారణకు ఇప్పటికే తెలంగాణ హైకోర్టు ఆదేశించిందని సుప్రీంకోర్టు దృష్టికి న్యాయవాదులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ... ఇన్నేళ్లపాటు విచారణ ఎందుకు ఆలస్యమవుతోందని ప్రశ్నించింది. దీనికి సమాధానంగా... డిశ్చార్జి పిటిషన్లు, వాయిదా పిటిషన్లు, ఉన్నత కోర్టులో విచారణ పెండింగే ఆలస్యానికి కారణమని న్యాయవాదులు తెలిపారు. పెండింగ్ లో ఉన్న కేసుల వివరాలు ఇస్తే... తగిన ఆదేశాలను జారీ చేస్తామని చెప్పిన సుప్రీంకోర్టు తదుపరి విచారణను ఈనెల 13కు వాయిదా వేసింది.

## రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటన ఖరారు..

పుతిన్ భారత పర్యటనకు వస్తున్నారు. ఈ మేరకు రష్యా రాయబార కార్యాలయం ఈ విషయాన్ని వెల్లడించింది. క్రెమ్లిన్ అధికార ప్రతినిధి యూరీఉషాకోవ్ మీడియాతో మాట్లాడుతూ.. ఏడాదికోసారి సమావేశంలో కావాలని నేతలు ఒప్పందం చేసుకున్నారన్నారు. ప్రధాని మోదీ నుంచి ఆహ్వానం అందిందన్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో పర్యటన తేదీ ఖరారయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం మొదలయ్యాక పుతిన్ భారత్‌లో పర్యటించనుండడం ఇదే తొలిసారి కానున్నది. ఈ పర్యటన పుతిన్‌కు ఎంతో కీలకం కానున్నది. ముఖ్యంగా ఇరుదేశాలు యుద్ధం ఆపాలని భారత్ విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. వాస్తవానికి రష్యా, భారత్ మధ్య ఓ ఒప్పందం జరిగింది. దాని ప్రకారం అగ్రనేతలు సంవత్సరంలో ఒకసారి ఒకరి దేశంలో మరొకరు సంప్రదించాల్సి ఉంది. ఈ మేరకు పుతిన్ భారత పర్యటనకు రానున్నారు. అయితే, ఆయన రిపబ్లిక్ డే వేడుకలకు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. భారత్ రిపబ్లిక్ డే వేడుకలకు వివిధ దేశాలకు చెందిన ప్రధానులు, అధ్యక్షులను ఆహ్వానించే విషయం తెలిసిందే. ఈ ఏడాది ప్రధాని మోదీ రష్యాలో పర్యటించిన విషయం తెలిసిందే. జులైలో రష్యాలో పర్యటించి.. శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యారు. తర్వాత బ్రిక్స్ సదస్సుకు మోదీ హాజరయ్యారు. ఇదిలా ఉండగా.. వచ్చే ఏడాది అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సైతం భారత్‌లో పర్యటించనున్నారు. క్వాడ్ సదస్సులో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు రానున్నారు.

## మరో రెండు రోజుల్లో 593 మందికి సింగరేణి ఉద్యోగ నియామకపత్రాలు అందజేత

మొదటి పేజి తరువాయి



డిసెంబరు 4న పెద్దపల్లిలో నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాల సభలో ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేయనున్నారని సింగరేణి సీఎండీ బలరాం ఓ ప్రకటనలో తెలిపారు. విజయోత్సవాల నిర్వహణపై ఆయన తాజాగా సమీక్ష నిర్వహించారు. విజయోత్సవాల్లో భాగంగా సింగరేణిలో కూడా కార్యక్రమాలు జరగనున్నాయి. దీంతో సింగరేణిలో ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. గత ఏడాది కాలంలో సింగరేణిలో దాదాపు 2,165 మందికి కొత్తగా ఉద్యోగాలు కల్పించామని ఆయన అన్నారు. చరిత్రలో అత్యధికంగా 33 శాతం లాభాల వాటా బోనస్‌ను కార్మికులకు ఈ ఏడాది పంపిణీ చేశామని, దీంతో ఒక్కొక్కరికి రూ.1,90,000 వరకు లాభాల వాటా అందిందని ఆయన పేర్కొన్నారు. తొలిసారి కాంట్రాక్టు కార్మికులకు సైతం రూ.5 వేల వరకు లాభాల వాటా పంపిణీ చేశామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. మరో రెండు రోజుల్లో నిర్వహించనున్న సింగరేణి ఉద్యోగ నియామకపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని పండగలా నిర్వహించాలని ఆయన అధికారులను అదేశించారు.

'ఎంపీహెచ్ఏల నియామకం చెల్లదు.. ఈ జీవో చట్ట విరుద్ధం'.. తెలంగాణ హైకోర్టు

2002లో జారీ చేసిన మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్(ఎంపీహెచ్ఏ) నోటిఫికేషన్ అర్హతల వివాదంపై సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు అప్పట్లో పెను ప్రకంపనలు సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే ఈ తీర్పులను కాదని నాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం జీవో ద్వారా నియామకాలు చేపట్టడం చెల్లదని తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించింది. నాటి కోర్టు ఉత్తర్వులతో తొలగించిన 1200 మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో తిరిగి విధుల్లోకి తీసుకుంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 1207 చట్టవిరుద్ధమని వ్యాఖ్యానించింది. 90 రోజుల్లో అర్హులతో కూడిన జాబితా సిద్ధం చేసి నియామక ప్రక్రియ మళ్లీ చేపట్టాలని హైకోర్టు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావులతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది.

## రేవంత్ రెడ్డి రెండు తలల పాము కంటే డేంజర్

మొదటి పేజి తరువాయి



రెండు నాల్కల వైఖరికి నిదర్శనం నిస్సందేహంగా రేవంత్ రెడ్డే అన్నారు. రెండు వైపుల పదును కలిగిన కత్తితో కూడా జాగ్రత్తగా ఉండవచ్చు... కానీ ఈ డబుల్ టంగ్ లీడర్లతో మాత్రం చాలా ప్రమాదకరమన్నారు. సమాజానికి చాలా నష్టం చేస్తారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎలా మాట్లాడారు... అధికారంలోకి వచ్చాక ఇప్పుడు ఎలా మాట్లాడుతున్నారో... ఆ రెండు నాల్కల ధోరణి ఏమిటో వెల్లడిస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక రేవంత్ మాట తీరులో మార్పు వచ్చిందని ఆరోపించారు. ఈ నెల ఏడో తేదీన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జ్‌షీటు వేస్తామని తెలిపారు. సీఎం అయ్యాక కూడా ఆయన మాట మార్చిన తీరును అందరూ గమనిస్తూనే ఉన్నారన్నారు. రెండు నాల్కల ధోరణిలో రేవంత్ రెడ్డి పీహెచ్‌డీ చేశారని ఎద్దేవా చేశారు. మాట మార్చడంలో, పూటకో మాట మాట్లాడడంలో రేవంత్ రెడ్డి దిట్ట అన్నారు. ఆ మాట అనలేదు... ఈ మాట అనలేదంటూ ముచ్చటగా మూడో మాట చెప్పగల నేర్పరితనం కూడా రేవంత్ రెడ్డిలో ఉందని ఎద్దేవా చేశారు. ఓ పార్టీలో ఉంటూ మరో పార్టీ అగ్రనాయకులను రాక్షసులు అంటారని, ఆ తర్వాత అదే పార్టీలో చేరి రాక్షసులు అన్న నోటితోనే దేవతలు అంటారని వ్యాఖ్యానించారు. సిగ్గు, ఎగ్గు లేకుండా మాట్లాడటం రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. రైతు బంధు, రైతు బీమా ఇచ్చింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. కానీ కాంగ్రెస్ వీటిని పక్కన పెట్టిందని విమర్శించారు. ఎల్ఆర్ఎస్ విషయంలో గతంలో తమ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారన్నారు. ఇప్పుడు ఆయన అధికారంలోకి వచ్చాక ప్రజలతో రూ.15 వేల కోట్లు కట్టించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. పేదలపై ప్రేమ ఉంటే ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలన్నారు. గతంలో తాము సమగ్ర సర్వే చేస్తే విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడెలా చేస్తున్నారని నిలదీశారు.

## ఫోన్ కొట్టు.. పల్స్ పట్టు..

మొదటి పేజి తరువాయి




ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, పౌర సేవలపై ప్రజల నుంచి నిరంతర ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నది ఆ నిర్ణయం. ఆ ఫీడ్ బ్యాక్ ఆధారంగానే సేవలలో మార్పులు, కొనసాగించాలని ముఖ్యమంత్రి తాజా ఆదేశాలిచ్చారు.. మెరుగైన సేవల కోసం నేరుగా లబ్ధిదారుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టాలని సూచించారు. అందుకు ఐవీఆర్ఎస్ విధానాన్ని విస్తృతంగా ఉపయోగించాలని సూచించారట. ఏ అంశంపైనైనా ప్రజలు చెప్పిందే ఫైనల్ కావాలని, నాణ్యమైన సేవల కోసం ఖచ్చితమైన అభిప్రాయం చెప్పాలని కూడా ప్రజలను కోరుతున్నారు ఏపీ సీఎం చంద్రబాబు.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలు, చేపట్టే కార్యక్రమాలు, తీసుకునే నిర్ణయాలపై ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు వారి అభిప్రాయాల మేరకు నడుచుకోవాలనుకుంటోంది. దీనిలో భాగంగా ఇకపై ప్రభుత్వం అమలు చేసే పథకాలపై ఐవీఆర్ఎస్ ఫోన్లు చేయడం ద్వారా ఆయా కార్యక్రమాల అమలు తీరును తెలుసుకోనుంది. లబ్ధిదారులకే నేరుగా కంప్యూటర్ బేస్డ్ ఫోన్ కాల్స్ ద్వారా ఆ పథకం వల్ల ప్రయోజనం, దాని అమలు, సేవల్లో నాణ్యత వంటి అంశాలపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోనుంది.

ఇకపై ప్రతీ అంశంపై లబ్ధిదారులకు ఐవీఆర్ఎస్ కాల్స్..

లబ్ధిదారుల నుంచి ఆయా పథకాల అమలుపై వారి అభిప్రాయం కోరుతూ ఐవీఆర్ఎస్ కాల్స్ వెళతాయి. వాటిపై ప్రజలు ఇచ్చే రేటింగ్ ఆధారంగా ప్రభుత్వం మార్పులు చేర్పులు చేసుకుని పని చేయనుంది. ఇంటింటికీ పింఛన్లు, దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాల లబ్దిదారుల నుంచి ఈ ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. పింఛను సక్రమంగా ఇంటి వద్దనే అందుతుందా లేదా..? దీపం పథకం ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..? వంటి ప్రశ్నల ద్వారా లబ్దిదారుల నుంచి ఇకపై నిరంతరం అభిప్రాయాలు తీసుకోనున్నారు.

పౌర సేవలపైనా ఐవీఆర్ఎస్..

పథకాలతో పాటు ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీల అమలుపైనా ప్రజాభిప్రాయం తెలుసుకోనుందట చంద్రబాబు ప్రభుత్వం. ఉచిత ఇసుక విధానం అమలు, మద్యం కొత్త పాలసీ, అమ్మకాలపైనా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నారు. పథకాలు, కార్యక్రమాలతో పాటు రానున్న రోజుల్లో రెవెన్యూ, మునిసిపల్, విద్యుత్ వంటి పలు కీలక శాఖల్లో ప్రజలు పొందుతున్న పౌరసేవలపై కూడా ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి సమాచారం సేకరించనున్నారు. నేరుగా ప్రజల నుంచి వచ్చే ఈ సమాచారంలో ప్రజలు ఎక్కడైనా అసంతృప్తి వ్యక్తం చేస్తే..వాటికి గల కారణాలు విశ్లేషించి సేవలను మరింత మెరుగుపరచనున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల్లో కూడా బాధ్యత పెంచి మంచి సేవలు ప్రజలకు అందేలా చేయాలని ప్రభుత్వం భావిస్తోందట.. ప్రజలు చెప్పిందే ఫైనల్ అనే విషయం ప్రాతిపదికన ప్రభుత్వం పనిచేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారట..

ప్రజలు కూడా ఓపికగా సమాధానాలు చెప్పాలని కోరుతున్న సీఎం

అదే సమయంలో ఇలా ప్రభుత్వం నుంచి వచ్చే ఫోన్ కాల్స్ కు ప్రజలు ఒపిగ్గా తమ అభిప్రాయాలు చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరుతున్నారు. ఈ ఫోన్ కాల్స్ కు ప్రజలు వెచ్చించే ఒకటి రెండు నిముషాల సమయంతో ప్రభుత్వ నుంచి ఉత్తమ సేవలు పొందే అవకాశం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దీనికి ప్రజలు తమ వంతుగా సహకరించాలని.. మంచి పాలనకు, నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందించే కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఐవిఆర్ఎస్ విధానం ద్వారా వచ్చే ఖచ్చితమైన అభిప్రాయాల ద్వారా గతంలో మంచి ఫలితాలు సాధించిన సందర్భాలు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో పార్టీ అభ్యర్థుల ఖరారు విషయంలో చంద్రబాబు ఇదే విధానాన్ని పాటించారు. అలాగే విజయవాడ వరదల సమయంలో ప్రజలకు ప్రభుత్వం నుంచి అందే సాయంపైనా కాల్స్ ద్వారా సమాచారం తీసుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల్లో దీన్ని విరివిగా వాడేందుకు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారనీ సీఎంఓ తెలిపింది.

## సీఎం చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ..

మొదటి పేజి తరువాయి



ఈ భేటీలో వీరిద్దరి మధ్య పలు కీలక అంశాలు చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా రాజ్యసభ సభ్యుల ఎంపిక, బీజేపీ ప్రతిపాదనపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది. ఇటీవల ఢిల్లీ పర్యటన వివరాలను చంద్రబాబు దృష్టికి పవన్ తీసుకొచ్చినట్లు సమాచారం.. అంతే కాకుండా తాజా రాజకీయ పరిణామాలు సైతం ప్రస్తావనకు వచ్చాయి. కాకినాడలో రేషన్ బియ్యం మాఫియా పైనా సీఎం, డిప్యూటీ సీఎం చర్చించారు. ఇక సోషల్ మీడియాలో పోస్టులపై తీసుకుంటున్న చర్యలపైనా ఇరువురు నేతలు చర్చించినట్టు తెలుస్తోంది.. వైసీపీ రాజ్యసభ సభ్యుల రాజీనామాతో ఖాళీ అయిన మూడు స్థానాల్లో.. ఎన్నికలు జరగనున్నాయి.. రేపటి నుంచి నామినేషన్లను స్వీకరించనున్న తరుణంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ భేటీ కావడం ఆసక్తి రేపింది.. ఈ భేటీలో రాజ్యసభకు వెళ్లే వారి పేర్లు తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది.. టీడీపీకి ప్రస్తుతం రాజ్యసభలో ప్రాతినిథ్యం లేదు. దీంతో ఈ ఉప ఎన్నిక ద్వారా పెద్దల సభలోకి మళ్లీ ఎంట్రీ అవ్వాలని భావిస్తోంది.. అయితే.. రాజ్యసభ రేసులో టీడీపీ నుంచి మాజీ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, ఇక గుంటూరు ఎంపీ సీటును త్యాగం చేసిన మాజీ ఎంపీ గల్లా జయదేవ్, కంభంపాటి రామ్మోహన్ ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది.. జనసేన కూడా ఓ స్థానాన్ని అడుగుతున్నట్లు సమాచారం.. పొత్తు ధర్మంలో భాగంగా.. అనకాపల్లి లోక్ సభ సీటుని త్యాగం చేసిన మెగాబ్రదర్ నాగబాబు కూడా రేసులో ఉన్నారని సమాచారం.. దీంతో ఆయనకు రాజ్యసభ అవకాశం ఇవ్వాలన్న వాదన వినిపిస్తోంది. ఇక బీజేపీ కూడా మిత్రధర్మంగా తమకు ఒక సీటును ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. ఆపార్టీ నుంచి మాజీ సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి రేసులో ఉన్నట్లు సమాచారం.. ముఖ్యంగా రాజ్యసభ ఎన్నికలపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు టాక్ వినిపిస్తోంది..

డిసెంబర్ 3 నుంచి నామినేషన్ల స్వీకరణ..

రాజ్యసభకు డిసెంబర్ 3 నుంచి 10 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు డిసెంబర్ 13. డిసెంబర్ 20న పోలింగ్ నిర్వహించి అదే రోజు ఫలితాలను ప్రకటించనుంది ఎన్నికల సంఘం.. కాగా.. ఒక్క రాజ్యసభ అభ్యర్థి విజయం సాధించాలంటే కనీసం 25 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం.. ప్రస్తుతం వైసీపీ బలం 11 మాత్రమే. అందువల్ల ఆ పార్టీ రాజ్యసభ బరిలో నిలిచే అవకాశం లేదు. దీంతో మొత్తం రాజ్యసభ స్థానాలు కూటమి పార్టీలకే దక్కనున్నాయి..

## కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది

మొదటి పేజి తరువాయి



**అమరావతి,:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని వైసీపీ సీనియర్ నేత, ఏపీ మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్ ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చారన్నారు. నిధులు లేవంటూ మాజీ సీఎం వైఎస్ జగన్‌పై నిందలు వేస్తూ కాలయాపన చేస్తున్నారని ఆయన విమర్శించారు. కేవలం కక్షసాధింపు చర్యలు మాత్రమే ఈ ప్రభుత్వంలో కనబడుతున్నాయన్నారు. రాజ్యాంగబద్ధంగా గత ప్రభుత్వ హాయంలో వక్ఫ్ బోర్డును ఏర్పాటు చేస్తే ఆ జివోను ఈ ప్రభుత్వం ఉపసంహరించుకోవడం దుర్మార్గమన్నారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎన్నిక వ్యవహారం కోర్టులో ఉండగా, కమిటీకి ఐదేళ్ల పదవీ కాలం ఉండగా ఎలా రద్దు చేస్తారని ఆయన ప్రశ్నించారు. కేవలం టీడీపీ వారిని నియమించుకుని వక్ఫ్ ఆస్తులను దురాక్రమణ చేయాలన్న ఉద్దేశంతోనే ఆ జివో రద్దు చేశారని ఆయన ఆరోపించారు. వక్ఫ్ బోర్డు చాలా కాలంగా పని చేయడం లేదన్న కారణం చూపి రద్దు చేశామని చెప్తున్నారని, కోర్టులో కేసులు వేసి పని చేయకుండా చేసింది టీడీపీ వారు కాదా? అని ప్రశ్నించారు. నిజంగా వారికి చిత్తశుద్ధి ఉంటే కోర్టులో రిట్లను ఉపసంహరించుకోవాలి కానీ బోర్డు రద్దు చేయడం ఏమిటని ప్రశ్నించారు. 2014 -18 మధ్యలో చంద్రబాబు అసలు వక్ఫ్ బోర్డునే వేయలేదని అన్నారు. 2018లో చంద్రబాబు కమిటీ వేస్తే దాని పదవీ కాలం 2023 వరకూ ఉందని , తాము అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు మాదిరిగా ఆ బోర్డును రద్దు చేయలేదన్నారు. నాడు జలీల్ ఖాన్, అమీర్ బాబు వంటి వారు రాజీనామా చేసి వెళ్లిపోయారన్నారు. ఆ బోర్డు కాలపరిమితి ముగిసిన తర్వాత మాత్రమే జగన్ ప్రభుత్వం కొత్త బోర్డు వేయడం జరిగిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని తెచ్చిందని, దాన్ని ముస్లింలు అంతా వ్యతిరేకిస్తున్నారన్నారు. మాజీ సీఎం జగన్ ఆదేశాలతో పార్లమెంట్‌లో వైసీపీ దాన్ని వ్యతిరేకించిందని చెప్పారు. వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేసేందుకే ఈ చట్టం తెస్తున్నారని ఆయన మండిపడ్డారు.

## నిజాలు వెలికితీయాలి

మొదటి పేజి తరువాయి



అక్రమ బియ్యాన్ని పట్టుకునేందుకు బోట్లు వేసుకుని సముద్రంలో హడావిడి చేయడం కాదు... నిజాలు వెలికి తీయాలి... ఈ మేరకు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని షర్మిల స్పష్టం చేశారు. "పేదల పొట్టకొట్టి రూ.48 వేల కోట్ల ప్రజల డబ్బును పందికొక్కుల్లా తినేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా వెనుక ప్రజా ప్రతినిధుల హస్తం ఉంది. క్షేత్రస్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు కొంతమంది అవినీతి అధికారుల పాత్ర ఉంది. ఎవరికి దక్కాల్సిన వాటా వాళ్లకు చేరుతుండడంతో నిఘా వ్యవస్థ పూర్తిగా కళ్లు మూసుకుంది! గత మూడేళ్లలో ఏపీలోని పోర్టుల నుంచి 2 కోట్ల టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా రవాణా అయింది. దీన్ని బట్టే మన చెక్ పోస్టుల పనితీరు ఎలా ఉందో అంచనా వేయొచ్చు. పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యం పోర్టుల వరకు ఎలా వెళుతోంది? గత ప్రభుత్వ పెద్దలకు రైస్ మాఫియాతో లింకులు ఉన్నాయా? ఇందులో మిల్లర్ల చేతివాటం ఉందా? రేషన్ డీలర్ల మాయాజాలమా? ప్రతి రోజు తనిఖీల సంగతేంటి? ఈ నిజాలు వెలికితీయాల్సిన అవసరం ఉంది. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు కమిటీ వేయాలి. లేకపోతే విచారణ బాధ్యతలు సీబీఐకి అప్పగించండి. ఏపీ అంటే అన్నపూర్ణమ్మ... మనది ప్రపంచానికి అన్నం పెట్టే రాష్ట్రం. అలాంటి రాష్ట్రాన్ని రేషన్ బియ్యం మాఫియాకు అడ్డాగా మార్చారు. కష్టపడి పంట పండించే రైతుకు కన్నీళ్లు దక్కుతుంటే... బియ్యం అక్రమార్కులకు కాసులు దక్కుతున్నాయి... ఇదీ మన రాష్ట్ర దుస్థితి" అంటూ షర్మిల సోషల్ మీడియాలో ధ్వజమెత్తారు. తన పోస్టుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లను ట్యాగ్ చేశారు.

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక



# ఎమ్మెల్యే చే కళా ఉజ్వల పోస్టర్ ఆవిష్కరణ...

## రామగుండంలో శాస్త్రీయ నృత్య శిక్షణకు తోడ్పాటు అందిస్తా......

### రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్....



రామగుండం /డిసెంబర్ 02(జనం రిపోర్టర్): రామగుండం నియోజకవర్గ గోదావరిఖని 32వ. డివిజన్ కు సంబంధించిన గుమ్మడి ఉజ్వల కూచిపూడి నృత్య కళాకారినిగా,సెంట్రల్ యూనివర్సిటీ నుండి గోల్డ్ మెడల్ తీసుకున్నా మొట్టమొదటి వ్యక్తిగా మన ప్రాంతంలో శాస్త్రీయ నృత్య శిక్షణ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించాలనే మహోన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన, కళా ఉజ్వల కార్యక్రమ పోస్టర్లు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ... తప్పకుండా మన ప్రాంతంలో కూచిపూడి నృత్య శిక్షణ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని, ప్రభుత్వపరంగా వ్యక్తిగతంగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించి మన ప్రాంతంలో ప్రతి ఒక్క విద్యార్థిని,కూచిపూడి రంగంలో శిక్షణ పొందేలా ఉజ్వల పనిచేయాలని సూచించారు. అనంతరం శాస్త్రీయ నృత్య శిక్షకురాలు గుమ్మడి ఉజ్వల మాట్లాడుతూ... అడిగిన వెంటనే అండదండగా ఉంటానని హామీ ఇచ్చిన రాజ్ ఠాకూర్ సహకారంతో, మన ప్రాంతంలో మట్టిలో ఉన్న మాణిక్యాలను వెలికి తీసే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా క్యాంపులు నిర్వహించి,శాస్త్రీయ నృత్యాన్ని ప్రతి ఒక్క గడపకు అందేలా ఈ ప్రాంత బిడ్డగా నా వంతు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ కి అభినందనలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# లక్ష్మీ గణపతి హెూమంలో పాల్గొన్న మనాలి ఠాకూర్.....





రామగుండం /డిసెంబర్ 02(జనం రిపోర్టర్): రామగుండం నియోజకవర్గం అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న నాయకులు,



ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కి ఈ రామగుండం ప్రాంత ప్రజలకి, సింగరేణి కార్మికులకి ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, సింగరేణి భాస్కర్ కిరణ్ ఆధ్వర్యంలో... శ్రీ లక్ష్మీ గణపతి హెూమం నిర్వహించడం జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ పూజ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భారీ ఎత్తున సింగరేణి కార్మికులతో పాటుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అంబటి



పొన్నూరు డిసెంబర్ 2 జనం రిపోర్టర్: గుంటూరు జిల్లాపొన్నూరు మండలం తాళ్లపాలెం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ విజయ గణపతి స్వామి, అభయాంజనేయ స్వామి వార్ల దేవస్థానం 16వ వార్షికోత్సవ వేడుకల కార్యక్రమంలో సోమవారం పొన్నూరు నియోజకవర్గ వైయస్సార్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొన్నారు. అభయాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల



పొన్నూరు డిసెంబర్ 2. జనం రిపోర్టర్: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సోమవారం చేబ్రోలు తెదేపా కార్యాలయంలో లబ్ధిదారునికి పంపిణీ చేశారు.చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామానికి చెందిన తాటి శేషమ్మ కు సీఎం సహాయ నిధి రూ. 70 వేలు చెక్కునుఅందజేశారు. లబ్ధిదారు ఎమ్మెల్యే ధూళిపాళ్లకు కృతజ్ఞతలు తెలిపారు.

# భవిష్యత్తులో రిజర్వేషన్లు రూపుమాపాలనే పార్టీలకు బుద్ధి చెప్తాం..

## ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ గైని గంగారాం...



నిజామాబాద్ జిల్లా ( జనం రిపోర్టర్) డిసెంబర్ 02: భవిష్యత్తులో రిజర్వేషన్లు రూపుమాపాలనే పార్టీలకు బుద్ధి చెప్తామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ గైని గంగారాం అన్నారు.సోమవారం నగరంలోని ప్రెస్ క్లబ్ లో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సక్కి విజయ్ కుమార్,ప్రధాన కార్యదర్శి సిద్ధం.రాజేందర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ..డిసెంబర్ 1న సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్ లో నిర్వహించిన మాల సింహ గర్జన విజయవంతం అయినందుకు గాను సహకరించి కష్టపడిన మాల సోదర సోదరీమణులకు,ప్రతి గ్రామం నుంచి స్వచ్ఛందంగా వాహనాలు ఆహారం సమకూర్చుకొని విచ్చేసిన మాల బంధువులందరికీ కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సికింద్రాబాద్ కు విచ్చేసి మాలల సత్తా చూపించినందుకు మాల కార్యకర్తలు,కర్షకులకు కార్మికులకు ఉద్యోగులకు ఉపాధ్యాయులకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.వీరి సహాయ సహకారాలు మర్చిపోలేమన్నారు. సింహ గర్జనకు బస్సులు ఏర్పాటు చేసిన స్కూల్ యాజమాన్యాలకు స్థానిక ఎమ్మెల్యేలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఆర్టికల్ 341 వ్యతిరేకమని నిరసిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం కోర్టు ద్వారా మాల మాదిగలను విడదీసి రిజర్వేషన్లను రద్దు చేయాలని చేసే కుట్రను మేము ఖండిస్తున్నామన్నారు. భవిష్యత్తులో రిజర్వేషన్లు రూపుమాపాలని పార్టీలకు, నాయకులకు బుద్ధి చెప్తామన్నారు. అంబేద్కర్ ఆశయాల కోసం మాల మహానాడు పివి.రావు మార్గదర్శకముగా తీసుకొని వర్గీకరణ ఎట్టి పరిస్థితుల్లో కానివ్వమన్నారు.ఎం ఆర్ పి ఎస్ నాయకులు ఆదివారం మాల నాయకులను,మాల ఎమ్మెల్యే లైన గడ్డం వివేక్, నాగరాజుల దిష్టిబొమ్మలను తగలబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మా నాయకుల రాజీనామాలకు డిమాండ్ చేసిన దానిని ఖండిస్తూ మాదిగ ఎమ్మెల్యే నాయకుల రాజీనామాలకు మేము డిమాండ్ చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో మాదిగలు చేస్తున్న అసత్యపు ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కో-కన్వీనర్లు నీరడి లక్ష్మణ్,కేశ్ పల్లి రవి,భీంరావ్ గైక్వాడ్ కోర్టు లక్ష్మణ్,మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సక్కి విజయ్ కుమార్,ప్రధాన కార్యదర్శి సిద్ధం రాజేందర్,జిల్లా ఉపాధ్యక్షులు సక్కి ప్రభంజన్, నగర అధ్యక్షులు సక్కి చంద్రశేఖర్,సుంకరిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం పర్యటన సందర్బంగా కమిషనరేట్

# పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం...

### పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్...




రామగుండం /డిసెంబర్ 02(జనం రిపోర్టర్): డిసెంబర్ 04న. పెద్దపల్లి లో ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, కార్యక్రమం సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సీపీ తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ లో రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి డీసీపీ, ఏసీపీ లు, సీఐ లు, ఎస్ఐ లతో బందోబస్త్ ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలు, విఐపి లు వచ్చే మార్గాలు, ప్రవేశ మార్గాలు, సభకు వచ్చే ప్రజల రాకపోకల సౌకర్యం, ట్రాఫిక్ మార్గ దర్శకాల పై, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రత్యేక ప్రాంతాలు గుర్తింపు అనుగుణంగా ఏర్పాట్లు, వివిధ శాఖల సమన్వయం, అత్యవసర పరిస్థితిలలో అంబులెన్స్, ఫైర్ సర్వీస్ గురించి, బందోబస్త్ విధులకు సంబందించిన డ్యూటీ చార్ట్ స్పష్టంగా కేటాయింపు, స్పెషల్ టీమ్ ల ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్షా సమావేశంలో అధికారులతో చర్చించి సలహాలు, సూచనలు, ఆదేశాలు జారీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి డిసిపి చేతన , మంచిర్యాల డీసీపీ భాస్కర్ , అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, గోదావరిఖని ఏసీపీ రమేష్, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, సిసిఎస్ ఏసీపీ వెంకటస్వామి, టాస్క్ ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏ ఆర్ ఏసీపీ సుందర్ రావు, వివిధ వింగ్స్ ఇన్స్పెక్టర్ లు, సీఐ లు, ఎస్ఐ లు పాల్గొన్నారు.



# మహాగణపతికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల.



పొన్నూరు డిసెంబర్ 2. జనం రిపోర్టర్: పొన్నూరు మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో గల శ్రీ మహాగణపతి దేవాలయంనందు ఏర్పాటుచేసిన ప్రత్యేక పూజా మహెూత్సవ మరియు హెూమం, కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని వేద పండితుల ఆశీర్వచనం పొందిన పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఈ కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ ఎలక్షన్ పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ మాదాల వెంకటేశ్వరరావు, గుంటూరు పార్లమెంట్ రైతు విభాగ ప్రధాన కార్యదర్శి బొర్రు రామరావు , పొన్నూరు మండల పార్టీ అధ్యక్షులు బండ్లమూడి బాబురావు, మార్కెట యార్డ్ మాజీ డైరెక్టర్ చెలమశెట్టి సీతారామయ్య, గనిపిశెట్టి రామకృష్ణ, పోకల వెంకట శివ, చుండూరు పిచ్చయ్య, మానుకొండ పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి విజయోత్సవ సభకు వేలాదిగా తరలి వెళ్దాం

## చొప్పదండి నియోజకవర్గం నుండి పెద్దపల్లికి దండుగా తరలిరావాలి

## ప్రభుత్వ సంక్షేమ పథకాలే మన నినాదం

## మ్మెల్యే మేడిపల్లి సత్యం



కరీంనగర్,జనం రిపోర్టర్,డిసెంబర్ 02: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఏడాదికాలం పూర్తి చేసుకున్న సందర్భంగా పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గంగాధర మండలం మధుర నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతు....ఈ నెల 4వ తేదీన నిర్వహిస్తున్న సభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలంగాణ ఆశాదీపం రేవంత్ రెడ్డి హాజరవుతున్నట్టు తెలిపారు.చొప్పదండి నియోజకవర్గం లోని ప్రతి గ్రామంలో నుండి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి విజయోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలే నిదానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయడం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఆ సాంఘిక కార్యకలాపాలపై

# ఎమ్మెల్యేకు విద్యార్థుల ఫిర్యాదు



అమరచింత వనపర్తి డిసెంబర్ 2 జనం రిపోర్టర్: విద్యాలయాలను దేవాలయాలుగా భావించాల్సిన వ్యక్తులు రాత్రి వేళలో మద్యం సేవించి పాఠశాలలో సారా ప్యాకెట్లు, మద్యం సీసాలను వదిలేసి వెళుతున్నారని ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అమరచింత జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి సోమవారం ఫిర్యాదు చేశారు. అమరచింతలో అదనపు గదులకు భూమి పూజ చేసేందుకు పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యేను విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి జరిగిన ఘటనపై వివరించారు.ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలో ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని మద్యం సేవించి సీసాలు ధ్వంసం చేయడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న ఎస్ఐ సురేష్ను ఆదేశించారు ప్రభుత్వ పాఠశాలలు దేవాలయాలు లాంటివని వాటిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతమైతే ఏం చేదు లేదన్నారు. రాత్రి వేల గస్తి పెంచి ఇలాంటి ఘటన జరగకుండా చూడాలని ఎస్ఐని ఆదేశించారు. అనంతరం విద్యార్థులు పాఠశాలలో నీటి సౌకర్యం పెండింగ్లో ఉన్న డైనింగ్ హాల్ నిర్మాణ పూర్తి చేయాలని మరుగుదొడ్లు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# పిర్యాదులు స్వీకరిస్తున్న అర్ డి ఓ రామలక్ష్మి

## ఆర్ డి ఓ కార్యాలయ గ్రీవెన్స్ కు 10 అర్జీలు నమోదు



రేపల్లె డిసెంబర్ 2 జనం రిపోర్టర్ : స్థానిక రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించడం జరిగినది సదరు కార్యక్రమమునకు 9 పిర్యాదులు వచ్చిన నట్లు ఆర్ డి ఓ రామలక్ష్మి తెలియజేశారు ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదు వివరములు తెలియజేస్తూ1. చెరుకుపల్లి మండలం రాంబోట్ల వాని పాలెం గ్రామం నందు గల రైస్ మిల్లు నిర్మాణం జరుగుతున్నదని సదరు నిర్మాణం పూర్తయిన యెడల దాని నుంచి వచ్చు కాలుష్యం వలన చుట్టు ప్రక్కల వారికి ఇబ్బంది కలుగునని కావున సదరు నిర్మాణమును నిలిపివేయవలసిందిగా కోరుతూ దామెర్ల రాజారావు, అల్లపర్తి రమణారావు మరియు అక్కల శ్రీనివాసరెడ్డి అనువారాలు దాఖలు చేసిన అర్జీ లు -2 .2. భట్టిప్రోలు మండలం పెద్దపులివర్రు గ్రామానికి చెందిన బస్సు ప్రసాద్ రావు అను వారు తన పొలము ఒక గజము ను నీల కృష్ణయ్య అనేవారు ఆక్రమించి ఉన్నారని అతనిపై చర్య తీసుకోవాల్సిందిగా కోరుతూ దాఖలు చేసిన ఒక అర్జీ 3. చెరుకుపల్లి మండలం గూడవల్లి గ్రామానికి చెందిన టి వసంత బాబు అనువారు రేపల్లె ఏ పి ఎస్ ఆర్ టి సి డిపో నందు డ్రైవర్ గా పని చేయుచున్నానని సదరు డిపో అధికారులు తనను వేధించుచున్నారని కావున సదరు సమస్యను పరిష్కరించవలసిందిగా కోరుతూ ఒక అర్జీ 4. రేపల్లె మండలం బేతపూడి గ్రామ కాపురస్తులైన పరుచూరి సాయి ప్రసాద్ అనువారు వారి ఇంటి ప్రక్కన గల చర్చి పాస్టర్ అయినటువంటి పల్లిపాటి దాసుబాబు అనువ్యక్తి తనపై దౌర్జన్యం చేయుచున్నారని వారిపై చర్య తీసుకోవలసినదిగా కోరుతూ ఒక అర్జీ 5. రేపల్లె మండలం 13వ వార్డు గ్రామ ప్రజలైన బేతాళ నాగమల్లేశ్వరరావు అనువారు వారి వీధిలో గల కరెంటు స్తంభం నడక మార్గమునకు అడ్డుగా ఉన్నదని కావున సదరు స్తంభమును మార్చవలసిందిగా కోరుతూ ఒక అర్జీ 6. రేపల్లె మున్సిపాలిటీ నందు వేములపల్లి రఘునాథ్ అనువారు వర్షముల వలన కరెంటు స్తంభము లు మరియు కరెంటు తీగలను మరమ్మత్తులు చేయించవలసిందిగా కోరుతూ ఒక అర్జీ 7. రేపల్లె మండలం 13 వ వార్డు నందు గల బివి శివప్రసాద్ అనువారు తన కరెంట్ మీటర్ ఫ్యూజ్ను లైన్మెన్ వారు కరెంట్ బిల్లు కట్టనందున తీసుకొని వెళ్ళిపోయినారని సద రు కరెంట్ బిల్లు కట్టినను ఫ్యుజును రిస్టోర్ చేసి ఉండలేదని కావున సమస్యను పరిష్కరించవలసిందిగా కోరుతూ ఒక అర్జీ 8. రేపల్లె మండలం బేతపూడి గ్రామ కాపరస్తులైన చీకటి బు ల్లి కోటయ్యని వారు డ్రైనేజీ కాలమును సర్వే చేసి కాలువ పూడిక తీయించవలసిందిగా కోరుతూ ఒక అర్జీ 9. నగరం మండలం కొలగాని వారి పాలెం గ్రామ కాపరస్తులు అయిన చిలకా సునీతను వారు తన పొలమును ఆన్లైన్ నమోదు చేయవలసిందిగా కోరుతూ ఒక అర్జీ మొత్తం 10 అర్జీలు వచ్చినవి అని తెలియజేశారు ఈ ఆర్జీలను సదరు అధికారులకు పంపి అవి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తోనే మహిళా సాధికారత

## మా ఊరి మహాలక్ష్మి ట్రస్టు సేవలు అభినందనీయం

## గల్ఫ్ కార్మిక కుటుంబాలకు అండగా ఉంటాం

## చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం




కరీంనగర్,జనం రిపోర్టర్,డిసెంబర్ 02: గంగాధర మండలం కొండయ్య పల్లి గ్రామంలో మా ఊరి మహాలక్ష్మి ట్రస్టు రేండ్ల శ్రీనివాస్ పద్మ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫిక్స్ డిపాజిట్ బాండ్ల పంపిణీ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గ్రామానికి చెందిన తుమ్మల హరేందర్ అనారోగ్యంతో చనిపోగా తన వంతు సహాయంగా 10 వేల రూపాయల ఆర్థిక సహాయం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేశారు.ఈ సందర్భంగా మా ఊరి మహాలక్ష్మి ట్రస్ట్ ఫౌండర్ రేండ్ల శ్రీనివాస్ పద్మను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు.పదిమంది ఆడపిల్లలకు 5000 చొప్పున డిపాజిట్ చేసిన బాండులను అందజేశారు.మా ఊరి మహాలక్ష్మి ఫౌండేషన్ తరపున కొండయ్య పల్లె గ్రామంలో పుట్టిన ఆడపిల్లలకు గత ఏడు సంవత్సరాలుగా ఒక్కొక్కరికి ఐదు వేల చొప్పున ఫిక్స్ డిపాజిట్ లను చేస్తున్నారు.మావూరి మహాలక్ష్మి ఫౌండేషన్ ఏడవ వార్షికోత్సవం సందర్భంగా పదిమంది ఆడపిల్లలకు ఫిక్స్ డిపాజిట్లను అందజేశారు.మహిళ సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 కి వంట గ్యాస్ సిలిండర్లను ఇవ్వడం జరుగుతుందన్నారు.గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్,వేముల భాస్కర్ జాగిరపు శ్రీనివాసరెడ్డి, సత్తు కనుకయ్య దుబ్బాసి బుచ్చయ్య, బూర్గు గంగన్న,రెండ్ల రాజిరెడ్డి,అట్లా రాజిరెడ్డి దోర్నాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 6 అబద్దాలు 66 మోసాలతో

# కాంగ్రెస్ గ్యారంటీలా గారడి...!!

## జిల్లా కార్యదర్శి సారా జగన్.!!


## నవాబుపేట్ బిజెపిమండల ఇంచార్జి సోమనో ల్ల రామకృష్ణారెడ్డి..!!




వికారాబాద్ జిల్లా ప్రతినిధి : నవాబుపేట్ డిసెంబర్ 2 (జనం రిపోర్టర్): కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో 6 అబద్దాలు 66 మోసలతో తెలంగాణ ప్రజలను నమ్మించి మోసం చేసారు ఆడబిడ్డలకు ప్రతినెలా 2500/- మహాలక్ష్మి పథకం అని చెప్పి ఏడాది పూర్తయినా ఇప్పటికి ఒక్క ఆడబిడ్డకు కూడా రాలేదు. 500 లకే సిలిండర్ అని అరకొరగా రాయితీ ఇచ్చి ఆడబిడ్డలను మోసం చేసిన కాంగ్రెస్ సర్కారుకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఆడబిడ్డలు అందరు ఈ ప్రభుత్వాన్ని తన్ని తారీమేయడానికి సిద్ధంగా ఉన్నారని బిజెపి జిల్లా కార్యదర్శి సారా జగన్ అన్నారు.గృహజ్యోతి అని ఏడాది పాలనలో ప్రజల జీవితాల్లో చీకట్లు నింపిన కాంగ్రెస్ పార్టీనీ నమ్మొద్దు అని బిజెపి మండల ఇంచార్జ్ సోమనోళ్ళ రామకృష్ణరెడ్డి అన్నారు.రైతులకు రైతు భరోసా 15000/- ఇస్తాం అని ఏడాది పూర్తయినా ఇప్పటికి రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వని ఈ కాంగ్రెస్ పార్టీని రైతులు కూడా నమ్మడంలేదు.ఇలా అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ నమ్మించి నట్టేట ముంచిందని బిజెపి దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు బేగరి గాలయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు లక్ష్మణ్, శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి,వీరవసంత్ కుమార్,అర్జున్,తదితరులు పాల్గొన్నారు.

# న్యూ గంజ్ లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం

## శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ను పర్యవేక్షించిన వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 2 (జనం రిపోర్టర్): వికారాబాద్ మున్సిపల్ లో పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని లివికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ అన్నారు. ఈరోజు ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 25వ వార్డు, చైర్ పర్సన్ సొంత వార్డులోని న్యూ గంజ్ హనుమాన్ మందిర్ పక్కన నిర్వహించిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చైర్ పర్సన్ గారు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ... మున్సిపల్ పరిధిలో ఎక్కడ చెత్తాచెదారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, కమిషనర్ జాకీర్ అహ్మద్, నాయకులు దీపు, సందీప్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ ఏసు, జవాన్ శీను, మున్సిపల్ సిబ్బంది రాజు, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.



జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక



## విద్యార్థులకు సకాలంలో స్కాలర్షిప్ అందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు..!!




వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 2 (జనం రిపోర్టర్): సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఎస్సీ విద్యార్థులకు అందించే పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ పై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్ , యాజమాన్యాలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... పోస్టు మేట్రిక్ స్కాలర్ షిప్ కు దరఖాస్తు చేసుకునే క్రమంలో వస్తున్న సమస్యలను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పదవ తరగతి సర్టిఫికెట్ లో ఉన్న వివరాలకు ఆధార్ కార్డులో ఉండే విధంగా తప్పులను సరి చేసుకునేందుకు వీలుగా ఆధార్ కిట్లను సమకూర్చుకోవాలన్నారు. విద్యార్థుల గ్యాప్ సర్టిఫికెట్ నిమిత్తం కళాశాల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలు డీఎస్సీడివో కు విద్యార్థుల జాబితాలను సమర్పించాలని తెలిపారు. నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా ఇ-పాస్ పోర్టల్ స్కాలర్ షిప్ నిమిత్తం రిజిస్టర్ చేసుకున్నట్లయితే స్కాలర్ షిప్ త్వరలో మంజూరు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారుసమీక్ష సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి మల్లేశం, డిటిడిఓ కమలాకర్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



## ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, ప్రజా వాణి పిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 2 (జనం రిపోర్టర్): ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఆసరా పెన్షన్, భూ సమస్య లపై (128 ) ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాధాన్య పథకాలకు జిల్లా అధికారులు ప్రాధాన్యత క్రమంలో ఎప్పటికప్పుడు లక్ష్యాలను పూర్తిచేసేందుకు కృషి చేయాలని అన్నారు. ముందుగా పర్మిషన్ తీసుకోకుండా గురు కుల స్కూల్స్,కాలేజీలలో,పాటశాల లో ఎవ్వరిని కూడా అనుమతించరాదని, అనుమతి లేకుండా ఎవరైనా గురుకుల స్కూల్స్, కాలేజీ లలో ప్రవేశించడం జరిగితే సొసైటి రూల్స్ కు విరుద్దమని ,కాబట్టి ఎవ్వరిని కూడా అనుమతించరాదని హెచ్చరించారు. సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రి ని వేగవంతం చేయాలనీ అధికారులకు ఆదేశించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి అంగన్వాడీలు, పాఠశాలలు, రెసిడెన్సి పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో ఎలాంటి చిన్న లోపం లేకుండా చూసుకోవాలని అన్నారు. అన్ని పాఠశాలలో సంక్షేమ వసతి గృహాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని సజావుగా అమలు చేయాలనీ అధికారులకు ఆదేశించారు. సి.ఎం.కప్ క్రీడలను డిసెంబర్ 7వ తేదీ నుండి 21వ తేదీ వరకుచేపడుతున్నందున ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు.డిసెంబర్, 7వ తేదీ నుండి 8వ తేదీ వరకు గ్రామపంచాయతీ స్థాయిలో క్రీడలు నిర్వహించాలని , అదే నెలలో 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు మండల స్థాయిలోను, 16వ తేదీ నుండి 21వ తేదీ వరకు జిల్లా స్థాయిలో క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో జరిగే అన్ని అంశాలపై దృష్టి సారించి ప్రత్యేక చొరవ చూపించాలని అన్నారు. ముఖ్యంగా సంబంధిత శాఖల అధికారులు కిందిస్థాయి సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఎక్కడ సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుదీర్, ట్రైని కలెక్టర్ ఉమా హారతి, ఆర్ డి ఓ వాసు చంద్ర, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేసిన మక్తల్ ఎమ్మెల్యే



అమరచింత వనపర్తి డిసెంబర్ 2 జనం రిపోర్టర్: అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇటీవలే స్టేట్ మ్యాచింగ్ గ్రాండ్స్ నుండి 40 లక్షలు మంజూరు కాగా ఇదే పాఠశాలలో నాలుగు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు ఇదే ఫండ్స్ నుండి మరో 20 లక్షలు మంజూరు కాగా రెండు అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో పాఠశాలకు ఇంత పెద్ద గ్రౌండ్ ఉండడం విద్యార్థులు చేసుకున్న అదృష్టమని అన్నారు. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని విద్యా అవసరాల కోసం ఎంత డబ్బైనా వెచ్చించేందుకు ముఖ్యమంత్రి వెనుక రావడంలేదని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తప్పకుండా సహకరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అయూబ్ ఖాన్ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్ ఏఈ నరేష్ మాజీ ఎంపిటిసిలు మహంకాళి విష్ణు తిరుమలేష్ పొసిరి గారి విష్ణు హనుమంతు నాయక్ కాంట్రాక్టర్ రవీందర్ రెడ్డి హెచ్ఎం కృష్ణవేణి ఉపాధ్యాయులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## హలో మాల చలో హైదరాబాద్ సింహ గర్జన బహిరంగ సభ సక్సెస్ వేడుకలు...



ఎటపాక డిసెంబర్ 2జనం రిపోర్టర్: హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ లో జరిగిన మాలల సింహ గర్జన కి తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి అత్యధిక సంఖ్యలో తరలివచ్చి సింహ గర్జన మీటింగ్ ను గర్జించే విధంగా విజయవంతం చేసిన సందర్భంగా భద్రాచలం మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ లో టపాసులు కాల్చి జై భీమ్ జై మాల మాలల ఐక్యత వర్ధిల్లాలి అని రాజ్యాంగం వర్ధిల్లాలని నినాదాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాల సంఘం జేఏసీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాలలు అందరినీ చైతన్యవంతులుగా మార్చి ఇంత గొప్ప మీటింగ్ ను పెట్టిన డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ వారి వెన్నంటే ఉంటూ వారికి అన్ని రకాలుగా సహాయపడుతూ మాలల సింహ గర్జన మీటింగును విజయవంతం చేసిన మాల సంఘాల రాష్ట్ర నాయకులకు కూడా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అల్లాడి పాల్ రాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పొలమూరి బసవరాజు, చింతూరు డివిజన్ అధ్యక్షులు దేగల వంశీ భద్రాచలం పట్టణ అధ్యక్షులు దేగల శివ, దళిత నాయకులు ఏవి రావు, ఎటపాక మండల అధ్యక్షుడు పద్మారావు, పొలమూరి శైలజ రాజ్, ప్రసాద్, ప్రేమ్ చంద్, మోతుకూరు సత్యం తదితరులు పాల్గొన్నారు..

## రెండు మత్స్యకార సొసైటీలకు ఎన్నికలు



మొగల్తూరు,డిసెంబరు2. జనం రిపోర్టర్: మండలంలోని ముత్యాలపల్లి, పేరుపాలెం గ్రామాల్లోని మత్స్యకార సొసైటీ పాలకవర్గాలు ఏకగ్రీవం అయ్యాయి. ముత్యాలపల్లి సొసైటీ అధ్యక్షుడుగా కొల్లాటి నాగేశ్వరరావు, కార్యదర్శిగా వాటాల శ్రీను మరో 8మంది డైరక్టర్లుగా ఎన్నికయ్యారు. పేరుపాలెం మత్స్యకార సొసైటీకి జరిగిన హోరా హోరీ ఎన్నికల్లో అధ్యక్షుడుగా కొల్లాటి కృష్ణార్జున, సెక్రటరీగా తమ్ము నాగబాబు, ఉపాధ్యక్షుడుగా తిరుమాని సుధాకర్లతో పాటు మరో 6 గురు డైరక్టర్లుగా ఎన్నికయ్యారు. మత్యశాఖధికారులకు ఎన్నికల ధృవీకరణ పత్రాలు అందజేశారు.

## ప్రత్తిపాడు ఆర్టిఐ అధ్యక్షుడిగా సంపత్ కుమార్



పొన్నూరు డిసెంబర్ 2. జనం రిపోర్టర్: ప్రజాసంకల్ప వేదిక ఆర్టీఐ విభాగానికి ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షుడు గా ఎం.సంపత్ కుమార్ ని నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు మదిరె రంగ సాయిరెడ్డి తెలిపారు.సోమవారం ఆర్టిఐ గుంటూరులో జరిగిన కార్యక్రమంలోసంపత్ కుమార్ ను నియమించారు.ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజల సమస్యలను చట్ట పరిధిలో సమాచార హక్కు చట్టం ద్వారా పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని తెలియచేశారు.

## యాంటి స్లీపింగ్ గ్లాస్ ను కనుగొన్న విద్యార్థి

### జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక

### విద్యార్థి ప్రతిభను అభినందించిన మక్తల్ ఎమ్మెల్యే




అమరచింత వనపర్తి డిసెంబర్ 2 జనం రిపోర్టర్: ప్రతిరోజు రోడ్డు ప్రమాదాల బారిన పడి ఎంతోమంది ప్రాణాలు కోల్పోవడం లేక అంగవైకం కలవడం తరచుగా జరుగుతున్న పరిస్థితుల నుండి డ్రైవర్లను అప్రమత్తం చేసేందుకు విద్యార్థి ఓ వినూత్న పరికరాన్ని కనిపెట్టాడు. అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో పదవ తరగతి చదువుతున్న అప్నాన్ అనే విద్యార్థి యాంటీ స్లీపింగ్ గ్లాస్ పరికరాన్ని కనుగొన్నాడు. ఈ పరికరాన్ని ఇటీవల జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ లో ప్రదర్శించగా జిల్లా రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. సోమవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి జిల్లా పరిషత్ హై స్కూల్లో పర్యటనకు వచ్చిన సందర్భంగా విద్యార్థి గ్లాస్ పనితీరును ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే విద్యార్థి ప్రతిభను మెచ్చుకున్నారు. భవిష్యత్తులో విద్యార్థి మంచి సైంటిస్టు కావాలని కోరారు. రాష్ట్రస్థాయిలో ఈ పరికరం పోటీకి వెళ్లిందని విద్యార్థి తెలుపగా ఎమ్మెల్యే విద్యార్థిని అభినందించారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే ఇలాంటి విద్యార్థులను ఎంతోమంది తయారు చేయొచ్చని ఎమ్మెల్యే అన్నారు. ముందు విద్యార్థి మరిన్ని పరికరాలు కనుగొనాలని కోరారు. ఈ పరికరం కేవలం 300 రూపాయలతో తయారు చేశానని విద్యార్థి ఎమ్మెల్యేతో అన్నారు. రాత్రివేళ డ్రైవర్లు నిద్ర మత్తులో ఉన్నప్పుడు ఈ స్లీపింగ్ గ్లాస్సెస్ అలర్ట్ అవుతుందన్నారు. డ్రైవర్ నిద్రకు పక్రమించిన మూడు సెకండ్లలోని వైబ్రేషన్ అలారం మోగుతుందని దీంతో డ్రైవర్ అప్రమత్తంగా ఉంటాడని దీనివల్ల ప్రమాదాలు తప్పుతాయని విద్యార్థి ఎమ్మెల్యేకు తెలిపాడు. అక్కడ ఉన్న పట్టణ ప్రముఖులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, విద్యార్థి ప్రతిభను మెచ్చుకున్నారు.

## వేప చెట్టుకు పాలు...


రామన్నపాలెం పంచాయతీ పులపర్తివారి తోట లో వేపచెట్టు కు పూజలు చేస్తున్న భక్తులు.




మొగల్తూరు,డిసెంబరు2: జనం రిపోర్టర్: మండలంలోని రామన్నపాలెం పంచాయతీ పులపర్తి వారితోటలో వేపచెట్టుకు పాలు కారడంతో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. గ్రామంలో పులపర్తి సత్యనారాయణ తోటలోని వేపచెట్టుకు సోమ వారం ఉదయం నుండి పాలు ధారగా కారుతున్నాయి. ఈవిషయం గమనించిన స్థానికులు సమాచారం అందించడంతో గ్రామస్థులు భవానీలు వచ్చి వేపచెట్టుకు పూజలు చేశారు. ఆవిషయం మొగల్తూరు పరిసర గ్రామస్థులకు తెలియడంతో అక్కడకు మహిళలు వచ్చి పూజలు చేశారు. అక్కడికి వచ్చిన ఒక మహి ళ్లకు అమ్మవారు కన్పించి కుంకుళ్ళమ్మ అమ్మవారిగా చెప్పడంతో వేపచెట్టుకు ఎర్రటి దస్థులు కట్టి కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేయడం ప్రారంబించారు.

## గ్రంథాలయాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి...!!

### నవాబుపేట్ గ్రంథాలయాన్ని సందర్శించిన గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి...!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవాబుపేట్ డిసెంబర్ 2 (జనం రిపోర్టర్): మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సోమవారం జిల్లా గ్రంథాలయం చైర్మన్ రాజేష్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు.నవాబ్ పేట్ గ్రంథాలయ పర్యవేక్షకులు పర్మయ్యను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి శాలువాతో సన్మానించారు. గ్రంథాలయానికి బుక్స్, ఫర్నిచర్స్,కావాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ ను కోరినారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ...విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయం సమయపాలన పాటిస్తూ యువతకు ఆదర్శంగా ఉండాలని ఆయన సూచించారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అన్నిటిని అందుబా టులో ఉంచేలా చర్యలు తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు.నేటి సమాజంలో యువత చెడు వ్యసనాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, గ్రంథాలయాలు ఇట్టి యువతకు ఎంతో ఉపయోగకరంగా మారుతాయని,వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.త్వరలోనే గ్రంథాలయ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరిన విధంగా బుక్స్,ఫర్నిచర్స్ త్వరలోనే అందేలా చర్యలు తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోమండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, గ్రామ మాజీ ఎంపీటీసీ ఎగ్బాల్, సంగమేష్,మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల సమస్య తీర్చడానికే ప్రజా దర్బార్ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమాల తిప్పేస్వామి





గుడిబండ డిసెంబర్ 02, జనంరిపోర్టర్: గుడిబండ మండలం కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయంలో నందు ప్రజా దర్బార్ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి మండల కన్వీనర్ మదనకుంటప్ప మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని.ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి గజమాలతో స్వాగతం పలికారు అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో నందు ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి అధికారులతో కలిసి హాజరయ్యారు .ప్రజల సమస్యలు అడిగి,తెలుసుకున్నారు.పింఛను,కొత్త,ఇల్లు,ఇళ్లు,బిల్లులు,అందించాలని,తాగునీరు,సాగునీరు,వన్ బి,అడంగల్,ఈపాసు పుస్తకం,విద్యుత్ సమస్య తదితర సమస్యలకు సంబంధించిన వినతులు స్వీకరించారు.ప్రజలు అందించిన సమస్యలను పరిశీలించి దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు గుండమల తిప్పేస్వామి హామీ ఇచ్చారు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం పై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోందని అర్జీదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని సత్వరమే పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు అధికారులను ఆదేశించారు,ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి,తహసిల్దార్ కర్ణాకర్ డిప్యూటీ తహసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి ఎంపీడీవో గంగాధర్ హౌసింగ్ ఏ.ఈ.త్రిశూల్ వర్క్ ఇన్స్పెక్టర్ పంచాయతీ కార్యదర్శులు రెవెన్యూ కార్యదర్శి వివిధ శాఖల,అధికారులు,మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, జిల్లా లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్, మాజీ సర్పంచ్ శ్రీనాథ్ మూర్తి,భూధిపల్లి జయరామప్ప, క్లస్టర్ ఇంచార్జిలు లక్ష్మీ నరసప్ప, భీమరాజు,కార్యదర్శి ప్రకాష్, లాయర్ శివకుమార్ , ప్రజా ప్రతినిధులు ప్రజలు నాయకులు పాల్గొన్నారు

## ఘనంగా కార్తీకమాస దీపారాధన మహోత్సవం



రేపల్లె డిసెంబర్ 2 జనం రిపోర్టర్: కార్తీక మాసం చివరి రోజు మండలంలోని గుడ్డిదోలంక గ్రామంలో వేంచేసి ఉన్న అంక దేవర అమ్మవారి దేవాలయం వద్ద మహిళలు ఘనంగా దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమరస్త సేవా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో గ్రామంలో దీపారాధన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుతున్నామన్నారు స్థానిక అమ్మవారి దేవాలయం వద్ద గ్రామస్తులు శివలింగం ఆకారంలో దీపాలను వెలిగించి తమ భక్తి ప్రభక్తులను చాటు కున్నారు అనంతరం కాలువలో దీపాలను వదిలారు కార్తీకమాసం చివరి రోజు దీపాలు వెలిగించి శివునికి అమ్మవార్లకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు



## విశ్రాంత జిల్లా విద్యాధికారి మహాపాదయాత్ర

### ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో 100 రోజులు 1000 కిలోమీటర్లు పాదయాత్ర

### సమాజ హితం కోరి పాదయాత్ర ప్రారంభించిన శివార్చక విజయ్ కుమార్



అమరచింత వనపర్తి జిల్లా డిసెంబర్ 2 జనం రిపోర్టర్: చేనేత వస్త్రాదరణను ప్రోత్సహించాలని, మద్యం మత్తును నిషేధించాలని, స్వదేశీ వైద్యాన్ని ఆదరించాలని, సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలని, ప్రకృతి పర్యావరణాన్ని రక్షించాలని ఒక దృఢ సంకల్పంతో బాపూజీ బాటలో.. సత్యశోధన పాదయాత్ర పేరిట గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీ విజ్ఞాన్ ప్రతిష్ట ఆధ్వర్యంలో వంద రోజులు వెయ్యి కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టినట్లు విశ్రాంత జిల్లా విద్యాధికారి శివార్చక విజయ్ కుమార్ తెలిపారు. సోమవారం అమరచింతకు తన పాదయాత్ర చేరుకున్న సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సమాజ హితం కోరి ఈ పాదయాత్రను అక్టోబర్ 2 న జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ప్రారంభించారని వంద రోజులపాటు పాదయాత్ర చేసి అచ్చంపేట ఉమామహేశ్వరం దేవాలయం వద్ద జనవరి 12/01 /2025న ముగిస్తానని తెలిపారు. ఈ పాదయాత్ర పిల్లల బావి భవిష్యత్తు కోసం చేస్తున్నట్లు తెలిపారు. సమాజంలో హింసా ప్రవృత్తి పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పని ఎగ్గొట్టడం మాట తప్పడం కల్తీలు చేయడం బాధ్యతారహితంగా ప్రవర్తించడం పెద్దలను గౌరవించకపోవడం తల్లిదండ్రులను బయటకు గెంటేయడం వంటి అరాచకాలన్ని చూసి ఈ సమాజం బాగుపడాలని పాదయాత్రకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇలాంటివి సమాజంలో లేకపోతేనే పిల్లలు బాగుపడతారని ఉద్దేశంతో గౌతమ బుద్ధుడు, ఏసుక్రీస్తు, మహాత్మా గాంధీ చూపిన సత్యం ,అహింస మార్గాలే మన దేశానికి, జాతికి, యావత్ ప్రపంచానికి శరణ్యమని అన్నారు. హింసతో ఏ సమస్యలను పరిష్కరించలేమని అహింసతోనే ప్రతిదీ సాధించగలమని నమ్మకంతో తాను ఈ పని చేస్తున్నానని అన్నారు. ఈ పాదయాత్రతో సమాజంలో కొంతైనా మార్పు వస్తే తన జీవితానికి ఇంకేం కావాలని ఆయన అన్నారు.

## ప్రముఖ జర్నలిస్ట్ బషీర్ బాబు జన్మదిన వేడుకలు





పొన్నూరు డిసెంబర్2 జనం రిపోర్టర్: గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ షేక్ బషీర్ బాబు జన్మదిన వేడుకలు సోమవారం పొన్నూరు ప్రెస్ క్లబ్ అసోసియేషన్ హాల్లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పొన్నూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు తోట రాంబాబు అధ్యక్షత వహించారు. ముందుగా బషీర్ బాబు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం పొన్నూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు తోట రాంబాబు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పొన్నూరులో ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియాలో పనిచేస్తూ పలువురు అధికారుల ప్రశంసలు పొందటంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి కలం ఎక్కుపెట్టి పలువురి జర్నలిస్టులకు ఆదర్శంగా బషీర్ బాబు నిలిచాడని కొనియాడారు. నిండు నూరేళ్లు దీర్ఘాయుష్ పొంది అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మీడియా సభ్యులు బషీర్ బాబును దీవించారు. అనంతరం యూనియన్ కార్యచరణ పై చర్చించటం జరిగింది.

## ఘనంగా ఆర్య వైశ్యుల కార్తీక సమారాధన



ఎటపాకడిసెంబర్ 2జనం రిపోర్టర్: అల్లూరి సీతారామరాజు జిల్లా, ఎటపాక మండలం, తోటపల్లి .,ఆర్య వైశ్యుల కార్తీక వన భోజనాలు ఆదివారం గొల్లగూడెంలోని శివాలయం వద్ద ఘనంగా కనికిచర్ల మురళీ,సంకా అయ్యప్ప ,చల్లా వీరభద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్తీక సమారాధన కార్యక్రమంలో భాగంగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక మాసం విశిష్టతను పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి ఆంజనేయస్వామి దేవాలయంపై ప్రత్యేక శ్రద్ధతో సేవలందిస్తున్న సంకా శేషగిరిని,పురోహితులు నర్సయ్య ను సన్మానించారు సాయిబాబు,కళ్యాణ్,సంకా నగేష్,సంకా శేషగిరి,నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎన్టిపిసి అయ్యప్ప దేవాలయంలో అంగరంగ వైభవంగా పడిపూజ మహోత్సవం...

**- ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎన్టిపిసి సధరన్ రీజియన్ ఆర్.ఈ.డి కేదార్ రంజన్ పాండు...**



**రామగుండం/డిసెంబర్ 02(జనం రిపోర్టర్):** ఎన్టిపిసి పిటిఎస్, వైకుంఠపురం హరిహర దేవాలయం ప్రాంగణంలోని శ్రీఅయ్యప్ప స్వామి వారి దేవాలయంలో అంగరంగ వైభవంగా, అత్యంత భక్తి శ్రద్ధలతో ఐసిహెచ్ కార్తికేయన్, వారి బృందం నిర్వహించిన పడి పూజలను ఆలయ పూజారి బ్రహ్మశ్రీ రాంపల్లి



వామనశర్మ చేతుల మీదుగా ఘనంగా జరిగాయి అని, అఖిలభారతీయ అయ్యప్ప ధర్మాప్రచార సభ ఏ.బి.ఏ.పి సభ్యుడు జనగామ తిరుపతి తెలిపారు . కాగా ఈ కార్యక్రమాని ముఖ్య అతిధిగా ఎన్టిపిసి ఆర్ ఈ డి. కేదార్ రంజన్ పాండు, అన్ని విభాగాల జి ఎం లు, హెచ్ ఆర్ ఏ జి ఎం బజయ్ కుమార్ సిగ్దార్ తో పాటు ఏ జి ఎం లు, డి జి ఎం లు, అధికారులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారని అన్నారు. అనంతరం పడిపూజ, అల్పాహారం, ప్రసాద వితరణ జరిగిందని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ్యుడు జనగామ తిరుపతి తెలిపారు. అయ్యప్ప దేవాలయం కమిటీ సభ్యుడు పోలినేని సంపత్ రావు ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలలో , కార్పొరేటర్ కొలిపాక సుజాత మల్లయ్య, హరి హర దేవాలయ కమిటీ చైర్మన్ చెంద్రశేఖర్, సభ్యులు వి. గిరి కుమార్, టి వి ఆర్ చంద్ర, ప్రభాకర్ గురు స్వామి, రాములు గౌడ్ గురు స్వామి, శేషు కుమార్ గురు స్వామి, బజన బృందం సాగి కిషన్ రావు, కేరళ హరి, కృష్ణ,పర్స రామస్వామి గురుస్వామి అయ్యప్ప, కన్నె స్వాములు, గురు స్వాములు, భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువకులారా నిరుద్యోగ భృతి పై ప్రశ్నించడానికి సిద్ధం కండి

**-రైతు సోదరులారా రైతు బంధు, ఆంక్షలు లేని రుణమాఫీ, కౌలు రైతులకు, రైతు కూలీలకు సాయం, చేస్తామన్న హామీలను అమలు కానందుకు అడగడానికి సిద్ధం కండి. వితంతు, వృద్ధాప్య, దివ్యాంగుల పెన్షన్లు నెలలోపే పెంచి ఇస్తామని వాటి ఊసెత్తని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడగడానికి సిద్ధంగా ఉండండి.**



జూలపల్లి, డిసెంబర్ 02, జనం రిపోర్టర్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 4వ తేదీన పెద్దపల్లి జిల్లాకు రానున్న సందర్భంలో పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రంలో పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో కెసిఆర్ సారధ్యంలో అనేక సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు సైతం పరుగులు పెట్టించిన నాటి రోజుల నుండి, నేటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అభివృద్ధి అనే మాటకు అర్థమే తెలియకుండా పోయిందని అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి సంవత్సరకాలం సమయమిచ్చాం. 420 అమలు గాని హామీలను మేనిఫెస్టోలో పెట్టి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే హామీలను అమలు చేస్తామని చెప్పి ఓట్లు దండుకున్న రేవంత్ రెడ్డి సంవత్సర కాలం గడిచినా, ఇచ్చిన హామీలను అమలు చేయని మీరు, వీటిపై వివరణ ఇచ్చి పెద్దపల్లి జిల్లాకు రావాలని,లేని పక్షంలో ఈ హామీలపై పెద్దపల్లి ప్రజలు ప్రశ్నించడానికి సిద్ధంగా ఉన్నారు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది చొక్కా రెడ్డి, మండల నాయకులు తమ్మడవేని మల్లేశం, జూలపల్లి మండల టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చొప్పరి శేఖర్, పూరెల్ల గంగయ్య, లక్కాకుల శ్రీనివాస్, పొలగాని సతీష్, కన్నం రమేష్, నారగోని శంకరయ్య ర్యాకం భాస్కర్, ఓదెలు, కొత్త శ్రీధర్ మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొలికి వారి వివాహ వేడుకలో పాల్గొన్న ఇన్చార్జి దద్దాల



(కనిగిరి డిసెంబర్ 2 జనంరిపోర్టర్ ): పెద్ద చెర్లోపల్లి మండలం మండలం పిల్లి వారి పల్లి లో కొలికి కొండయ్య శ్రీమతి వెంకటనారాయణమ్మ ల కుమార్తె అమల వివాహ వేడుకలు జరిగాయి.. ఈ వివాహ వేడుకలకు కనిగిరి వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని నూతన వధూవు ను ఆశీర్వదించారు ఈ సందర్భంగా వధువుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో జడ్పిటిసి ఓకే రెడ్డి, చింతకుంపల్లి ఎంపీటీసీ భూమిరెడ్డి కొండారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కటికల వెంకటరత్నం,మేకల మాల్యాద్రి మాజీ సర్పంచి, వైస్ సర్పంచ్ రాజా,పిల్లి వారి పల్లి సర్పంచి పాలగిరి బాలిరెడ్డి,కొలికి కొండయ్య,కొలికి నరసింహ , యరవా నరసింహ చౌదరి,హెచ్ఎంపాడు సీనియర్ నాయకులు ఆదినారాయణ రెడ్డి, ఇర్లపాడు ఎంపీటీసీ మైల రవణమ్మ కొండయ్య, గోపిరెడ్డి రోసిరెడ్డి సుర మాలి, గోపిరెడ్డి మాలకొండయ్య మాజీ సర్పంచి గొబ్బెల్ల శ్రీను ఉండేలా కృష్ణారెడ్డి గుంటుపల్లి ఎక్స్ ఎంపీటీసీ భోగాల మాలకొండరెడ్డి , సర్పంచి రాజశేఖర్ రెడ్డి, యువ నాయకులు వాకమల్ల రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రామ్ గోపాల్ వర్మకు ఏపీ హైకోర్టులో స్వల్ప ఊరట

వర్మపై మార్ఫింగ్ ఫొటోల కేసులు

కేసులను కొట్టివేయాలంటూ హైకోర్టులో వర్మ క్వాష్ పిటిషన్

9వ తేదీ వరకు వర్మపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశం




అమరావతి: చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ ఫొటోలను మార్ఫింగ్ చేసిన కేసులకు సంబంధించి సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు ఏపీ హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. తనపై నమోదైన కేసులను క్వాష్ చేయాలంటూ ఆయన పెట్టుకున్న పిటిషన్ ను ఈరోజు హైకోర్టు విచారించింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే సోమవారానికి (9వ తేదీ) వాయిదా వేసింది. 9వ తేదీ వరకు వర్మపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. మరోవైపు విచారణకు హాజరు కావాలంటూ పోలీసులు ఇచ్చిన నోటీసులకు వర్మ స్పందించలేదు. పోలీసు విచారణకు ఆయన ఇప్పటి వరకు హాజరుకాలేదు. ఓవైపు ఆయన కోసం పోలీసులు గాలిస్తున్నారు. మరోవైపు ఆయన మాత్రం మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తూ పోలీసులకు షాకిస్తున్నారు.

# అట్టహాసంగా ఆరోగ్య ఉత్సవాలు

నర్సింగ్ కళాశాలలు, మైత్రి ట్రాన్స్ క్లినిక్ లను వర్చువల్ ద్వారా ప్రారంభించిన సీ.ఎం

ఆరోగ్య తెలంగాణ సాధనే లక్ష్యమని వెల్లడి

పాల్గొన్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు




నిజామాబాద్ (జనం రిపోర్టర్) జిల్లా ప్రతినిధి డిసెంబర్ 02 /: రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆరోగ్య ఉత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. బోధన్ శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు హాజరవగా, ఆయా జిల్లాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలను, మైత్రి ట్రాన్స్ క్లినిక్ లను హైదరాబాద్ నుండి మంత్రులు దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేంనరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ తదితరులతో కలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. స్థానికంగా నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జ్యోతి ప్రజ్వలన చేసి ఆరోగ్య ఉత్సవాల కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. నూతనంగా నియామకం చేసిన 442 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు, 24 మంది ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లకు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. రాష్ట్రాన్ని ఆరోగ్యవంతమైన తెలంగాణ సమాజంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వైద్య రంగానికి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగానే 7800 మంది నర్సింగ్ ఆఫీసర్లను ఇప్పటికే నియమించగా, తాజాగా అసిస్టెంట్ సర్జన్ ల ఖాళీలను భర్తీ చేశామన్నారు. త్వరలోనే వైద్యారోగ్య శాఖలో మరో 6496 ఖాళీలు భర్తీ కానున్నాయని వివరించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన 10 నెలల వ్యవధిలోనే 55 వేల ఉద్యోగ నియామకాలు జరిపి సరికొత్త చరిత్రను లిఖించడం జరిగిందన్నారు. ఒక్క వైద్య శాఖలోనే ఏడాది కాలంలోనే 14 వేల ఉద్యోగాలను, డీఎస్సీ ద్వారా 11 వేల మంది ఉపాధ్యాయుల నియామకాలు చేశామన్నారు. వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ అన్ని వర్గాల ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా వసతి, సదుపాయాలను పెంపొందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ దిశగా నూతనంగా 16 నర్సింగ్ కళాశాలను నెలకొల్పామని, 104, 108 అంబులెన్సు సేవలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మరింతగా అందుబాటులోకి తెస్తున్నామని వివరించారు. అధికారం చేపట్టిన 48 గంటల వ్యవధిలోనే రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని 5 లక్షల నుండి 10 లక్షల రూపాయలకు పెంచడం జరిగిందని గుర్తు చేశారు. నిరుద్యోగ యువత ఆశయాలకు అనుగుణంగా నియామకాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ ఆయా శాఖలలో ఖాళీలను భర్తీ చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి, ఎలాంటి ఆక్షేపణలు తావులేకుండా పకడ్బందీగా గ్రూప్ ఎగ్జామ్స్ నిర్వహించి ఉద్యోగ నియామకాలు జరుపుతున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను పునరావాస కేంద్రంగా మార్చారని, తమ ప్రభుత్వం రిటైర్డ్ డీజీపీ, సీనియర్ ఐ.ఏ.ఎస్ లను కమిషన్ చైర్మన్ లుగా నియమించి పనితీరులో సమూల మార్పులు తెచ్చిందన్నారు. విశ్వ విద్యాలయాలకు ఉపకులపతులను నియమించడంతో పాటు బోధన, బోధనేతర ఖాళీల భర్తీకి చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ ఖజానాపై ఎనలేని ఆర్థిక భారం పడుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 లకే వంట గ్యాస్ సిలిండర్, పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నామని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రూ. 2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేశామని, తద్వారా రాష్ట్రంలో 25 లక్షల రైతు కుటుంబాలకు రుణమాఫీ ద్వారా 21 వేల కోట్ల రూపాయల లబ్ది చేకూరిందన్నారు. సంక్రాంతి పండుగ తరువాత రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. వసతి గృహాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్ల విద్యార్థులతో పాటు పేద ప్రజలకు కూడా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నెలనెలా సన్న బియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించినందున రాష్ట్రంలోని రైతులు సన్న ధాన్యాన్ని సాగు చేయాలని పిలుపునిచ్చారు. సన్న ధాన్యానికి ఇకముందు కూడా క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ ను అందిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా అట్టహాసంగా ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగానే డిసెంబర్ 9న రాష్ట్ర సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి జాతికి అంకితం చేస్తామని వెల్లడించారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్న తమ ప్రభుత్వానికి ప్రజలు అండదండగా నిలుస్తూ కాపాడుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో , రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. వైద్యారోగ్య శాఖ అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సింగరేణి కార్మికుల సొంత ఇంటి కల పెర్క్ మీద ఇన్కమ్ ట్యాక్స్ మాఫీ చేపిస్తాం.....



**రానగుండం/డిసెంబర్ 02(జనం రిపోర్టర్):** స్థానిక ఆర్జీ-1 జీడీకే 11 ఇంక్లైన్ లో ఏర్పాటు చేసిన గెట్ మీటింగ్ కి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల చిరకాల వాంఛ అయిన కార్మికుల సొంత ఇంటి కల , పెర్క్ మీద ఇన్కమ్ ట్యాక్స్ మాఫీ గురించి ప్రభుత్వ తో మాట్లాడటం జరిగిందని, త్వరలోనే ఆచరణ కాబోతుందని తెలిపారు. అంతే కాకుండా తెలంగాణ లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ముఖ్యంగా కార్మికుల కృషి వల్ల ఎన్నడూ లేని విధంగా సింగరేణి లో అత్యధిక ఉత్పత్తి, ఉత్పాదక, లాభాలు గడించిందని, ప్రభుత్వం కూడా సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని, ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే పెండింగ్ లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగుల వయోపరిమితి 35-40 ఏళ్ల పెంపు , రామగుండం లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ , 800 మెగా వాట్ల పవర్ ప్లాంట్లు , నైని ప్రాజెక్టు నిర్మాణం , స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ఏర్పాటు , కోటి రూపాయల ప్రమాద భీమా , స్థానికులకే 80% ఉద్యోగాలు , సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం, బీసీ లైజనింగ్ ఆఫీసర్ నియామకం వంటి అనేక కార్యక్రమాలు చెప్పటామని, సింగరేణి కార్మికులకు గతంలో కన్నా ఎక్కువ 796 కోట్లు లాభాలు ఇవ్వటం తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ల కృషి ఫలితంగా కాంట్రాక్టు కార్మికుల కి కూడా లాభాలలో నుండి 5000 రూపాయలు ఇప్పించామని, అలాగే భవిష్యత్ లో కూడా రామగుండం లో 1000 క్వార్టర్లు తో గేటెడ్ కమ్యూనిటీని తరహా నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహ రెడ్డి, ధర్మపురి మాట్లాడుతూ ..ఏఐటీయూసీ గుర్తింపు సంఘం పూర్తి గా విఫలమైంది అని, ఒకప్పుడు పోరాటాలు చేసే నాయకులు ఉంటే ఇప్పుడు పైరవీల కోసం ఆరాటే పడే నాయకులు ఉన్నారని, మొన్న జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో ఒక్క డిమాండ్ కూడా అగ్రిమెంట్ చేయకుండా సూచన ప్రాయంగా అంగీకరించారని తెలపటం సిగ్గు చేటని దుయ్యబట్టారు. జీడీకే 11 ఇంక్లైన్ వెల్ఫేర్ ఆఫీసర్ కార్మికులకు అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు. ఆర్జీ-1 వైస్ ప్రెసిడెంట్ సదానందం అధ్యక్షత న జరిగిన ఈ కార్యక్రమంలో సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహ రెడ్డి ,ధర్మపురి, జనరల్ సెక్రటరీలు వంగ లక్ష్మిపతి గౌడ్, వికాస్ కుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షులు వద్దేపల్లి దాస్, నాయకులు లింగస్వామి , జాయింట్ జనరల్ సెక్రటరీ లు గడ్డం కృష్ణ, బత్తుల పోచయ్య, మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ పోతరబోయిన సమ్మయ్య యాదవ్, సెంట్రల్ సెక్రటరీ లు మోసిన్, పుట్ట రమేష్, మంద రమేష్,బ్రాంచ్ సెక్రటరీలు గుండేటి శ్రీనివాస్, ఎదులాపురం శ్రీనివాస్ , పిట్ సెక్రటరీ గాదె సంపత్, అల్లావుద్దీన్, తాటి రాజయ్య, సంపత్, రామస్వామి, కుమారస్వామి, హేమంత్,రాకేష్, ఆంజనేయులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గత ప్రభుత్వం రామగుండం పై వివక్ష చూపుతూ జిల్లాను చేయలేదు....

కనీసం ఈ ప్రభుత్వం అయిన రామగుండం ను రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలి....

-మద్దెల దినేష్....

**రామగుండం /డిసెంబర్ 02(జనం రిపోర్టర్):** ప్రజలకు చేరువగా పాలన, సమర్థంగా పథకాల అమలు, పేదరిక నిర్మూలన, పటిష్ఠ పర్యవేక్షణ లక్ష్యాలతో గత ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణకు పూనుకుందని, ఉమ్మడి రాష్ట్రంలోని తెలంగాణలో చివరిసారిగా 38 ఏండ్ల క్రితం అంటే 1978 ఆగస్టు 15న రంగారెడ్డి జిల్లా ఆవిర్భవించిందని, ఆ తర్వాత అనేక కొత్త జిల్లాల కోసం పోరాటాలు, ఉద్యమాలు డిమాండ్లు వచ్చినా సాధ్యపడలేదని, తెలంగాణ ఏర్పడిన అనంతరం గత కెసిఅర్ ప్రభుత్వం హయాంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ చట్టం-1974 ప్రకారం తెలంగాణలో కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారని, కొత్తగా జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. దీంతో రాష్ట్రంలో మొత్తం జిల్లాల సంఖ్య 33కి, రెవెన్యూ డివిజన్లు 76కి, మండలాలు 612 ఉన్నాయన్నాయని డి హెచ్ పి ఎస్ నేత మద్దెల దినేష్ పేర్కొన్నారు. సోమవారం రోజున జిల్లా కేంద్రంలో ప్రజావాణి సందర్భంగా అధికారులకు రామగుండం రెవేన్యూ డివిజన్గా ఏర్పాటు చేయాలని,అదే విధంగా గోదావరిఖని లో అర్బన్ తహశీల్దార్ కార్యాలయం మంజూరు చేయాలని కోరారు. అనంతరం మద్దెల దినేష్ మాట్లాడుతూ.. గత రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుండి రామగుండంను చిన్నచూపు చూస్తుందని జిల్లాల పునర్విభజన సందర్భంగా రామగుండం జిల్లాను ఏర్పాటు చేయాలని, ప్రజల కోరిక తిరస్కరించి పెద్దపల్లి జిల్లాగ ప్రకటించిందన్నారు. తదనంతరం రామగుండమును రెవెన్యూ డివిజన్ ను ప్రకటిస్తామని ప్రభుత్వాలు హామీ ఇచ్చిన దానిని పూర్తిగా ప్రజా ప్రతినిధులు కూడా మర్చిపోయారని విమర్శించారు. రామగుండం జనాభా పరంగా రష్ట్రంలోని నగరాల్లో 5వ స్థానములో , వైశాల్యములో 4వ. స్థానంలో ఉండి, అత్యధిక పన్నులను చెల్లిస్తున్న కార్పొరేషన్ లలో ఒకటిగా ఉండి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అత్యధిక పన్నులు , రాయల్టీ లను చెల్లిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలు కుడా ఎన్నో ఉండి జిల్లాగా ఏర్పడని(ఏర్పాటు చేయని)ప్రాంతముగా చరిత్రలో రామగుండము ప్రాంతంనిలిచిపోయిందన్నారు.అదే విధంగా మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా పేరొంది, మూడు లక్షలకు పైగా జనాభా ఉన్న రామగుండము ప్రాంతాన్ని కాదని యాభై వేల జనాభా ఉన్న పెద్దపల్లి ని ఒక జిల్లాగా నాటి ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.రామగుండము ప్రాంతానికి ప్రస్తుతం ఉన్న రెవిన్యూ డివిజన్ ను పెద్దపల్లి, మూడు లక్షలకు పైగా ఉన్న రామగుండము ప్రాంత ప్రజలు రెవిన్యూ అవసరాలకు కొరకు పెద్దపల్లి నిత్యం 30 కిలోమీటర్లు ప్రయాణం చేసి వెళ్ళాల్సి వస్తుందన్నారు. పెద్దపల్లి జిల్లా విస్తీర్ణం: 2,236 చ.కి.మీ.జనాభా 7,95,332,అక్షరాస్యత 60 శాతం,మండలాలు మొత్తం 14,అత్యధిక జనాభాగల మండలం రామగుండం, రెవెన్యూ డివిజన్లు పెద్దపల్లి, మంథని,రెవెన్యూ గ్రామాలు మొత్తం 215 ఉన్నాయన్నారు రామగుండం, అంతర్గం, పాలకుర్తి తో కలిపి చుట్టూ ప్రక్కన ఉన్న మండలాలతో రామగుండం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డీమాండ్ చేశారు. కేవలం ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయం వల్ల రామగుండము ప్రాంత ప్రజలు వ్యయ ప్రయాసల పాలవుతున్నారని పెద్దపల్లి జిల్లాలో సగానికి పైగా జనాభా రామగుండము ప్రాంతములోనే కేంద్రీకృతమైందని పరిపాలన సౌలభ్యం కొరకే మీరు కొత్తగా జిల్లాలు ఏర్పాటు చేసిన అనంతరం రామగుండంను రెవెన్యూ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కడం జరిగిందన్నారు.మూడు లక్షలకు పైగా జనాభా వున్నాకూడా ఈ రామగుండానికి కేవలం ఒకే ఒక తహశీల్దార్ కార్యాలయం వుండడం సరికాదని, గోదావరిఖనిలో అత్యధికంగా ఉన్న జనాభా ప్రతిపాదికన క్రింద చూసి ఖనిలో ఒక అర్బన్ తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. డిసెంబర్ 4న. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ వస్తున్న సందర్భంగా రామగుండం రెవెన్యూ డివిజన్ గా ఉదాహరణలు అర్బన్ తహశీల్దార్ కార్యాలయం మంజూరు చేయాలని మద్దెల దినేష్ డిమాండ్ చేశారు.



## కార్యకర్తలకు అండగా దద్దాల నారాయణ యాదవ్

పలువురిని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేత



(కనిగిరి డిసెంబర్ 2 జనంరిపోర్టర్ ): కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ఇటీవల పలు ఆరోగ్యసమస్యలతో ఇబ్బందులు పడుతున్న వైసీపీ కార్యకర్తలను, నాయకులను సోమవారం పరామర్శించారు. పెద్ద చెర్లోపల్లి మండలం మారెళ్ళ పంచాయతీలో కిడ్నీ వ్యాధి తో బాధపడుతున్న ఆంద్ర మాలకొండయ్యను పరామర్శించారు. యనకు 25000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.అనంతరం ఇదే మండలం పెద్ద చెర్లోపల్లి పంచాయతీలో కిడ్నీ సంబంధిత తో బాధపడుతున్న గుంటగాని రాజేష్ ను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయనకు 15000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇర్లపాడు పంచాయతీలో కాలుకు గాయమై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న గోపిరెడ్డి రోసిరెడ్డిని పరామర్శించి ఈ సందర్భంగా వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఓకే రెడ్డి, చింతకుంపల్లి ఎంపీటీసీ భూమిరెడ్డి కొండారెడ్డి ఎస్సీ సెల్ నాయకులు కటికల వెంకటరత్నం,హెచ్ఎంపాడు సీనియర్ నాయకులు ఆదినారాయణ రెడ్డి, ఇర్లపాడు ఎంపీటీసీ మైల రవణమ్మ కొండయ్య, గోపిరెడ్డి రోసిరెడ్డి సుర మాలి, గోపిరెడ్డి మాలకొండయ్య మాజీ సర్పంచి గొబ్బెల్ల శ్రీను ఉండేలా కృష్ణారెడ్డి గుంటుపల్లి ఎక్స్ ఎంపీటీసీ భోగాల మాలకొండరెడ్డి , సర్పంచి రాజశేఖర్ రెడ్డి, యువ నాయకులు వాకమల్ల రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# షెడ్డుకే పరిమితమైన 'ఈ' ఆటోలు



పొన్నూరు /డిసెంబర్ 02(జనం రిపోర్టర్): గుంటూరు జిల్లా పొన్నూరు పురపాలక సంఘంలోని' ఈ 'ఆటోలు అర్ధ దశాబ్దం పైబడి షెడ్డుకే పరిమితమయ్యాయి. గత ప్రభుత్వంలో మున్సిపాలిటీకి పారిశుద్ధ్య పనులు నిమిత్తం 6 ఆటోలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రారంభ తొలినాళ్లలో మొక్కుబడిగా పనిచేసి తరువాత కాలంలో షెడ్డుకు పరిమితమయ్యాయి. అప్పటి మున్సిపల్ కమిషనర్ నయుమ్ అహ్మద్ వాటిని మరమ్మత్తులు చేపట్టి మళ్లీ వాడుకలోకి తెచ్చారు. నెలరోజులపాటు పనిచేసే పూర్తిగా మళ్లీ షెడ్డుకే వెళ్లాయి.'ఈ' ఆటోల ప్రాధాన్యతను గుర్తించి ప్రభుత్వం మున్సిపాలిటీకి వాటిని అందజేసింది. వాటిని మెయింటినెన్స్ చేయటంలో అధికారులు విఫలమయ్యారు.'ఈ' ఆటోలు పనిచేయకపోవడంతో మున్సిపల్ కార్మికులు చెత్త వ్యర్థాలను తరలించాలంటే వ్యాయా ప్రయాసలు కూర్చి అధిక భారం ,పని ఒత్తిడి లోనవుతున్నట్లు కార్మికులు మీడియాకు వెల్లడించారు. ప్రస్తుత కమిషనర్ రమేష్ బాబు 'ఈ 'ఆటోలను గత నెలలో మూడింటిని మరమ్మత్తులు చేయించారు. ముచ్చటగా మూడు, నాలుగు రోజులు తిరిగి మరల షెడ్డుకే తరలి వెళ్లాయి. లక్షలాది రూపాయలు ప్రజాధనం వెచ్చించి నా'ఈ 'ఆటోలు పనిచేయకపోవడంతో ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరుగా మిగిలిపోవటంతో పట్టణంలో పలువురు సామాజిక కార్యకర్తలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు.'ఈ' ఆటోలతో వీధి వీధిలోకి వెళ్లి తడి చెత్త పొడి చెత్త వ్యర్థాలు సేకరించి సులువుగా డంపింగ్ యార్డ్ కు తరలించే వేసులుబాటుఉంది. మరోపక్క కార్మికులకు పని సులభతరం అవుతుంది. అధికారులు ఇప్పటికైనా 'ఈ 'ఆటోలకు మరమ్మత్తులు చేపట్టడం లేదా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి పారిశుద్ధ్య కార్మికులకు పని ఒత్తిడి తగ్గించి పట్టణ పారిశుద్ధ్యం నూరు శాతం అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని పుర ప్రజలు కోరుతున్నారు. కొసమెరుపు.... ఈ ఆటోలు పని ప్రదేశంలోనే చెడిపోవడంతో ద్విచక్ర వాహనంపై తాడు కట్టి లాక్కెళ్ళటం గమనార్హం..

# జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన తెలుగు తేజం...

## వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 81 కేజీల కేటగిరిలో కాంస్య పథకం సాధించిన ప్రేమ్ సాగర్...

## 13 రాష్ట్రాల నుంచి 125 విశ్వవిద్యాలయాల విద్యార్థులు పాల్గొన్నారు...




అమరావతి /డిసెంబర్ 02(జనం రిపోర్టర్): నాగార్జున విశ్వవిద్యాలయంలో నవంబర్ 26 నుండి డిసెంబర్ మూడో తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 2024 25 పోటీల్లో కడప జిల్లా యోగి వేమన విశ్వవిద్యాలయం నుంచి దేవరకొండ ప్రేమ్ సాగర్ 81 కేజీల కేటగిరీలో కాంస్య పథకం సాధించాడు. స్నాచ్ లో 134 కేజీలు, క్లీన్ అండ్ జర్క్ లో 163 కేజీలు మొత్తంగా 297 కేజీలు ప్రేమ్ సాగర్ వెయిట్ లిఫ్టింగ్ చేశాడు.జాతీయస్థాయిలో మొత్తం 13




రాష్ట్రాల నుంచి 125 విశ్వవిద్యాలయ విద్యార్థులు పాల్గొనగా, వారిలో ప్రేమ్ సాగర్ తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పథకం సాధించాడు. తను కాంస్య పథకం సాధించిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, తన ప్రతిభ పై విశ్వాసంతో తనకు స్పాన్సర్ చేస్తున్న రాధే గ్రూప్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశాడు. ప్రస్తుత చిత్తూరు మెంబర్ అఫ్ పార్లమెంట్ ( ఎంపి ) దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఆయన కుమారుడు దగ్గుమళ్ళ రాధే( రాధే గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ ) తనను విశ్వసించి తనకు స్పాన్సర్ చేస్తున్నారని, అలాగే తన కోచ్ దీన్నా బాబు గురు స్థానంలో నిలిచి తనకు కఠిన శిక్షణ ఇవ్వడం ద్వారా ఈ రోజున కాంస్య పథకం సాధించగలిగానని ప్రేమ్ సాగర్ తెలిపాడు. చిన్నప్పటినుండి తన తల్లిదండ్రులు తనను ఒక గొప్ప వెయిట్ లిఫ్టర్ గా చూడాలన్నదే వారి జీవిత ఆశయంగా పెంచారని ప్రేమ్ సాగర్ ఆనంద భాష్పాలు కార్చాడు. ప్రేమ్ సాగర్ యోగివేమన విశ్వవిద్యాలయంలో డిగ్రీ మొదటి సంవత్సరం అభ్యసిస్తున్నాడు. అలాగే యోగి వేమన విశ్వవిద్యాలయంలో డాక్టర్ కొవ్వూరు రామసుబ్బారెడ్డి స్పోర్ట్స్ బోర్డ్ హెడ్ అండ్ సెక్రటరీగా వ్యవహరిస్తుండగా, కోచ్ గా ఆంధ్రప్రదేశ్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి దీన్నా బాబు వ్యవహరిస్తున్నారు.

# జగన్ అక్రమాస్తుల కేసుల పూర్తి వివరాలివ్వండి

న్యూఢిల్లీ : వైసిపి అధ్యక్షుడు వైఎస్.జగన్ అక్రమాస్తుల కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని సీబీఐ, ఈడీలను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. కేసుల పూర్తి వివరాలు రెండు వారాల్లోగా అందించాలని, కింది కోర్టులో ఉన్న డిశ్చార్జ్ పిటిషన్ల వివరాలు ఇవ్వాలని ధర్మాసనం తెలిపింది. తెలంగాణ హైకోర్టులో ఉన్న పెండింగ్ అప్లికేషన్ల వివరాలు అందించాలని సుప్రీం కోర్టు సూచించింది. సీబీఐ, ఈడీ కేసుల వివరాలు విడివిడిగా చార్ట్ రూపంలో అందించాలని, అన్ని వివరాలతో అఫిడవిట్లు రెండు వారాల్లో దాఖలు చేయాలని ఆదేశించింది. జగన్ అక్రమాస్తుల కేసు విచారణ ఆలస్యమవుతోందని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు గతంలో పిటిషన్ వేశారు. కేసు విచారణ మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారు. దీనిపై విచారణను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం చేపట్టింది. వాదనల సందర్భంగా.. రోజువారీ పద్ధతిలో విచారణకు ఇప్పటికే తెలంగాణ హైకోర్టు ఆదేశించినట్లు ఇరుపక్షాల న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలిస్తే తగిన ఆదేశాలు ఇస్తామని ధర్మానం స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలు, ట్రయల్ కోర్టు, పెండింగ్ కేసుల వివరాలు ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 13కు కోర్టు వాయిదా వేసింది.

# సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ భేటీ

అమరావతి : ఏపీ సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ భేటీ అయ్యారు. సోమవారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో చంద్రబాబుతో పవన్ కల్యాణ్ లంచ్ మీటింగ్ కొనసాగుతోంది. కాకినాడలోని బియ్యం అక్రమ రవాణాపై వారు చర్చించనున్నారు. తాజా రాజకీయ పరిణామాలు, రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపైనా సమాలోచనలు చేయనున్నారు. మరోవైపు తన ఢిల్లీ పర్యటన విశేషాలను చంద్రబాబుకు పవన్ వివరించనున్నారు. సోషల్ మీడియా కేసులు, నామినేటెడ్ పదవుల అంశం వీరి మధ్య చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఇటీవల పవన్ ఢిల్లీకి వెళ్లి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి అమిత్‌షా, తదితరులను కలిసిన విషయం విదితమే. ఢిల్లీ పర్యటనపై కూడా చంద్రబాబుకు పవన్ వివరించానున్నరు.ఎ

# భోపాల్ విషాదంపై ముందే హెచ్చరించిన న్యాయవాది !

భోఫాల్ : నలభై ఏళ్ల క్రితం మధ్యప్రదేశ్‌లో జరిగిన దుర్ఘటన గురించి ఒక న్యాయవాది ముందే హెచ్చరించారు. భోపాల్‌ని యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ నుంచి వెలువడిన విషవాయువులు పెను విషాదాన్ని మిగిల్చిన విషయం తెలిసిందే. అయితే, ఆ ఘటనకు సంబంధించిన పలు కీలక విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఫ్యాక్టరీ నుంచి విషవాయువులు వెలువడుతున్నాయని, దాన్ని మూసివేయాలని ఘటనకు ముందే నోటీసులు పంపినట్లు షానవాజ్ ఖాన్ (75) అనే న్యాయవాది తెలిపారు. అయితే, ఈ హెచ్చరికలను ఫ్యాక్టరీ యాజమాన్యం కొట్టిపారేసిందని వెల్లడించారు. 1983 మార్చి 4న యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెట్‌కు షానవాజ్ లీగల్ నోటీసులు పంపారట. 'ప్లాంట్ జనావాసాల మధ్య ఉంది. దీని నుంచి వెలువడుతున్న విషపూరిత వాయువులు, రసాయనాల నిల్వలతో సమీప కాలనీలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే 50 వేల మంది ప్రాణాలకు హాని కలుగుతుంది. 15 రోజుల్లోపు మీ ఫ్యాక్టరీలో విషవాయువులు, ప్రమాదకర రసాయనాల వినియోగాన్ని నిలిపివేయాలి. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు ఎదుర్కోవలసి ఉంటుంది' అని తాను నోటీసులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. 1981లో ఆ ఫ్యాక్టరీలో పనిచేసే ఓ కార్మికుడు విషవాయువు లీకవడంతో మృది చెందారని ఖాన్ తెలిపారు. ఆ తర్వాత అక్కడ పలు మార్లు ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడంతో స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురయ్యారని వెల్లడించారు. ఈ క్రమంలోనే తాను యూసీఐఎల్‌కి లీగల్ నోటీసులు పంపించానన్నారు. అయితే, వాటిని యూసీఐఎల్ కొట్టిపారేసిందని ఖాన్ తెలిపారు. భోపాల్‌లో 1984 డిసెంబర్ 2న అర్ధరాత్రి విష వాయువులు లీక్‌అయిన దుర్ఘటనలో 3,787 మంది ప్రాణాలు కోల్పోగా.. దాదాపు 5లక్షల మంది తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దాని బాధితులు ఇంకా న్యాయ పోరాటం చేస్తూనే ఉన్నారు.

# మెషిన్ ఫ్రీక్వెన్సీ మార్పుతో ఇవిఎంల హ్యాక్



న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎం)లను మెషిన్ ఫ్రీక్వెన్సీలను సవరించడం ద్వారా హ్యాక్ చేయవచ్చునని ముంబయికి చెందిన సయ్యద్ షుజా అనే వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం ఇటీవల తీవ్ర కలకలం రేపింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇవిఎంలను హ్యాక్ చేయడంతో పాటు తాను ట్యాంపరింగ్ కూడా చేయగలనని సయ్యద్ పోస్టు చేసిన వీడియోలో పేర్కొన్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇవిఎంలపై తప్పుడు వాదనలు చేస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు చేయడంతో ముంబయి సైబర్ పోలీసులు కేసు నమోదు చేశారని ఇసి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 2019లోనూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అతడిపై ఢిల్లీలో కేసు నమోదైనట్లు పేర్కొంది. ప్రస్తుతం అతడు విదేశాల్లో ఉన్నట్లు తెలిపింది.

# మనసులు కలిపే వంతెన..

## రాజమండ్రి గోదారి బ్రిడ్జికి యాభయ్యేళ్ళు



యాండే.. గోదారి బ్రిడ్జి ఎప్పుడు వస్తుందండీ పడుచుపిల్ల ఉత్సాహంగా అడిగింది.. లేదే లక్ష్మి రాగానే చెప్తాను నువ్ కాస్త పడుకో.. ఓహ్.. ఇంకా టైముందా... సరే రాగానే మర్చిపోకు మరి అంటూ అటు తిరిగింది అమ్మాయి.. ఇంకో పాతికేళ్ల కుర్రాడు పై బెర్త్ నుంచి కిందికి చూస్తూ రాయమండ్రి బిర్జి వచ్చేహిందా అన్నాడు.. లేదండీ.. బండింకా సామాల్కోట దాట్లేదు .. ఇంకా టైముంది అన్నాడు కిందిబెర్త్ అంకుల్.. ఓహో.. ఐతే రైల్ బ్రిడ్జి మీదకు ఎంటరవగానే చెప్పండే అంటూ కుర్రాడు మళ్ళీ ఫోన్లో బుర్ర దూర్చేసాడు. ఓలమ్మి.. రామండ్రి గోదారి బ్రిడ్జి వచ్చిండేటి అంది వరాలమ్మ.. లేదమ్మమ్మా.. ఇంకా రానేదు.. వచ్చినప్పుడు దడదడదడద సప్పుడొస్తది.. అందరికి తెలుస్తాదిలే.. నేను లేపుతాను నువ్వు తొంగోయే అని చెప్తోంది మనవరాలు మంగ... ఐద్రాబాడ్ ..



విశాపట్నం.. లేదా ఇసాపట్నం మద్రాస్.. ఈరూట్లో వెళ్ళేవాళ్ళకు గోదారి బ్రిడ్జి ఒక ఎమోషన్. ఒక బంధం.. అంతవరకూ నిప్పులుగక్కుతూ యుద్ధానికి వెళ్తున్న వైజయంతి యుద్ధ ట్యాంక్ మాదిరిగా దూసుకెళ్లే రైళ్లన్నీ గోదారిని చూడగానే.. ఎక్కడలేని సిగ్గును పులుముకున్న పడుచుపిల్ల పెళ్ళిచూపుల్లో నడిచినట్లు వగలుపోతూ స్లో అయిపోతాయి. అక్కడికి వచ్చేసరికి అడుగులు తడబడినట్లు.. అడుగులో అడుగేసినట్లు.. వాలుజడ ఊగినట్లు.. జడలోని మల్లెలు నవ్వినట్లు.. అంత సొగసుగా నడుస్తుంది ట్రైన్ అదంతే .. గోదారి.. దానిమీద వంతెన.. ఈ దక్షిణభారతంలోనే ఒక ఐకానిక్ నిర్మాణం... అది కేవలం తూర్పు.. పశ్చిమ గోదావరి జిలాలలను మాత్రమే కలిపే వంతెన కాదండి.. ఎన్నో మనసులతో ముడేసుకున్న బంధం.. కాదనుకున్నా వెంటాడే అనుబంధం. 1964 లో మూడో పంచవర్ష



ప్రణాళికలో ఇక్కడ రోడ్ కమ్ రైల్ బ్రిడ్జి నిర్మాణానికి బీజం పడింది. 1974లో వంతెన నిర్మాణం పూర్తవగా అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ దాన్ని జాతికి అంకితం చేసారు. ఆ మహా మహా నిర్మాణం ప్రారంభోత్సవాన్ని అప్పటి విజయవాడ కేంద్రంగా ఉన్న ఆలిండియా రేడియో ప్రత్యక్ష ప్రసారం చేసింది. దీని నిర్మాణంతో రాజమండ్రి, కొవ్వూరు మధ్య లాంచీల ప్రయాణం స్థానే బస్సులను నడపడం మొదలైంది. రెండు గోదావరి జిల్లాల మధ్య రాకపోకలు సులువయ్యాయి. ఈ ఏడాదితో గోదారి రైల్. రోడ్ బ్రిడ్జికి యాభయ్యేళ్ళు నిండాయి.. ఇక ఈ మార్గంలో ట్రైన్ మీదుగా ప్రయాణించే కోట్లాదిమందికి ఈ వంతెన మీదుగా ట్రైన్ నడవడం.. దాన్ని కిటికీలోంచి చూడడం ఒక అద్భుత భావన. ఒరేయ్.. బుడ్డోడా.. గోదారొచ్చింది.. చిల్లర పైసలు ఉంటే ఇవ్వరా అంటూ తీసుకుని కిటికీలోంచి గోదారమ్మకు దక్షిణ సమర్పించి ఒక దండం పెట్టుకుని సంతృప్తి పడని జీవులు లేనట్లే లెక్క. రాత్రి పూలతో బెర్త్ మీద నిద్దరోయి తెల్లారి వాటిని బయటపడేయకుండా గోదారి వచ్చేవరకూ ప్రేమగా చేతిలో పట్టుకుని కూర్చునే నవవధువులు.. సాయం సంధ్యవేళ దూరంగా కొండల్లోకి వెళ్లిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఆదిత్యుని.. గోదారిని



కలిపి చూడడం.. అందులోని భావుకత్వాన్ని ఆనందించడం కవులకే సాధ్యం.. అమ్మా కిందికి చూడు ఎన్ని బోట్లో... అంటూ ముద్దుముద్దుగా చెబుతున్న పిల్లాడిని దగ్గరకు పొదుముకుంటూ అవున్నన్నా గోదారిలో అన్నీ ఉంటాయి.. వాళ్లంతా చేపలు పడుతున్నారు అని వివరించే తల్లి. బ్రిడ్జి రాగానే... నోట్లో నీళ్లూరుతుండగా యాండే ఈ సీజన్లో గోదారిలో పులస దొరుకుతుందండీ... అది పులుసూపెట్టుకుని మర్నాడు తింటే ఉంటుందండీ అని వివరించే ఇంకో ఫుడీ నేరేషన్.. ఇంకో లెవెల్.. ఇలా గోదావరి వంతెన కేవలం ఒక నది మీద కట్టిన ఇనుప నిర్మాణం కాదండి.. అందులో బంధం.. ఆత్మీయత.. ఒక తీయని అనుభూతి.. ఇలా చెబుతూ వెళ్తే ఇంకెంతైనా రాయొచ్చు..

# మానని గాయం



ఆధునిక కాలంలో మనిషి అంతరిక్షాన్ని అందుకోగలిగాడుబీ చంద్రమండలం మీద అడుగు మోప గలిగాడుబీ సహజ మేధకు పోటీగా కృత్రిమ మేధను సృష్టించాడుబీ విశ్వామిత్ర సృష్టిని తలపించేలా మనుషులకు దీటైన మరమనుషులను సృష్టించాడు. ఇంతటి మహత్తర ఘనతలను చూసినప్పుడల్లా 'మానవుడే మహనీయుడు/ శక్తియుతుడు యుక్తిపరుడు మానవుడే మహనీయుడు... జీవకోటి సర్వములో శ్రేష్ఠతముడు మానవుడే!' అనుకుంటూ గర్వంతో ఉప్పొంగిపోతాం. రేపో మాపో అంగారక గ్రహం మీద ఆవాసాలను ఏర్పాటు చేసే దిశగా మనుషులు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుసుకున్నప్పుడు ఉత్సాహంతో ఉబ్బి తబ్బిబ్బయిపోతాం. మనిషి సాధించిన ఘన విజయాలను ఏకరువు పెట్టాలంటే, ఎన్ని గ్రంథాలైనా చాలవు. చరిత్రలో ఇన్ని ఘన విజయాలు సాధించిన మనిషికి అనాది పరాజయాలు కూడా ఉన్నాయి. ఆధునికత సంతరించుకుని, అంతరిక్ష పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్న మనిషి-అమరత్వాన్ని సాధించే దిశగా కూడా ప్రయత్నాలు సాగిస్తున్నాడు. అయితే, ఆకలి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని నేటికీ కనుక్కోలేకపోవడం మాత్రం ముమ్మాటికీ మనిషి వైఫల్యమే! యుద్ధాలలో ఉపయోగించ దానికి అధునాతన ఆయుధాలను ఎప్పటికప్పుడు తయారు చేయగలుగుతున్న మనిషి - అసలు యుద్ధాల అవసరమే లేని శాంతియుత ప్రపంచాన్ని ఏర్పాటు చేసుకోలేకపోవడం కూడా వైఫల్యమే! ప్రపంచంలో మనిషికి క్షుద్బాధను మించిన దుర్భర బాధ మరొకటేదీ లేదు. పురాణ సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకు ఆకలి ప్రస్తావన మనకు విరివిగా కనిపిస్తుంది. తాను ఆకలితో అలమటిస్తున్నా, అతిథికి అన్నం పెట్టి పుణ్యలోకాలకు వెళ్లిన రంతిదేవుడి కథ తెలిసినదే! ఆకలికి తాళలేక కుక్కమాంసం తిన్న విశ్వామిత్రుడి కథ పురాణ విదితమే! ఆకలి బాధ మనిషిని ఎంతకైనా దిగజారుస్తుంది. అందుకు విశ్వామిత్రుడి కథే ఉదాహరణ. పురాణాల్లో అక్షయపాత్రలు పుణ్యాత్ముల ఆకలి తీర్చిన గాథలు ఉన్నాయే గాని, సామాన్యుల ఆకలి తీర్చిన ఉదంతాలు లేవు. ఆకలితో అలమటిస్తున్నా, త్యాగం చేయడం గొప్ప సుగుణమని చెప్పే పురాణాలు - ఆకలికి శాశ్వత పరిష్కారాన్ని మాత్రం చెప్పలేదు. ఆధునిక సాహిత్యంలో ఆకలి ప్రస్తావనకు కరవు లేదు. స్వాతంత్ర్యోద్యమం ఉద్ధృతంగా సాగుతున్న కాలంలో 'మాకొద్దీ తెల్లదొరతనము' అని ఎలుగెత్తిన గరిమెళ్ల - ఆ పాటలోనే 'పన్నెండు దేశాలు పండుతున్నాగాని/ పట్టెడన్నమె లోపమండీ/ ఉప్పు పట్టుకుంటే దోషమండీ/ నోట మట్టి కొట్టుకుపోతామండీ/ అయ్యో కుక్కలతో పోరాడి కూడు తింటామండీ' అంటారు. స్వాతంత్ర్యం రాక ముందు మన దేశంలోని ఆకలి బాధలు అలా ఉండేవి. ప్రపంచమంతా ఆర్థికమాంద్యంతో అతలా కుతలమైన హంగ్రీ థర్టీస్ కాలంలో కలాలతో కవాతు చేసిన కవులందరూ ఆకలి కేకలు వినిపించిన వారే! 'ఆకలి ఆకలి తెరిచిన/ రౌరవ నరకపు వాకిలి/ హృదయపు మెత్తని చోటుల గీరే జంతువు ఆకలి/... ఈ ఆకలి హోరు ముందు/ పిడుగైనా వినిపించదు/ ఆకలి కమ్మిన కళ్లకు/ ప్రపంచమే కనిపించదు' అన్న బైరాగి 'ఆకలి' కవిత పాఠకులను విచలితులను చేస్తుంది. 'అన్నపూర్ణ గర్భగుడిని/ ఆకలి గంటలు మ్రోగెను/ ఆరని ఆకలి కీలలు/ భైరవ నాట్యము చేసెను/ ఘోర పరాజ యమా ఇది?/ మానవ మారణ హోమం/ తల్లీ! ఆకలి... ఆకలి!' అంటూ సోమసుందర్ ఆకలి కేకలు వినిపించారు. 'నేను ఆకలితో ఉన్నాను/ నువ్వు చంద్రుడి వద్దకు వెళ్లావు... నేను తిండిలేక నీరసిస్తున్నాను/ నాకు వాగ్దానాలు మేపుతున్నావు' అంటూ ఆధునిక శాస్త్ర సాంకేతిక పురోగతి ఒకవైపు, ఆకలి బాధలు మరోవైపుగా ఉన్న ఈ లోకంలో పాలకుల తీరును శ్రీశ్రీ ఎత్తిపొడుస్తారు. ఇప్పటికీ లోకం తీరు పెద్దగా మారలేదు. మానవుడు పంపిన ఉపగ్రహాలు అంగారకుడి వద్దకు వెళ్లినా, ఆకలి బాధలు సమసి పోలేదుబీ ఆకలి చావులు ఆగిపోలేదు. మనిషి ఘన విజయాల చరిత్రలో ఆకలి, అశాంతి - రెండూ మాయని మరకలు. ఈ రెండు మరకలూ పూర్తిగా చెరిగిపోయేంత వరకు మనిషి ఎన్ని విజయాలు సాధించినా, అవేవీ మానవాళికి ఊరటనూ ఇవ్వలేవుబీ మానవాళిని ఏమాత్రం ఉద్ధరించనూ లేవు. ఆకలికి, అశాంతికి మూలం మను షుల్లోని అసమానతలే! ప్రపంచంలో అసమానతలు తొలగిపోనంత వరకు ఆకలిని రూపుమాపడం, శాంతిని నెలకొల్పడం అసాధ్యం. నిజానికి సంకల్పం ఉంటే, సాధ్యం కానిదంటూ ఏదీ లేదు గాని, అసమానతలను రూపుమాపే సంకల్పమే ఏ దేశంలోనూ పాలకులకు లేదు. అందువల్లనే ఆకలి, అశాంతి మనుషులను తరతరాలుగా పట్టి పీడిస్తున్నాయి. అకాల మరణాలకు కారణమవుతున్నాయి. ఆకలి వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ దాదాపు పాతికవేల నిండు ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయి. అంటే, ఏడాదికి సగటున ఏకంగా తొంభై లక్షల మంది ఆకలికి బలైపోతున్నారు. ఆకలితో మరణిస్తున్న వాళ్లలో పసిపిల్లలు కూడా ఉంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న శిశు మరణాల్లో దాదాపు యాభై శాతం ఆకలి చావులే! నాణేనికి ఇదొకవైపు అయితే, మరోవైపు వంద కోట్లమందికి ఆకలి తీర్చడానికి తగినంత ఆహారం ప్రతిరోజూ వృథా అవుతోంది. ఈ పరిస్థితిని గమనించే 'అన్నపు రాసులు ఒకచోట/ ఆకలి మంటలు ఒకచోట' అని కాళోజీ వాపోయారు.ప్రపంచ ఆర్థిక శక్తుల్లో ఐదో స్థానంలో ఉన్న మన దేశం - ఆకలి సూచిలో నూట ఐదో స్థానంలో ఉండటం ఒక కఠోర వాస్తవం. అమృతోత్సవ భారతంలో ఆకలి సమస్య ఒక మానని గాయం!

## 100 శాతం పన్నులేస్తా

## బ్రిక్స్ దేశాలకు ట్రంప్ వార్నింగ్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికన్ డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించే ప్రయత్నాలను విరమించుకోకపోతే బ్రిక్స్ కూటమి, దాని మిత్రదేశాలపై 100 శాతం సుంకాలను విధిస్తానని బెదిరించారు. "మేం నిలబడి చూస్తున్నప్పుడు బ్రిక్స్ దేశాలు డాలర్‌కు దూరంగా ఉండటానికి ప్రయత్నిస్తున్నాయనే ఆలోచన ముగిసింది" అని ట్రంప్ ఆదివారం ఎక్స్ లో పోస్ట్ చేశారు. ప్రారంభంలో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా , దక్షిణాఫ్రికాతో కూడిన బ్రిక్స్ గ్రూప్, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అర్జెంటీనా, ఈజిప్ట్, ఇథియోపియాలను చేర్చడానికి విస్తరించింది. కొత్త రిజర్వ్ కరెన్సీ కోసం పిలుపునిచ్చిన రష్యా, చైనాల ప్రమేయంతో డాలర్‌కు ప్రత్యామ్నాయా లను సృష్టించడం గురించి బ్రిక్స్ ఆలోచిస్తోంది. గత ఏడాది దక్షిణాఫ్రికాలో జరిగిన సమ్మిట్‌లో, రష్యాలోని కజాన్‌లో జరిగిన అక్టోబర్‌లో జరిగిన సమ్మిట్‌లో బ్రిక్స్ కరెన్సీ ప్రతిపాదనపై చర్చించినట్టు మీడియా నివేదించింది. "ఈ దేశాలు కొత్త బ్రిక్స్ కరెన్సీని సృష్టించవు లేదా శక్తివంతమైన యూఎస్ డాలర్‌ను భర్తీ చేయడానికి మరే ఇతర కరెన్సీని తిరిగి ఇవ్వవు. అలాచేస్తే 100 శాతం టారిఫ్‌లను ఎదుర్కొంటారు. అంతేకాదు యూఎస్‌లో విక్రయించడానికి వీడ్కోలు చెప్పాలని సూచించారు. ఈ దేశాల నుంచి మాకు నిబద్ధతతో కూడిన ఆర్థిక వ్యవస్థ" అవసరమని అని ట్రంప్ ఆదివారం అన్నారు. అక్టోబర్ బ్రిక్స్ సమ్మిట్‌లో, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పాశ్చాత్య దేశాలు ఆంక్షల ద్వారా డాలర్‌ను "ఆయుధీకరణ" చేస్తున్నాయని విమర్శిం చారు, ఇది "ఈ కరెన్సీపై నమ్మకాన్ని దెబ్బతీస్తుంది . దాని అధికారాలను తగ్గిస్తుంది" అని అన్నారు. "డాలర్‌ను ఉపయోగించడానికి నిరాకరించేది మేము కాదు మేము ప్రత్యామ్నాయాల కోసం వెతకవలసి వస్తుంది" అని పుతిన్ జోడించారు. అయితే, డాలర్‌ను భర్తీ చేసే అవకాశాలను ట్రంప్ తోసిపుచ్చారు. "అంతర్జాతీయ వాణిజ్యంలో యూఎస్,బ్రిక్ దేశాలు భర్తీ చేసే అవకాశం లేదు. ఏ దేశం ప్రయత్నించినా అమెరికాకు వీడ్కోలు పలకాలి" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. తాజా టారిఫ్ బెదిరింపులు మెక్సికో, కెనడా ,చైనాలకు ఈ వారం ప్రారంభంలో ట్రంప్ జారీ చేసిన ఇలాంటి హెచ్చరికలను ప్రతిధ్వనిస్తున్నాయి. చట్టవిరుద్ధమైన వలసల నుంచి మాదకద్రవ్యాల

# డాలర్ స్థానంలో కరెన్సీ తేస్తే




అక్రమ రవాణా వరకు దేశాలు సమస్యలను కలిగి ఉన్నాయని ఆయన ఆరోపించారు . మెక్సికో , కెనడా నుంచి దిగుమతులపై 25 శాతం, చైనా నుంచి వచ్చే వాటిపై 10 శాతం పెంపును సుంకాలను ప్రతిపాదించారు. కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో శుక్రవారం ఫ్లోరిడాలోని ట్రంప్ యొక్క మార్-ఎ-లాగో నివాసాన్ని సందర్శించి ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నంలో భాగంగా.. మెక్సికో స్పందించింది. సుంకాలు కార్యరూపం దాల్చినట్లయితే సంభావ్య ప్రతిఘటనలను సూచించింది. తన "అమెరికా ఫస్ట్" ఆర్థిక ఎజెండాలో భాగంగా, చైనీస్ దిగుమతులపై అదనంగా 60 శాతం సహా విదేశీ వస్తువులపై భారీ సుంకాలను విధిస్తానని ట్రంప్ గత నెలలో చేసిన ప్రతిజ్ఞతో ఎన్నికల విజయం సాధించింది. అక్టోబర్‌లో, విదేశీ వస్తువులపై భారతదేశం అత్యధిక సుంకాలను విధించిందని ట్రంప్ విమర్శించారు. తాను తిరిగి ఎన్నికైతే పరస్పర పన్నును ప్రవేశపెడతానని ప్రమాణం చేశారు. "ఇది నా ప్రణాళికలో చాలా ముఖ్యమైన పదం, ఎందుకంటే మేము సాధారణంగా సుంకాలు వసూలు చేయం" అని ట్రంప్ అన్నారు. "చైనా మా నుంచి 200 శాతం సుంకం వసూలు చేస్తుంది. బ్రెజిల్ పెద్ద చార్జర్. అన్నింటికంటే పెద్ద చార్జర్ భారతదేశం అని ప్రస్తావించారు. సెప్టెంబరు 17న, ట్రంప్ తన దేశంతో వాణిజ్య సంబంధాలను "చాలా పెద్ద దుర్వినియోగదారుడు" అని భారతదేశాన్ని అభివర్ణించారు.

## గాజాలో మారణహోమం : ఇజ్రాయిల్ మాజీ రక్షణ మంత్రి



జెరూసలేం : గాజాలో ఇజ్రాయిల్ చర్యలను యుద్ధ నేరాలు, మారణహోమంగా ఇజ్రాయిల్ మాజీ రక్షణ మంత్రి మోషే యాలోన్‌్కొ పేర్కొన్నారు. మోషే యాలోన్ ఇజ్రాయెల్ మీడియాతో మాట్లాడుతూ ఉత్తర గాజా నుండి పాలస్తీనియన్లను బహిష్కరించాలని, అక్కడ యూదుల స్థావరాలను పునరుద్ధరించాలని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మరియు తీవ్రవాదులు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. మోషే యాలోన్ 2013-16 నుండి నెతన్యాహు ఆధ్వర్యంలో రక్షణ మంత్రిగా పనిచేశారు. యాలోన్ అప్పటి నుంచి నెతన్యాహుపై తీవ్ర విమర్శకుడిగా ఉన్నారు. గత నెలలో, నెతన్యాహు, అతని మాజీ డిఫెన్స్ చీఫ్ యోవ్ గాలంట్‌లకు గాజా వివాదంలో యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాల ఆరోపణలపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్ట్ (ఐసిసి) అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. ఏడాదికి పైగా గాజాలో ఇజ్రాయిల్ తీవ్ర మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోంది. మహిళలు, పిల్లలను చంపడం, గాజా నివాసులకు ఆహారాన్ని అందించే వరల్డ్ సెంట్రల్ కిచెన్ కార్మికులపై బాంబులు వేయడం వంటి అనేక యుద్ధ నేరాలకు ఇజ్రాయిల్ పాల్పడుతోంది.

## 'కెన్‌స్టార్' షిప్పును పవన్ ఎందుకు వదిలేశారు: పేర్నినాని




మచిలీపట్నం:డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇటీవలి కాకినాడ పోర్టు పర్యటనపై మాజీ మంత్రి,వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పేర్నినాని సంచలన ఆరోపణలు చేశారు. ఈ విషయమై మచిలీపట్నంలో పేర్నినాని సోమవారం(డిసెంబర్2) మీడియాతో మాట్లాడారు. స్టెల్లాషిప్‌ను తనిఖీ చేసిన పవన్ కల్యాణ్ కెన్‌స్టార్‌షిప్‌ను ఎందుకు వదిలేశారని మాజీ మంత్రి పేర్నినాని ప్రశ్నించారు. ప్రస్తుత ఆర్థిక మంత్రి వియ్యంకుడు అందులో బియ్యం తరలిస్తున్నారని తమకు సమాచారం ఉందన్నారు. తన ప్రశ్నలకు కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కెన్‌స్టార్‌షిప్‌లోకి వెళ్లేందుకు అనుమతి లేదంటున్నారని, అక్కడే ఉన్న అధికారులు కాకుండా ఇంకెవరు అనుమతి ఇవ్వాలో స్పష్టం చేయాలన్నారు. కెన్‌స్టార్‌షిప్‌లోకి వెళ్లకూడదని పవన్‌కల్యాణ్‌కు చంద్రబాబు చెప్పారా అని పేర్నినాని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం పోర్టు ఓనర్ అయితే అరబిందో కంపెనీ ప్రస్తావన ఎందుకు వచ్చిందో చెప్పాలన్నారు.

## సుప్రీంకోర్టులో సజ్జల భార్గవ రెడ్డికి ఊరట



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో సజ్జల భార్గవ రెడ్డికి ఊరట లభించింది. భార్గవరెడ్డికి రెండు వారాలపాటు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈలోగా ఏపీ హైకోర్టును ఆశ్రయించి ఈ కేసులో వాదనలు వినిపించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. కేసులోని మెరిట్ ఆధారంగా హైకోర్టు నిర్ణయం తీసుకోవాలని సుప్రీం సూచించింది. కాగా టీడీపీ ప్రభుత్వం అక్రమ కేసులపై సజ్జల భార్గవ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం నేడు విచారణ జరిపింది. సజ్జల భార్గవ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. వైఎస్ఆర్సీపీ సోషల్ మీడియా ఇన్చార్జి సజ్జల భార్గవపై టీడీపీ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని తెలిపారు. ఆర్గనైజ్డ్ క్రైమ్‌కు పాల్పడ్డారని బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 111 కింద కేసులు బనాయించి వేధిస్తోందని కోర్టుకు తెలిపారు. అయితే ఈ కేసుపై రెండు వారాల్లో ఏపీ హైకోర్టును ఆశ్రయించాలని సుప్రీం తెలిపింది. అప్పటి వరకు ఆయన్ను అరెస్టు చేయకుండా ఉండాలని పేర్కొంది.

## బియ్యాన్ని పందికొక్కుల్లా తిన్నారు.. వైసీపీపై షర్మిల ట్వీట్ !



**అమరావతి,:** బియ్యాన్ని పందికొక్కుల్లా తిన్నారు.. అంటూ వైసీపీపై షర్మిల సంచలన ట్వీట్ చేశారు. రాష్ట్రంలో PDS రైస్ విదేశాలకు తరలించడం పెద్ద మాఫియా అని ఫైర్ అయ్యారు. ఇదో జాతీయ స్థాయి కుంభకోణం. పేదల పొట్టకొట్టి 48 వేల కోట్ల రూపాయల ప్రజల డబ్బును పందికొక్కుల్లా తినేసిన దోపిడీ అని మండిపడ్డారు. తిలా పాపం తలా పిడికెడు అన్నట్లు.. రేషన్ బియ్యం స్మగ్లింగ్ వెనుక ప్రజా ప్రతినిధుల ప్రమేయం ఉందని వెల్లడించారు. కింద నుంచి ఉన్నత స్థాయి వరకు కొంతమంది అవినీతి అధికారుల పాత్ర ఉంది. ఎవరికి దక్కాల్సిన వాట వాళ్లకు చేరుతుండటంతో నిఘా వ్యవస్థ పూర్తిగా కళ్ళుమూసుకుందని ఆగ్రహించారు. గడిచిన మూడేళ్లలో రాష్ట్రంలోని పోర్టుల నుంచి 2 కోట్ల టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా రవాణా అయ్యిందంటే మన చెక్ పోస్టుల పని తీరు ఏంటో అంచనా వేయొచ్చు అంటూ వైసీపీ పార్టీని ఉద్దేశించి ట్వీట్ చేశారు. ఏ స్థాయిలో అవినీతి జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. అక్రమ బియ్యాన్ని పట్టేందుకు మీరు బోట్లు వేసుకొని సముద్రంలో హడావిడి చేయడం కాదు. నిజాలు నిగ్గు తేల్చండని డిమాండ్ చేశారు వైఎస్ షర్మిల.


## సామాజిక న్యాయం కోసం పోరాడిన వ్యక్తి చెన్నారెడ్డి

### టీపీసీసీ చీఫ్ మహేశ్‌కమార్ గౌడ్



**హైదరాబాద్, :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత నేత, మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి సామాజిక న్యాయం కోసం అహర్నిశలు పోరాడిన వ్యక్తి అని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. చెన్నారెడ్డి వర్ధంతి సందర్భంగా ఇందిరాపార్క్‌లోని చెన్నారెడ్డి మెమోరియల్ రాక్ గార్డెన్స్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి మహేశ్ గౌడ్ నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణ దేవ్ వర్మ, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సహా పలువురు నాయకులు పాల్గొన్నారు. టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ..ఉమ్మడి ఏపీలో మాజీ సీఎం దివంగత డాక్టర్ మర్రి చెన్నారెడ్డి దూరదృష్టి గల నాయకుడని కొనియాడారున ఆయన 28వ వర్ధంతి సందర్భంగా చెన్నా రెడ్డి చేసిన సేవలు గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సామాజిక న్యాయం, సమానమైన అభివృద్ధి కోసం పోరాడారని, ఆయన ఒక గొప్ప రాజనీతిజ్ఞుడు అని, ఆయన ప్రగతిశీల విధానాలు రాష్ట్రంపై చెరగని ముద్ర వేసాయన్నారు.మర్రి చెన్నారెడ్డి దార్శనికత తరతరాలకు ఉపయోగపడుతుందన్నారు.

# గ్యారెంటీలకు మహా గండి...



గ్యారెంటీల మాయాజాలంతో వరుసగా హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అధికారంలోకి కాంగ్రెస్ వచ్చిన విషయం తెలిసిందే. అయితే ప్రకటించిన గ్యారెంటీలు వికటించి హర్యానా, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైంది. కొందరిని ఎల్లకాలం మోసం చేయవచ్చు. అందరిని కొంతకాలం మోసం చేయవచ్చు. కానీ అందరినీ అన్ని కాలాలు మోసం చేయలేరని మరోసారి రుజువైంది. హిమాచల్‌ప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారెంటీల వైఫల్యం సరిహద్దు రాష్ట్రమైన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి దారితీయగా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో గ్యారెంటీల వైఫల్యం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభావం చూపింది. దేశ రాజకీయ, ఆర్థిక రంగాల్లో ప్రధాన భూమిక పోషించే రాష్ట్రం దక్కినట్టే దక్కి 'చేయి'జారిపోయింది. కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ ఆఘాడి ఘోర పరాజయానికి, బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ఘన విజయానికి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల వాగ్దాన వైఫల్యాలు ప్రధాన కారణమయ్యాయి. 2022, డిసెంబర్‌లో జరిగిన హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పది గ్యారెంటీలు ప్రకటించి అధికారంలోకి వచ్చింది. అదే క్రమంలో 2023 మే నెలలో కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు గ్యారెంటీలు ఇచ్చి, అదే ఏడాది నవంబర్‌లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 6 గ్యారెంటీలు ప్రకటించి కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని కైవసం చేసుకున్నది. ఏడాది తిరగక ముందే ఈ మూడు రాష్ట్రాల ప్రజలు దారుణంగా మోసపోయామనే అభిప్రాయానికి వచ్చారు. గ్యారెంటీల వైఫల్యం సరిహద్దు రాష్ట్రాలకు పాకింది. ఫలితంగా ఎన్నో ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్‌కు చేదనుభవం ఎదురైంది. ప్రత్యేకించి మహారాష్ట్ర చరిత్రలో కనీ వినీ ఎరుగని పరాజయాన్ని మూటగట్టుకున్నది. మహారాష్ట్రలో మహా వికాస్ ఆఘాడి ప్రకటించిన ఐదు గ్యారెంటీలను ప్రజలు నమ్మలేదు. పొరుగున ఉన్న కాంగ్రెస్ పాలిత తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాల గ్యారెంటీల వైఫల్యాల నేపథ్యంలో మహారాష్ట్ర ఓటర్లు మహా వికాస్ ఆఘాడిని తిరస్కరించారు. కాంగ్రెస్‌తో కలిసి నడిచిన పాపానికి అఘాడి భాగస్వామ్య పక్షాలు శివసేన (ఉద్ధవ్‌థాక్రే) ఎన్సీపీ (శరద్ పవార్) పార్టీలకూ భంగపాటు తప్పలేదు. గత లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలోని 48 స్థానాల్లో 30 స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ నాయకత్వంలోని మహా వికాస్ ఆఘాడి 4 నెలలకే చతికిల పడిపోయింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు పునరావృతమై అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఘన విజయం సాధిస్తామనుకున్న అఘాడి కూటమి అగాథంలోకి జారిపోయింది. మహిళలకు నెలకు రూ.3 వేలు, ఉచిత బస్సు, నిరుద్యోగులకు నెలకు వేలు, 50 శాతం రిజర్వేషన్ల పరిమితి తొలగింపు, రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా వంటి ప్రజాకర్షక గ్యారెంటీలు ప్రకటించినా తెలంగాణ, కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల మహారాష్ట్ర ప్రజలు వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. ప్రత్యేకించి తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులలో నివసించే మహారాష్ట్ర ప్రజలు మహా వికాస్ ఆఘాడిని ఊడ్చిపారేశారు. లోక్‌సభ ఎన్నికల్లో నెత్తిన పెట్టుకున్నవాళ్లే అసెంబ్లీ ఎన్నికలకు వచ్చేసరికి నెలకేసి కొట్టారు. కాంగ్రెస్ గ్యారెంటీల గప్పాలకు వ్యతిరేకంగా ప్రజలిచ్చిన తీర్పు అది. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో గ్యారెంటీల పేరుతో ప్రజలను దారుణంగా వంచించిన కాంగ్రెస్ పక్కనే ఉన్న మహారాష్ట్రలో అవే గ్యారెంటీల మాయోపాయాలతో అధికారంలోకి రావాలని నేలవిడిచి సాముచేసింది. ఎందుకంటే ఈ మూడు రాష్ట్రాల మధ్య వేయి కిలోమీటర్ల పైగా సరిహద్దులున్నాయి. కళ్యాణ కర్ణాటక, మరాఠ్వాడ, తెలంగాణ ప్రాంతాలు భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడేంతవరకు ఒక రాష్ట్రంగా ఉన్నవే. ఈ ప్రాంతాల మధ్య బంధుత్వాలు వ్యాపార లావాదేవీలు నిరంతరంగా కొనసాగుతూనే ఉన్నాయి. సాంస్కృతిక ఆచార వ్యవహారాల ఆదాన ప్రదానాలున్నాయి. పైగా, తెలంగాణ, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల ప్రజలకు మరాఠీ తెలిసినట్టే అవతలి గట్టున ఉన్న మహారాష్ట్ర ప్రజలకు తెలుగు, కన్నడ భాషలు తెలుసు. ఈ నేపథ్యంలో తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాల గ్యారెంటీ గ్యాంబ్లింగ్‌ను సరిహద్దు మహారాష్ట్ర ప్రజలు గ్రహించడానికి ఎక్కువ సమయం పట్ట లేదు. అందుకే కీలెరిగి వాత పెట్టారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి, చంద్రపూర్, యావత్‌మాల్, నాందేడ్ జిల్లాలు తెలంగాణ సరిహద్దుల్లో, సాంగ్లీ, సోలాపూర్, కొల్హాపూర్, జిల్లాలు కర్ణాటక సరిహద్దుల్లో ఉన్నాయి. గడ్చిరోలి, చంద్రపూర్, హింగోలి, నాందేడ్, ఉస్మానాబాద్, లాతూర్, సోలాపూర్, సాంగ్లీ, హట్కానంగి, కొల్హాపూర్, రత్నగిరి లోక్‌సభ నియోజకవర్గాలు అదే పరిధిలో ఉన్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో ఉస్మానాబాద్ రత్నగిరి మహాయుతి గెలుచుకోగా ఎనిమిది లోక్‌సభ స్థానాల్లో మహా వికాస్ ఆఘాడి విజయం సాధించింది. హట్కానంగే లోక్‌సభ స్థానంలో విజయం సాధించిన ఇండిపెండెంట్ అభ్యర్థి ఆఘాడి సరసన చేరడంతో మొత్తంగా 11 స్థానాల్లో 9 ఆ కూటమి ఖాతాలో చేరాయి. కానీ, 4 నెలలకే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరిస్థితి తారుమారైంది. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు ఆనుకొని ఉన్న 26 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని మహావికాస్ ఆఘాడి గెల్చుకున్న నియోజకవర్గాలు మూడు మాత్రమే. తెలంగాణ పొరుగున ఉన్న గడ్చిరోలి, అహెరి, రాజూరా, ఆర్నీ, కిన్వట్, హడ్గావ్, బోకర్, నాయీ గావ్, దేగ్లూర్ మహాయుతి గెలుచుకోగా మహా వికాస్ అఘాడి కేవలం ఒక్క 'వానీ' నియోజకవర్గానికి పరిమితమైంది. కర్ణాటక సరిహద్దుల్లోని ముదే?డ్ ఉద్గిర్, నీలంగా, అవుసా, అక్కల్‌కోట్, సోలాపూర్, పండర్‌పూర్, జాట్‌మిరాజ్, కొల్హాపూర్, కాగల్, చంద్‌గడ్, సావంత్‌వాడి, అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహాయుతి విజయం సాధించగా ఉమర్గా, తస్‌గావ్ నియోజకవర్గాల్లో మాత్రమే మహా వికాస్ ఆఘాడి విజయం సాధించింది. మొత్తంగా తెలంగాణ సరిహద్దుల్లోని నాలుగు జిల్లాలు, కర్ణాటక సరిహద్దుల్లోని మూడు జిల్లాల్లో కలిపి 54 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ ఆఘాడి గెలిచింది 15 మాత్రమే. ఈ లెక్కన కాంగ్రెస్ గ్యారెంటీ మోసాలు మహారాష్ట్ర ఫలితాలను తారుమారు చేశాయన్నది తేటతెల్లమైంది. కాంగ్రెస్‌ను నమ్మి దరిచేరిన దిగ్గజ నేతలు శరద్‌పవార్, ఉద్ధవ్ థాక్రేలకు సహవాస దోషం ఫలితంగా పరాభవం ఎదురైంది. ఎవరికీ కనీసం ప్రతిపక్ష హోదా దక్కని దుస్థితి ఏర్పడింది. 'బేగాని షాదీ మే అబ్దుల్లా దీవానా' అన్నట్టు సొంత రాష్ట్రాలలో గ్యారెంటీలను గంగలో కలిపిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, వారి మంత్రి బృందాలు, నాయకశ్రేణులు మహారాష్ట్రలో ప్రచారం చేయడం, తమ రాష్ట్రాల్లో గ్యారెంటీలను పూర్తిగా అమలుపరచామని పచ్చి అబద్ధాలాడటం సరిహద్దు నియోజకవర్గాల్లో మహా వికాస్ ఆఘాడి విజయావకాశాలను తీవ్రంగా దెబ్బతీశాయి. అవి మోసపూరిత ప్రసంగాలని అక్కడి ప్రజలు గ్రహించారు. తెలంగాణ మూలాలున్న ప్రజలు నిర్ణాయక శక్తులుగా ఉన్న 8 నియోజకవర్గాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రచారం చేసినా తుదకు దక్కినవి రెండే రెండు. సిద్ధరామయ్య పరిస్థితి అంతే. ఏదేమైనా మొన్న హర్యానా, నిన్న మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ పరివారం గెలుపు తలుపు ముందు బొక్క బోర్లా పడటానికి గల కారణాల్లో అంతకుముందు కొలువుదీరిన మూడు కాంగ్రెస్ ప్రభుత్వాల గ్యారెంటీల వైఫల్యాలు ముందు నిలిచాయి.

# 'మహా' విజయం ఎలా సాధ్యమైంది?




ఈ నెల 15న ప్రచురితమైన నా కాలమ్ శీర్షిక 'వెలలేని మాగాణి మహారాష్ట్ర'. బీజేపీ, శివసేన, ఎన్సీపీలతో కూడిన మహాయుతి కూటమి నవంబర్ 20 ఎన్నికలలో ఆ 'మాగాణి'ని గెలుచుకున్నది. ఆ విజయం తిరుగులేనిది అనడానికి నేనేమీ సంకోచించను. మహారాష్ట్ర శాసనసభలోని 238 సీట్లకు గాను 230 స్థానాలను మహాయుతి స్వాయత్తం చేసుకున్నది. మహాయుతి మహా విజయానికి ప్రధాన కారణమేమిటి? ఈ విషయమైపెద్ద చర్చ ప్రారంభమయింది. లడ్కీ బెహన యోజన (ఎల్‌బివై) కారణమని అత్యధికులు అంగీకరిస్తున్నారు. ప్రతి గృహిణికి (కుటుంబ వార్షిక ఆదాయం రెండున్నర లక్షల రూపాయల కంటే తక్కువగా ఉన్న పక్షంలో) నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని మహాయుతి వాగ్దానం చేసింది. ముఖ్యమంత్రి శిందే ప్రభుత్వం గత జూలై 1 నుంచి ఆ పథకాన్ని అమలుపరుస్తోంది. 2.5 కోట్ల మంది గృహిణులు ఎల్‌బివై లబ్ధిదారులుగా ఉన్నారు. తమను మళ్లీ ఎన్నుకున్న పక్షంలో ఆ ఆర్థిక సహాయాన్ని రూ.2100కు పెంచుతామని కూడా మహాయుతి హామీ ఇచ్చింది. లడ్కీ బెహన యోజన సంపూర్ణంగా విజయవంతమయింది. వ్యవసాయరంగంలో దురవస్థలు, పెచ్చరిల్లి పోతున్న నిరుద్యోగిత, గ్రామీణ మహిళలకు కొరవడిన ఉపాధి అవకాశాలు, గ్రామీణ వేతనాలు గొర్రె తోకలా ఉండిపోవడం, ద్రవ్యోల్బణం మొదలైన సమస్యలు ఆ ఆర్థిక సహాయ పథకం ప్రజలను విశేషంగా ఆకట్టుకునేలా చేశాయి. అయితే అదేమీ వినూత్న పథకమేమీ కాదు. అదొక అనుకరణ పథకం. మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో ఇప్పటికే అమలవుతున్న పథకాలను అనుసరించి ఎల్‌బివైను రూపొందించారు. సరే, మహాయుతి ప్రధాన ప్రత్యర్థి ఎమ్‌వీఏ సైతం తాము అధికారంలోకి వస్తే ప్రతి పేద మహిళకు నెలకు రూ.3000 చొప్పున ఆర్థిక సహాయ మందిస్తామని హామీ ఇచ్చింది. పాలక, ప్రతిపక్ష కూటముల వాదనలను తుల్యంగా చూస్తే లడ్కీ బెహన యోజన ఎన్నికలలో మహాయుతి విజయానికి దోహదం చేసిన నిర్ణయాత్మకమైన కారణమని నేను భావించడం లేదు. ఒక ప్రచ్ఛన్న సందేశం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ప్రభావితం చేసిందని నేను భావిస్తున్నాను. బీజేపీ నాయకత్రయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లు ఆ సందేశాన్ని మహారాష్ట్ర ఓటర్లకు చేరవేశారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శ్రేణులు ఆ సందేశాన్ని మరింత విపులంగా ప్రజల మనసుల్లో నాటాయి. బీజేపీ నాయకత్రయం రెండు నినాదాలనిచ్చారు. ఒకటి-'ఏక్ హై తో సేఫ్ హై' (మనం ఒకటిగా ఉంటేనే సురక్షితంగా ఉంటాం)బీ రెండోది 'బాతేంగే తో కటేంగే' (విభజనలతో వినాశనమవుతాం). ఈ నినాదాలు తటస్థ స్వభావంతో ఉన్నట్టు అనిపిస్తుంది కదూ. అయితే అదొక వంచనాత్మక తటస్థత. నిజానికి ఒక నిర్దిష్ట సామాజిక సమూహాన్ని ఉద్దేశించే ఆ నినాదాలనిచ్చారు. 'లవ్ జిహాద్', 'ఓట్ జిహాద్'పై భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రసంగాలు అడ్డు ఆపూ లేకుండా జరిగాయి. పాత నినాదాలు అయిన 'తుక్డే తుక్డే గ్యాంగ్', 'అర్బన్ నక్సల్స్'ను పునరుద్ధరించి విరివిగా ఉపయోగించుకున్నారు. ఈ సందేశాలను చాల చాకచక్యంగా వెలువరించారు. లక్ష్యంగా పెట్టుకున్న సామాజిక వర్గాలకు చేరేలా చేయడంలో సఫలమయ్యారు. ఇది గమనించిన తరువాత గత లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ నాయకుల ప్రచారం గుర్తుకువచ్చింది. 'మీకు రెండు గేదెలు ఉంటే ఒకదాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకెళుతుంది. మీ మంగళసూత్రాలను సైతం తీసుకువెళతారు. అలా తీసుకు వెళ్లిన వాటినన్నిటినీ అధిక సంతానం ఉన్న వారికి ఇచ్చి వేస్తారు' అని మోదీ ప్రభృతులు ప్రచారం చేయలేదూ?! బీజేపీ నాయకులు ఏ సామాజిక సమూహానికి ఆ సందేశాలను ఉద్దేశించారన్నది స్పష్టమే. ఆ లక్ష్యిత సామాజిక సమూహానికి ఏ సామాజిక సమూహం నుంచి ప్రమాదం వాటిల్లనున్నదని నర్మగర్భితంగా చెప్పారన్నది కూడా తేటతెల్లంగా తెలుస్తూనే ఉన్నది. కాలమిస్ట్ ఆర్. జగన్నాథన్ (బీజేపీ సానుభూతిపరుడు) ఆ ప్రభావశీల నినాదాలను హిందూ ఓటర్లను సంఘటితం చేసేందుకు ఇచ్చారని అంగీకరించారు. ఈ ఏడాది విజయదశమి రోజున ఆరెస్సెస్ సర్ సంఘ్ ప్రచారక్ మోహన్ భాగవత్ వెలువరించిన ప్రసంగ సారాంశాన్ని ఆ కొత్త నినాదాలు ప్రతిధ్వనిస్తున్నాయి. మోహన్ భాగవత్ ఆ ప్రసంగంలో ఇలా అన్నారు: 'అసంఘటితంగా, బలహీనంగా ఉండిపోతే దుర్మార్గుల దురాగతాలను కొని తెచ్చుకోవడమే అవుతుందన్న సత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులు అందరూ తెలుసుకోవాలి'. ఈ నినాదాలు, ప్రసంగాలు అన్నీ విద్వేషపూరిత ప్రచారంలోను, 'విభజించి గెలవడం' అనే ఎన్నికల వ్యూహంలో భాగమే. ప్రతి దేశంలోను మైనారిటీ వర్గాలు ఉంటాయి. అవి మతపరమైనవి లేదా భాషా పరమైనవి లేదా జాతి పరమైనవి కావచ్చు. అమెరికాకు నల్ల జాతి ప్రజలు, లాటినోలుబీ చైనాకు ఉయిఘుర్ ముస్లింలుబీ పాకిస్థాన్‌కు షియాలుబీ బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లకు హిందువులుబీ శ్రీలంకకు తమిళులు, ముస్లింలుబీ ఆస్ట్రేలియాకు మూలవాసులుబీ ఇజ్రాయెల్‌కు అరబ్‌లు, యూరోపియన్ దేశాలకు యూదులు, రోమాలు మైనారిటీ వర్గాలు. తమ మైనారిటీ వర్గాల భద్రతకు కౌన్సిల్ ఆఫ్ యూరోప్ 1998లో 'ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ నేషనల్ మైనారిటీస్'ను ఆమోదించింది తమ తమ సమాజాలలోని అన్ని వర్గాల మధ్య సమానత్వాన్ని పెంపొందించేందుకు, జాతీయ మైనారిటీల సంస్కృతి, అస్తిత్వాన్ని పరిరక్షించేందుకు ఈ ఒడంబడికను ఉద్దేశించారు. రాజనీతిజ్ఞుడు, సామాజిక తాత్వికుడు అయిన డాక్టర్ అంబేడ్కర్ ఎంతో దూరదృష్టితో మైనారిటీల హక్కులను భారత రాజ్యాంగంలో పౌరుల ప్రాథమిక హక్కులుగా పొందుపరిచారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో హిందువుల హక్కుల పరిరక్షణ విషయమై భారత ప్రభుత్వమూ, భారతీయులూ తరచు భావోద్వేగాలకు లోనవుతుంటారు. పొరుగు దేశాలలోని హిందువుల హక్కుల గురించి ప్రభుత్వ నాయకులు గట్టిగా మాట్లాడుతుంటారు. విదేశీ విశ్వవిద్యాలయాలలో భారత సంతతికి చెందిన విద్యార్థులకు ఎదురవుతున్న వేధింపుల గురించి కూడా మనం ఆందోళన చెందుతుంటాం. విదేశాలలోని హిందూ ఆలయాలు, సిక్కు గురుద్వారాలపై దాడులు జరిగినప్పుడు మనం బిగ్గరగా మండిపడుతుంటాం. అయితే విదేశాలు, మానవ హక్కుల సంఘాలు మన దేశంలోని మైనారిటీ వర్గాలకు ఎదురవుతున్న వేధింపుల గురించి ప్రస్తావించినప్పుడు, ప్రశ్నించినప్పుడు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రంగంలోకి 'మా అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవద్దని' హెచ్చరిస్తుంది. ఇదొక నయవంచన ధోరణి, సందేహం లేదు. బంగ్లాదేశ్‌లో ఒక హిందూ సాధువును అరెస్ట్ చేశారుబీ ఇస్కాన్‌ను నిషేధించాలన్న డిమాండ్ పెరుగుతోంది. బంగ్లాదేశ్‌లో పరిణామాలకు ప్రతిస్పందనగా మన దేశంలోని ఒక మతం అధిపతి 'ముస్లింలకు ఓటింగ్ హక్కులు నిరాకరించాలని' అన్నట్టు వార్తలు వచ్చాయి. ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ రెండు సంకుచిత వైఖరులు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కావు. 'విభజించి గెలిచే' రాజకీయ క్రీడను ఎన్డీఏ కొనసాగిస్తున్న పక్షంలో మైనారిటీల సమస్య భారత్‌ను వెంటాడుతూనే ఉంటుంది. ఆ ఎన్నికల ఎత్తుగడ బ్రిటిష్ వలస పాలకుల కుటిల 'విభజించి పాలించు' వ్యూహానికి భిన్నమైనది కాదు.

# ఆదివాసీల హక్కులపై ముప్పేట దాడి




న్యూఢిల్లీ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వినాశకర విధానాలతో ఆదివాసీల హక్కులపై ముప్పేట దాడి జరుగుతోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ, రిజర్వేషన్ల కుదింపు, మినహాయింపు చర్యల వల్ల ఆదివాసీలు, ఇతర అణగారిన తరగతులకు చెందిన ప్రజలు ఉద్యోగాలకు, ఉపాధి అవకాశాలకు దూరమవుతున్నారని చెప్పారు. ఆదివారం స్థానిక హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఎఎఆర్ఎం), సెంటర్ ఫర్ ఆదివాసీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె ప్రసంగించారు. ఆదివాసులను ఉద్యోగాల నుండి దూరం చేస్తున్నారన్న అంశంపై ఎఎఆర్ఎం ఛైర్మన్ జితేంద్ర చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి వందలాది మంది గిరిజన సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బృందాకరత్ మాట్లాడుతూ మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తొలినాటి నుంచి ఆదివాసీ హక్కులు, ఉద్యోగాలపై దాడికి పూనుకుందని విమర్శించారు. అలాగే ఆదివాసుల భూములను అక్రమంగా గుంజుకొని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తోందన్నారు. దీంతో అటవీ సంపదపైనా కార్పొరేట్ కంపెనీలు పెత్తనం సాగిస్తున్నాయని చెప్పారు. వీటిపై ఎఎఆర్ఎం పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. కేంద్రంలోని బిజెపి విధానాల వల్ల ఆదివాసీ యువతీ, యువకులు ప్రభుత్వ ఉద్యోగాలకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగాల ప్రయివేటీకరణ, వివిధ మినహాయింపులతో ప్రభుత్వ ఉద్యోగాల నుంచి ఆదివాసీలను దూరం చేస్తున్న తీరుపై సదస్సులో డేటాను ప్రదర్శించారు. ఈ డేటాను ప్రస్తావిస్తూ రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల హక్కును కూడా మోడీ సర్కార్ నీరుగారుస్తోందని తెలిపారు. మంచ్ చైర్‌పర్సన్ జితేంద్ర చౌదరి, మంచ్ జాతీయ కన్వీనర్ పులిన్ బాస్కే మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం మరింత ఉధృతంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. భూమి నుండి, అడవి నుండి, సంపద నుండి, ఇప్పుడు ఉద్యోగాల నుండి కూడా ఆదివాసీలను తరిమివేసే కుట్రలు సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ జనాభా (2011 జనాభా లెక్కల ప్రకారం)లో 8.6 శాతం ఆదివాసులు ఉంటే, 7.5 శాతమే రిజర్వేషన్లు ఇస్తున్నారని అన్నారు. ఎందుకు అలా? 8.6 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ వికాస్ రావల్ సమర్పించిన ముసాయిదా నివేదికలో ఎస్‌టి జనాభాను తక్కువగా అంచనా వేశారని, అందువల్ల సి, డి కేటగిరిల్లో ఎక్కువ ఉద్యోగాలు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టీకరణ చేశారని తెలిపారు. అందులో కూడా ఎస్‌టిలకు తప్పని సరిగా రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2014 మోడీ అధికారంలోకి వచ్చేనాటికి మొత్తం కేంద్ర ప్రభుత్వ పోస్టుల సంఖ్య 32 లక్షలకు పైగా ఉన్నాయని, 2023లో దాదాపు 30 లక్షలకు తగ్గాయని తెలిపారు. 2014లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులలో దాదాపు 4.2 లక్షల ఖాళీలు ఉన్నాయని, అయితే ఇప్పుడు ఖాళీల సంఖ్య 5 లక్షలు పెరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌నుంచి వి.తిరుపతిరావు, కె.సత్యన్నారాయణ, డి. ప్రభాకర్, బి. తౌడన్న, టి.చిట్టిబాబు, తెలంగాణ నుంచి ధర్మానాయక్, సచిన్, శోభన్ నాయక్, భీంరావు తదితరులు పాల్గొన్నారు. ప్రజా సంఘాల నేతలు కరుమలయన్ (సిఐటియు), బి.వెంకట్ (ఎఐడబ్ల్యుయు), అర్చన ప్రసాద్ (ఐద్వా), నత్తు ప్రసాద్ (డిఎస్ఎంఎం), మురళీధరన్ (ఎన్‌పిఆర్‌డి) తదితరులు పాల్గొన్నారు.

### డిమాండ్లు ఇవే..

1.ఆదివాసీలకు జనాభా ప్రాతిపదికగా రిజర్వేషన్లు అమల్జేయాలి 2.కాంట్రాక్ట్, డైలీ వేజ్, క్యాజ్‌వల్, అవుట్ సోర్సింగ్ పోస్టుల్లోనూ రిజర్వేషన్ల అమల్జేయాలి. 3. ప్రైవేట్ రంగ సంస్థల్లోనూ రిజర్వేషన్ వర్తింపజేయాలి.4 . ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, టీచింగ్, ఇతర అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. 5. పోస్టుల భర్తీలోనూ, ఉద్యోగోన్నతుల్లోనూ రిజర్వేషన్ అమలుపై సమగ్రమైన డేటాను రెగ్యులర్‌గా విడుదల చేయాలి. 6. గ్రేడ్‌లు వారీగా మంజూరైన పోస్టులు, ఖాళీలతో కూడిన రిజర్వేషన్ల పరిస్థితిపై పూర్తిస్థాయి డేటాను ఇవ్వాలి. 7.ఎస్‌టి కాంట్రాక్ట్ ఉద్యోగుల (గ్రేడ్‌ల వారీగా) డేటా ఇవ్వాలి. 8. ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ చర్యలను విడనాడాలి.

## పార్లమెంట్‌లో చర్చ జరగడం ప్రభుత్వానికి ఇష్టం లేదు





న్యూఢిల్లీ : పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమై ఐదు రోజులవుతున్నా.. ఎలాంటి చర్చ లేకుండా ఉభయసభలు నిత్యం వాయిదా పడుతుండటంపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అసంతృప్తి వ్యక్తంచేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఎలాంటి చర్చలు జరపకుండానే ఉభయ సభలు వాయిదా పడుతుండటానికి బాధ్యులు ఎవరు? ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. అదానీ వ్యవహారం, మణిపూర్, సంభాల్, నిరుద్యోగం మొదలైన అంశాలపై పార్లమెంటులో చర్చలు జరగాలని ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయి. కానీ ప్రభుత్వానికి మాత్రం వీటిపై చర్చ జరగడం ఇష్టం లేదు' అని ఆయన విమర్శించారు. ఉభయ సభలకు తాము ఇచ్చిన నోటీసుల గురించి ప్రభుత్వం కనీస ప్రస్తావన కూడా చేయడంలేదని, తమ నాయకులకు కనీసం మాట్లాడే అవకాశం కూడా ఇవ్వడం లేదని జైరామ్ రమేష్ అన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రెండు రోజులపాటు రాజ్యాంగంపై ప్రత్యేకంగా చర్చ చేపట్టాలని తాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశామని, అందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపినా.. దీనిపై చర్చ ఎప్పుడు పెడతారనే విషయం మాత్రం ఇంకా వెల్లడించలేదని జైరామ్ రమేష్ అన్నారు. తన 20 ఏళ్ల రాజకీయ జీవితంలో పార్లమెంట్‌లో చర్చ జరగకూడదని ప్రభుత్వం కోరుకోవడాన్ని తొలిసారి చూస్తున్నానని ఆయన చెప్పారు.

## ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ వ్యాఖ్యలపై మండిపడిన అసదుద్దీన్ ఓవైసి



ముంబయి : దేశంలో సంతానోత్పత్తి రేటు తక్కువగా ఉంది. సమాజ మనుగడ కోసం జనాభాను పెంచాలని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆదివారం వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై ఎఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ మండిపడ్డారు. ఈ ఇరు నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా ఆదివారం మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగిన కథలే కుల్ సమ్మేళన్‌లో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మాట్లాడుతూ.. 'దేశంలో జనాభా తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం 2.1 కంటే తక్కువగా సంతానోత్పత్తి రేటు ఉంది. జనాభా తగ్గితే ఎలాంటి సంక్షోభం లేకుండానే సమాజం నాశనం అవుతుంది. ప్రత్యేకించి ఇప్పటికే చాలా బాషలు కానీ, సమాజాలు కానీ కనుమరుగయ్యాయి. 1998- 2002 దేశ జనాభా విధానం 2.1 కంటే తక్కువ సంతానోత్పరేటు ఉండకూడదని స్పష్టం చేసింది. ఇద్దరు లేదా ముగ్గరు పిల్లల్ని కనడం అవసరం. ఈ సంఖ్య జనాభా శాస్త్రంలో ముఖ్యమైదని' అని ఆయన అన్నారు. కాగా, మోగన్ భగవత్ వ్యాఖ్యలపై ఎఐఎంఐఎం అధినేత అసదుదీద్దన్ ఒవైసి ఆరోపించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'నేను మోహన్ భగవత్‌ని కొన్ని ప్రశ్నలు అడగాలనుకుంటున్నాను. ఎక్కువమంది పిల్లల్ని కంటే మీరు ప్రజలకు ఏమి ఇస్తారు? ఎక్కువ మంది పిల్లలకు జన్మనిచ్చిన వారి బ్యాంకు ఖాతాలలో రూ. 1500లు వేస్తారా? దీని కోసం ఒక పథకాన్ని ప్రవేశపెడతారా? అది ఎప్పుడు? భగవత్ తనకు సన్నిహితమైన వ్యక్తిని సిఎం చేయాలని ప్రయత్నిస్తున్నారు. దాని కోసం ఆయన ప్రత్యేకంగా ఒక పథకాన్ని కూడా ప్రవేశపెట్టవచ్చు' అని ఆయన అన్నారు.

## డిసెంబరు 21.. రాత్రి 16 గంటలు.. పగలు 8 గంటలు



శీతాకాలం.. పగటి కాలం తక్కువ..రాత్రి పొద్దు ఎక్కువ అంటారు. అయితే డిసెంబర్ 21 రాత్రిపూట మనం ఒక వింతను చూడబోతున్నాం. ఆరోజు సుదీర్ఘమైన రాత్రి కాలం రానుంది. ఆరోజు ఏకంగా 16 గంటపాటు రాత్రి సమయం ఉండనుంది. అయితే పగటి వేళ 8 గంటలు మాత్రమే ఉంటుంది. ఇలా జరగడాన్ని శీతాకాలపు అయనాంతం(వింటర్ సోల్‌స్టైస్) అంటారు. శీతాకాలపు అయనాంతం ఏర్పడే రోజున సూర్యుని నుండి భూమికి దూరం ఎక్కువగా ఉంటుంది. అలాగే చంద్రకాంతి భూమిపై ఎక్కువ కాలం ఉంటుంది. శీతాకాలపు అయనాంతం ఏర్పడిన రోజున భూమి దాని ధ్రువం వద్ద 23.4 డిగ్రీల వంపులో ఉంటుంది. ఈ సహజ మార్పు కారణంగా 2025, డిసెంబరు 21న ఈ ఏడాదిలో అత్యంత తక్కువ పగలు, సుదీర్ఘమైన రాత్రి ఏర్పడుతుంది. భూమి దాని అక్షం మీద తిరిగే సమయంలో దక్షిణ అర్ధగోళంలో భూమి నుండి సూర్యుడి దూరం గరిష్టంగా ఉన్న రోజున అయనాంతం వస్తుంది. ఇది శీతాకాలంలో ఏర్పడుతున్నందున దీనిని శీతాకాలపు అయనాంతం అని అంటారు. శీతాకాలపు అయనాంతం ఏర్పడే తేదీ ప్రతీయేటా మారుతుంటుంది. అయితే అది డిసెంబర్ 20- 23 తేదీల మధ్యనే వస్తుంటుంది. డిసెంబర్ 21న భూమికి సూర్యునికి గరిష్ట దూరం ఉండటం వల్ల సూర్యకిరణాలు ఆలస్యంగా భూమిని చేరుతాయి. ఈ కారణంగా ఉష్ణోగ్రతలో స్వల్ప తగ్గుదల కూడా కనిపిస్తుంది. వివిధ దేశాల్లో శీతాకాలపు అయనాంతం(వింటర్ సోల్‌స్టైస్) రోజున ఉత్సవాలు జరుపుకుంటారు. చైనాతో పాటు ఇతర తూర్పు ఆసియా దేశాలలో, బౌద్ధమతంలోని యిన్, యాంగ్ శాఖకు చెందిన ప్రజలు శీతాకాలపు అయనాంతం ఐక్యత, శ్రేయస్సును అందించే రోజుగా భావిస్తారు. శీతాకాలపు అయనాంతంపై వివిధ దేశాల్లో వేర్వేరు నమ్మకాలున్నాయి. శీతాకాలపు అయనాంతం వచ్చినప్పుడు ఉత్తర భారతదేశంలో శ్రీ కృష్ణునికి నైవేద్యం సమర్పించి, గీతా పారాయణం చేస్తారు. రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలలో పుష్యమాస పండుగ ను జరుపుకుంటారు. సూర్యుని ఉత్తరాయణం ప్రక్రియ శీతాకాలపు అయనాంతం నుండి మొదలవుతుంది. అందుకే భారతదేశంలో దీనికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది.

## ఫుట్‌బాల్ మ్యాచ్‌లో అభిమానుల ఘర్షణ.. 100 మంది మృతి




సౌత్ ఆఫ్రికాలోని గినియా దేశంలో పెను విషాదం చోటుచేసుకుంది. గినియాలోని రెండవ అతిపెద్ద నగరమైన ఎన్‌జెరెకోర్‌లో ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా అభిమానుల మధ్య భారీ ఘర్షణ జరిగింది. రెండు వర్గాలు పరస్పరం దాడి చేసుకోవడంతో దాదాపు 100 మందికి పైగా మరణించారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కాగా గినియా మిలిటరీ జుంటా నేత మమాడి దౌంబోయ గౌరవార్థం జెరెకొరె నగరంలో ఆదివారం ఫుట్‌బాల్? టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఫుట్‌బాల్ మ్యాచ్ మధ్యలో రిఫరీ తీసుకున్న ఓ నిర్ణయం వివాదాస్పదమైంది. దాన్ని వ్యతిరేకించిన ఓ జట్టు అభిమానులు మైదానంలోకి దూసుకెళ్లారు. దీంతో అవతలి జట్టు అభిమానులు వీరిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. అనంతరం వందలాది మంది వీధుల్లోకి వచ్చి పరస్పరం దాడులు చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను కూడా ధ్వంసం చేసి, నిప్పంటించారు. ఈ క్రమంలో వంద మందికిపైగా మరణించగా.. చాలా మంది తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వీధులంతా రక్తసిక్తంగా మారాయి. ఎక్కడ చూసినా మృతదేహాలు చెల్లాచెదురుగా పడిఉన్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# విశ్వఐక్యతకు నాంది 'లోక్‌మంథన్'




భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎన్నో శతాబ్దాలుగా అనేక మార్పులు చవిచూశాయి. వనవాసం, గ్రామీణ సమాజం, పట్టణ జీవితం, నగర నాగరికత అనేవి ఒకదానితో ఒకటి విడదీయరాని భాగాలుగా మన సంస్కృతికి బలమైన పునాదులుగా నిలిచాయి. అయితే కాలక్రమేణా వివిధ ప్రభావాల కారణంగా వనవాసుల కంటే గ్రామవాసులు, వీరికంటే పట్టణ ప్రజలు, వీరందరినీ మించి నగరవాసులు గొప్పవారన్న భావన పెరిగిపోయింది. వాణిజ్య దృష్టికోణంలో స్థూలంగా చూసినప్పుడు వీరందరూ ఒకరిని మించినవారు మరొకరు అన్నట్టుగా భేదదృష్టిని కల్పించి, విభజించి, విద్వేషాలు రగిలించిన పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది. అయితే, వీరంతా ఒకరితో ఒకరు పెనవేసుకుని జీవించాలనీ, జీవిస్తున్నారనే విషయం సూక్ష్మంగా చూస్తే తప్ప అర్థం కాదు. ఇది భారతదేశంతో పాటుగా యావత్ ప్రపంచానికి అన్వయించే విషయం. నేటి సమాజంలో ఈ విషయం ఎందరికి తెలుసన్నదే అసలు ప్రశ్న. వన జీవనం, గ్రామ సమాజం, పట్టణ జీవితం, నగర నాగరికత అనేవి కచ్చితంగా వేర్వేరు వ్యవస్థలనీ, ఒక దానిని మించినది మరొకటి అనేది వీరి దృష్టి కోణం. ఇలాంటి భావనలు తొలగించి-మన సంస్కృతీ సంప్రదాయాలను తిరిగి పునరుద్ధరించేందుకు, సమాజంలో ఏకీకృత భావనను తీసుకొచ్చేందుకు, విశ్వ ఐక్యత ప్రాశస్త్యాన్ని ప్రతిపాదించేందుకు భాగ్యనగర్ వేదికగా ఈ రోజు నుంచీ 'లోక్‌మంథన్ - 2024' పేరుతో ఒక అద్భుత అంతర్జాతీయ సదస్సు జరగనుంది. ఈ మహోత్సవం నవంబరు 24 వరకు భాగ్యనగరం లోని శిల్పకళావేదికలో నాలుగు రోజుల పాటు జరగనుంది. భారతదేశంలో నగరీకరణ జరిగినప్పటికీ, మనది గ్రామీణ కేంద్రిత సంస్కృతి. ఈ వ్యవస్థలో ఉన్నత విద్యాభ్యాసం, బోధన, అధ్యయనం అధికంగా అటవీ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ఋషుల ఆశ్రమాల్లోనే జరిగేవి. నగరాల్లో గొప్ప నాగరికతను ఆస్వాదిస్తున్న అత్యున్నత వర్గాలవారు, వారి సంతానం, చివరికి మహారాజులు, వారి వారసులు సైతం జ్ఞానాన్ని పొందేందుకు, యుద్ధవిద్యలు నేర్చుకునేందుకు, ఆర్థిక సామాజిక జ్ఞాన సముపార్జనకు ఈ ఆశ్రమాలకే వెళ్లేవారు. భారతీయ పురాణాలను, చరిత్రను పరిశీలిస్తే శ్రీరాముడు, శ్రీకృష్ణుడు సహా గొప్ప గొప్ప చక్రవర్తులు సైతం వనాలు, గ్రామాల్లోని గురుకులాలలో వేదాధ్యయనం, ఇతర విద్యలు నేర్చుకున్నవారే. ఈ మహారాజులు తమ రాజ్యపాలన అనంతరం సమస్తం త్యజించి వారసులకు రాజ్యం అప్పగించి జీవిత చరమాంకాన్ని వానప్రస్థంగా ఆ ఋషుల ఆశ్రమాల్లోనే గడిపేవారు. ఈ విధంగా వనాల నుంచి నగరవాసం, ఇక్కడి నుంచి తిరిగి వనవాసం వరకూ జీవన ప్రస్థానం పెనవేసుకుని నడిచిన పరిస్థితులు మన చరిత్రలో కీలకమైన ఘట్టాలుగా నిలిచిపోయాయి. ఆనాటి ఆచార సంప్రదాయాల విలువలను పునఃప్రతిష్టించి లోక ఐక్యతను చాటేందుకు 'లోక్‌మంథన్ %-% భాగ్యనగర్' ఒక మేలి మలుపుగా నిలుస్తుందని విశ్వసిస్తున్నాను. ఒక విశిష్టమైన ప్రజాస్వామ్య కేంద్రిత విజ్ఞానవ్యవస్థ భారతదేశమంతటా ఒకప్పుడు ఆచరణలో ఉండేది. అయితే ఇస్లామిక్ దండయాత్రలు, ఆ తర్వాతి కాలంలో క్రైస్తవ దురాక్రమణల వల్ల గ్రామీణ ప్రజల కంటే పట్టణవాసులను, వీరిని మించి నగరవాసులను గొప్పవారిగా భావించే ఒక వివక్ష క్రమంగా పెరిగిపోయింది. పట్టణాలు-నగరేతర ప్రాంతాలలో నివసించే వారిని చులకనగా చూడడం. పల్లె విజ్ఞానాన్ని నిర్లక్ష్యం చేసి, పట్టణ-నగర ప్రాంతాల్లోని జ్ఞానం కంటే తక్కువ అనే భావనతో వ్యవహరించడం ప్రారంభమైంది. పాశ్చాత్య దేశాలలో ఉన్న శాస్త్రీయం, జానపదం అనే వర్గీకరణను భారతీయ సమాజంపై బలవంతంగా రుద్ది, గ్రామీణ ప్రాంతాల ప్రజలను మరీ ముఖ్యంగా వనవాసులను ఏమీ తెలియని జానపదులుగా భావించటం మొదలైంది. శాస్త్రీయం కానివన్నీ అనాగరికమైనవనీ, తక్కువ స్థాయికి చెందినవనే భిన్నమైన నిర్వచనాన్ని మన సమాజంలో చొప్పించారు. ఫలితంగా సామాజిక సామరస్యత, ఆరోగ్యం, సాంకేతికత, ఆహారపు అభిరుచులు, ప్రకృతి ప్రాధాన్యత మొదలైన ఎన్నో అంశాల్లో భారతదేశంలో నిక్షిప్తమై ఉన్న అపార అనుభవాన్ని, జ్ఞానాన్ని గణనీయంగా నష్టపోయాం. ఫలితంగా ప్రకృతి దోపిడీ, సామాజిక సమతుల్యతకు తీవ్రమైన నష్టం జరిగింది. ఈ కృత్రిమ విభజనను నిర్మూలించి, పట్టణాలు - నగర ప్రాంతాల్లోనే కాక ఇతర ప్రాంతాల్లో జీవించే ప్రజల విజ్ఞానం, వివేకం, సాంస్కృతిక నైతికతను సమకాలీకరించి, పట్టణాలు-నగరవాసులతో అనుసంధానించాల్సిన తక్షణావసరం ఉంది. అందుకే.. ప్రపంచంలో అబ్రహామిక్ మతాలకు పూర్వమున్న మతాలు, సంస్కృతులవారు సైతం ఈ లోక్‌మంథన్‌కి విచ్చేస్తున్నారు. వీరిలో సిరియాలోని రోమోలు, ఆర్మేనియాలోని యజిదీలు (సూర్యపుత్రులు), లిథువేనియా వాసులు సైతం వస్తున్నారు. అబ్రహామిక్ మతాల రాకకు పూర్వం ఆ దేశాలలో అచరించిన, నేటికీ ఆచరిస్తున్న సూర్యారాధన, హవన విధానాలను వీరు హైదరాబాద్ లోక్‌మంథన్‌లో ప్రదర్శించనున్నారు. ఇండోనేషియా కళాకారులు రామాయణం ఆధారంగా ప్రదర్శించే కేచక్ నృత్య ప్రదర్శన సహా లోక ఐక్యతకు ప్రతీకగా నిలిచిన గొప్ప సంప్రదాయాలను వీక్షించే తరుణం లోక్‌మంథన్ ద్వారా సాకారం కానుంది. 'లోక అవలోకనం' ప్రధాన అంశంగా లోక విచార్ (ప్రకృతి, సాంస్కృతిక సంబంధమైన ఆలోచన ప్రక్రియ), లోక వ్యవహార్ (సంప్రదాయాలు-ఆచరణ), లోక్ వ్యవస్థ (సంస్థలు-వ్యవస్థలు) అనే మూడు ఉప అంశాలు లోక్‌మంథన్ భాగ్యనగర్ ఉత్సవం ప్రత్యేకత. ఇందులో భాగంగా లోక జీవనదృష్టి, లోక జీవన విజ్ఞానం, లోక సాహిత్యం, లోక అర్థశాస్త్రం, భారతీయ లోక చేతనలో పర్యావరణం, లోక సురక్ష-న్యాయం, లోక సర్వసమావేశీ వ్యవస్థ తదితర అంశాలపై సదస్సులు ఉంటాయి. ప్రత్యేకించి మన భావితరాలైన విద్యార్థులు, యువతరం దృష్టి సారించేలా లోక్‌మంథన్ రూపకల్పన జరిగింది. భారతీయతకు ప్రాధాన్యతనిచ్చి, ఆ దిశగా ఆలోచన-ఆచరణ చేసేవారిని ఒకే వేదికపైకి తెచ్చి, తద్వారా సామాజిక ప్రధాన జీవన స్రవంతిలో మరుగునపడిన వర్గాలు, సమాజాలకు ఒక స్థానం, ఒక గళం ఇవ్వాలన్నది 'లోక్‌మంథన్' లక్ష్యం. ఈ దృష్టి కోణంలో మేధావులు, కళాకారులు, వివిధ రంగాలవారిని ఒకే వేదికపైకి తీసుకురావాలన్నది మా ప్రయత్నం. జానపద కళలు, జీవనశైలి, పద్ధతులు, సంప్రదాయాలు, సంస్థల వంటివన్నీ.. గొప్ప శాస్త్రీయ, నాగరిక అంశాలుగా చెప్పుకుంటున్న వాటికి ఏ మాత్రం తక్కువ కాదని ఘంటాపథంగా చూపించేందుకే ఈ మహత్తర కార్యక్రమం. లోక్‌మంథన్ 2016 నుంచి రెండేళ్లకు ఒకసారి విభిన్న అంశాలను ఇతివృత్తంగా తీసుకుని-భోపాల్, రాంచీ, గువాహతి నగరాలలో అంతర్జాతీయ మహోత్సవాలను నిర్వహించింది. ఈసారి మన భాగ్యనగరాన్ని వేదికగా చేసుకున్న లోక్‌మంథన్ మహోత్సవాలలో 1,500 మందికి పైగా కళాకారులు 100కు పైగా కళారూపాలను ప్రదర్శించడం, 400కు పైగా అరుదైన సంప్రదాయ సంగీత వాయిద్యాలను చూసే మహదవకాశం ఈసారి ఈ మహోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. లోక్‌మంథన్ ఎగ్జిబిషన్స్‌లో భాగంగా తెలంగాణ, త్రిపుర, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ సహా 10 రాష్ట్రాలకు చెందిన విభిన్న సంస్కృతులు, కళలు, చిత్రాల ప్రదర్శన, సంప్రదాయ ఆహారం, సంప్రదాయ క్రీడలు, సాహిత్యం, చర్చలు ఉంటాయి. లోక్‌మంథన్ ఉత్సవం జరిగే నాలుగు రోజులూ శిల్పారామంలోకి ప్రజలందరికీ ఉచిత ప్రవేశం ఉంటుంది. విశ్వజనీన భావన (వసుధైవ కుటుంబకం)తో పనిచేస్తున్న 'లోక్‌మంథన్ - భాగ్యనగర్' వేడుకల్లో పాలుపంచుకుందాం. సంప్రదాయ విజ్ఞానాన్ని, వివేకాన్ని అవగతం చేసుకుని లోక ఐక్యతా మహాయజ్ఞంలో భాగస్వాములమవుదాం. భారతీయతకు ప్రాధాన్యతనిచ్చి, ఆ దిశగా ఆలోచన-ఆచరణ చేసేవారిని ఒకే వేదికపైకి తెచ్చి, తద్వారా సామాజిక ప్రధాన జీవన స్రవంతిలో మరుగున పడిన వర్గాలు, సమాజాలకు ఒక స్థానం, ఒక గళం ఇవ్వాలన్నది 'లోక్‌మంథన్' లక్ష్యం. ఈ దృష్టి కోణంలో మేధావులు, కళాకారులు, వివిధ రంగాలవారిని ఒకే వేదికపైకి తీసుకురావాలన్నది మా ప్రయత్నం. జానపద కళలు, జీవనశైలి, పద్ధతులు, సంప్రదాయాలు, సంస్థల వంటివన్నీ.. గొప్ప శాస్త్రీయ, నాగరిక అంశాలుగా చెప్పుకుంటున్న వాటికి ఏ మాత్రం తక్కువ కాదని చూపించేందుకే ఈ మహత్తర కార్యక్రమం.

# చట్టంతోనే సోషల్ మీడియా అదుపు సాధ్యం!




అమెరికా, యూరోప్ దేశాలతో పోల్చుకుంటే భారతదేశంలో సోషల్ మీడియా చట్టాలు చాలా బలహీనంగా ఉన్నాయి. దీనికితోడు-ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరించడం వంటి కారణాలతో సాంఘిక మాధ్యమాలు అసాంఘిక మాధ్యమాలుగా మారుతున్నాయి. ప్రత్యర్థులను దొంగ దెబ్బతీయడానికి స్వార్థపర రాజకీయ నాయకులకు సోషల్ మీడియా ఒక ఆయుధంగా మారింది. ఎందరో సంస్కర్తలకు, ఆదర్శవాదులకు నిలయమైన ఆంధ్రప్రదేశ్ నేడు ఈ సోషల్ మీడియా కారణంగానే కులాంధ్రప్రదేశ్‌గా అపఖ్యాతి పాలవుతున్నది. ఎంతోమంది కన్నీళ్ళకు సోషల్ మీడియా వేదికగా మారింది. అమాయకులైన అనేక మంది జీవితాలు మధ్యంతరంగా ముగుస్తున్నాయి. ఇటువంటి స్థితిలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోషల్ మీడియాను వేదిక చేసుకొని ఆరాచకంగా వ్యవహారించిన వారిపై కఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేయడం అభినందనీయం. ఇదంతా చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకొన్నట్టు అనిపించినా, కనీసం ఇప్పటికైనా పోలీసు వ్యవస్థ చర్యలు తీసుకొనే విషయంలో బాధ్యతగా వ్యవహరించడం అవసరం. విజ్ఞానాన్ని పంచుకోవడానికి, సమాచార చేరవేతకు, ప్రభుత్వమూ ప్రజల మధ్య సంధానానికీ ఎంతో ఉపయోగపడగలిగే సోషల్ మీడియాను కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. ఫోటోలను, మాటలను మార్ఫ్ చేస్తూ లేనివి ఉన్నట్లుగా, ఉన్నవి లేనట్లుగా కల్పించడం చేస్తున్నారు. ఫోటోల మార్ఫింగ్, ఫోన్ ట్రాపింగ్‌ల కారణంగా వందల సంఖ్యలో కుటుంబాలు విచ్ఛిన్నం కావడమే గాక అనేకమంది మధ్యంతరంగా జీవితాలను ముగిస్తున్నారు. ఎలక్ట్రానిక్/ కంప్యూటర్ రంగంలో రోజురోజుకీ చోటు చేసుకొంటున్న మార్పులను ప్రజల కంటే ముందు మోసగాళ్ళూ, సంఘ విద్రోహులూ అందిపుచ్చుకుంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడం వల్ల అమాయకులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాను అసాంఘిక కార్యకలాపాల కోసం వాడుతున్న సంస్థలను, వ్యక్తులను నియంత్రించేందుకు ప్రభుత్వ కఠిన వ్యవహార శైలి మాత్రమే సరిపోదు. పటిష్టమైన చట్టాలను కూడా రూపొందించాలి. అమెరికాలో ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (ఎఫ్‌టిసి) పేరిట సోషల్ మీడియాలో వచ్చే మోసపూరిత వ్యాపార ప్రకటనలు, పిల్లలను ఏమార్చే ప్రకటలను నివారించడానికి నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ ఉన్నాయి. సెక్షన్ 230 ప్రకారం సోషల్ మీడియాలో తప్పుడు, మోసపూరిత సమాచారాన్ని చేరవేసేవారిపై కఠిన చర్యలు తీసుకొనే అవకాశం అక్కడ ఉంది. ఇదే చట్టాన్ని సవరించడం ద్వారా ద్వేషపూరిత ప్రసంగాలను, మాటలను ప్రచారం చేయకుండా నిషేధించారు. యూరోప్ దేశాలలో అయితే సమాచారాన్ని దొంగిలించినా, దుర్వినియోగం చేసినా భారీ మొత్తంలో జరిమానాలు విధించే విధంగా చట్టం రూపొందించారు. అసాంఘిక అంశాలు, ఉద్రిక్తతలు రెచ్చకొట్టే ప్రసంగాలు, చట్టసమ్మతంకాని సమాచారాలను




ప్రచారం చేయకుండా ఉండటం కోసం ప్రత్యేకంగా 'డిజిటల్ సర్వీస్ ఆక్ట్'ను రూపొందించారు. అదే విధంగా అభ్యంతరకరమైన మాటలు, అబద్ధపు మాటలు, ప్రసంగాలు 24 గంటల్లోనే సోషల్ మీడియా నుంచి తొలగించడానికి వీలుగా 'ఈయు హేట్ స్పీచ్ కోడ్'ను రూపొందించారు. జర్మనీలో అభ్యంతరకరమైన, అబద్ధపు మాటలు, ప్రసంగాలు 24 గంటల్లోనే సోషల్ మీడియా నుంచి తొలగించని పక్షంలో పెద్ద మొత్తంలో జరిమానా విధించే విధంగా 'నెట్‌వర్క్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆక్ట్'ను రూపొందించారు. ఆస్ట్రేలియాలో సోషల్ మీడియాను నియంత్రించడానికి 'ఆన్‌లైన్ సేఫ్టీ ఆక్ట్' అమల్లోకి తెచ్చారు. అదేవిధంగా చైనా, సింగపూర్‌లలో కూడా సోషల్ మీడియా నియంత్రణకు పటిష్టమైన చట్టాలు అమలవుతున్నాయి. ఆయా దేశాలలో ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్ వంటి సంస్థలన్నీ పైన తెలిపిన చట్టాలకు లోబడే సేవలందిస్తున్నాయి. మన దేశంలో ప్రస్తుతం అమలులో ఉన్న సోషల్ మీడియా చట్టాలు చాలా బలహీనంగా ఉన్నాయి. భారతదేశంలో సోషల్ మీడియా నియంత్రణకు సంబంధించి 2021లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఇంటర్మీడియటరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) రూల్స్ ఒక చట్టం రూపొందించారు. ఈ చట్టం ప్రకారం ఆన్‌లైన్‌లో అసాంఘీక అంశాలు, ఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రసంగాలు, చట్టసమ్మతం కాని సమాచారాలను నియంత్రించాల్సి ఉంది. అయితే ఇందుకు అవసరమైన నిపుణులను, ఇతర సిబ్బందిని ప్రభుత్వాలు తగినంతగా నియమించలేదు. ఈ కారణంగా సోషల్ మీడియా దారుణంగా దుర్వినియోగం అవుతోంది. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఓట్ల సంపాదన, అధికారమే పరమావధిగా చేయకూడని ప్రచారమంతా చేస్తున్నారు. సోషల్ మీడియా ఉచితంగా లభించే వేదిక కావడం వల్ల మరింతగా రెచ్చిపోతున్నారు. ఎవరికి వారు ప్రచారం చేసుకొనే సమయంలో తమ గురించి తాము ఎంత గొప్పగా ప్రచారం చేసుకున్నప్పటికీ ఇబ్బంది లేదు, కానీ ఎదుటి వ్యక్తుల వ్యక్తిత్వాన్ని హననం చేసే విధంగా కామెంట్ చేయడం జీవితాలను అతలాకుతలం చేస్తోంది. ఎన్నికలలో విజయం సాధించడానికి కొన్ని సంస్థలు రాజకీయ పార్టీలకు ఇచ్చే సూచనలు నీచంగా ఉంటున్నాయి. ఇటువంటి నీచపు సలహాలలో భాగంగానే ఒక కులాన్ని దెబ్బతీయడం కోసం "కొండమీద అమ్మవారు... కొండ కింద కమ్మవారు" వంటి దుర్మార్గపు నినాదాలను ప్రచారంలోకి తెచ్చారు. ఇటువంటి అసాంఘిక ప్రచారాన్ని సమర్థంగా నివారించాల్సిన అవసరం ఉంది. సోషల్ మీడియా నియంత్రణకు సంబంధించి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం చట్టాలు చేసుకోవడమే కాకుండా దేశం మొత్తంగా అమలయ్యే విధంగా ఒక నియంత్రణ చట్టాన్ని రూపొందించాలి. ఈ మేరకు మేధావులు, సాంకేతిక నిపుణుల సహకారం తీసుకోవాలి. ఇదే సమయంలో సోషల్ మీడియా నియంత్రణకు చాలీచాలని స్థానిక పోలీసులతో కాకుండా నైపుణ్యం కలిగినవారితో ప్రత్యేకంగా పోలీసింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. సోషల్ మీడియా నియంత్రణకు సంబంధించి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం చట్టాలు చేసుకోవడమే కాకుండా దేశం మొత్తంగా అమలయ్యే విధంగా ఒక నియంత్రణ చట్టాన్ని రూపొందించాలి. ఈ మేరకు మేధావులు, సాంకేతిక నిపుణుల సహకారం తీసుకోవాలి. ఇదే సమయంలో సోషల్ మీడియా నియంత్రణకు చాలీచాలని స్థానిక పోలీసులతో కాకుండా నైపుణ్యం కలిగినవారితో ప్రత్యేక పోలీసింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com